# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల మాస పత్రిక

సంపుటి : 57 సంచిక : 6 జూన్, 2024 పేజీలు : 28 వెల : రు. 10/-


# అభివృద్ధి నిరోధక ఫాసిస్టు బిజెపి దూకుడికి కళ్లెం

**ఎన్నికల** ఫలితాలు వెలువడ్డాయి. చాలామందిని ఆశ్చర్య చకితులను చేశాయి. తిరుగులేని బిజెపి 10 ఏళ్ల పాలనపై ఒక రకపు తీర్పుగా ఈ ఫలితాలను భావించవచ్చు. ఎన్డీఏ కి నాయకత్వం వహిస్తున్న బిజెపి లోక్‌సభలో అధిక స్థానాలను సాధించిన పెద్ద పార్టీగా అవతరించిందే తప్ప, స్వయంగా అధికారంలోకి రాగలిగే సంఖ్యా బలాన్ని సాధించలేక పోయింది. ప్రభుత్వ ఏర్పాటుకు 32 సీట్లు తగ్గాయి. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సాయంతో మరోసారి అధికార పగ్గాలు చేపట్టేందుకు, వారు చేజారకుండా త్వర త్వరగా పావులు కదుపుతోంది. చంద్రబాబు (టీడీపీ), నితీష్‌కుమార్(జేడీ–యు)ల మద్దతు ఉంటేనే మూడవసారి బిజెపి పరిపాలన సాగించగలుగుతుంది. కానీ, అంత సజావుగా మాత్రం సాగించలేదు. మతతత్వ ఎజెండా అమలుకేమీ ఇబ్బంది ఉండకపోవచ్చు.

ఇండియా కూటమి, బిజెపి దూకుడుకు చెక్ పెట్టగలిగిన సంఖ్యతో పార్లమెంటులో ప్రవేశించనుంది. బెంగాల్లో టీఎంసీ, తదితర స్వతంత్రులు చేరితే శక్తి గల కూటమిగా 'ఇండియా' ఉండగలుగుతుంది.

ఇండియా కూటమి అధికారంలోకి రాగలిగినా, కొత్త పరిశ్రమలు నెలకొల్పడం, కొత్త ఉద్యోగాలు కల్పించడం, పరిశ్రమల ప్రైవేటీకరణను ఆపడం, పన్నుల భారం తగ్గించడం చేయబోదు. సంక్షోభ కాలం కొనసాగుతూనే ఉంటుంది. బూర్జువా ప్రతిపక్ష పార్టీల అభిప్రాయాలను గౌరవించడం, వాటి ఉనికిని అంగీకరించడం లాంటి కనీస ప్రజాస్వామిక తత్వాన్ని అనుసరించగలిగితే, పార్లమెంటులో లేని శక్తుల సహకారాన్ని పొందగలుగుతుంది. వామపక్ష, విప్లవ, ప్రగతిశీల, ప్రజాస్వామ్య పక్షాలను ఊపిరాడకుండా చేసే, వాటిని నాశనం చేసే రాజకీయ సంస్కృతికి భిన్నంగా ఉండవలసి ఉంటుంది. అలా లేనప్పుడు, అది కూడా ఫాసిస్టు ప్రభుత్వమే అనిపించుకుంటుంది.

కొత్త పరిశ్రమలు నెలకొల్పడం, నిరుద్యోగ సమస్య పరిష్కరించడం, పరిశ్రమల ప్రైవేటీకరణ, రైల్వేల ప్రైవేటీకరణలను నిరోధించగలగడం ఐదేళ్లలో అయ్యేవి కావు. విదేశీ పెట్టుబడిదారులకు పీటలు వేయకతప్పదు. ప్రపంచ బ్యాంకు, తదితర బ్యాంకుల నుండి అప్పులు సంపాదించక తప్పదు. ఇవి ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే ముందుకు వచ్చే సవాళ్ళు.

ఏది ఏమైనా, ఈ ఎన్నికలు బిజెపి దూకుడికి కళ్లెం వేశాయి. టిడిపి, జెడి–యులు బిజెపి దూకుడుకి తోడ్పడితే, ఈ రెండు పార్టీల నిజస్వరూపం వెల్లడవుతుంది.

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సరళని పరిశీలిస్తే గ్రామీణ, ఫ్యూడల్ పెట్టుబడిదారీ, ఆధిపత్య శక్తులు చక్రం తిప్పాయి. ఫ్యూడల్ అహంభావం, పెట్టుబడిదారీ కుటిలత్వం, రెండూ విజృంభించాయనుకోవాలి. అగ్రకుల అహంకారం, అభిజాత్యం... బిజెపి, టిడిపి, జనసేన కూటమికి అండ నిచ్చింది. బ్రాహ్మణీయ భావజాలం, హిందూమత అభిజాత్యం, బ్యూరోక్రాట్ల, ఉద్యోగస్తుల అసంతృప్తి, డబ్బు, సెలబ్రిటీతనాలను ఈ కూటమి ఉపయోగించుకుంది. తిరుగులేని మెజారిటీ సాధించి, ఫాసిస్ట్ బిజెపి ఒడిలో కూర్చోబోతున్నది. ఆంధ్ర ప్రజలు జాగరూకులై ఉండాలి.

యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ (వైఎస్ఆర్‌పి) పథకాలైన నవరత్నాలను నూటికి నూరుపాళ్ళు అమలు జరిపామని, 2.70 లక్షల కోట్ల రూపాయలు ప్రత్యక్ష నగదు బదిలీ చేశామని, అయినా ఎందుకు ఓడిపోయామో తెలియడం లేదని ముఖ్యమంత్రి 'ఆవేదన 'చెందుతున్నాడు. తనకు 40 శాతం వోట్లు (1.3 కోట్లు ) ఇచ్చినందుకు కన్నీళ్ళ పర్యంత మయ్యాడు. ప్రజలకు నేరుగా అన్నీ చేర్చుతున్నప్పుడు, అంతకంటే పెద్ద వాగ్దానం టిడిపి, బిజెపి, జేఎస్పీ పార్టీలు ప్రకటించి ప్రజలకు ఆశలు కలిగించాయి. ఏ బుర్జువా పార్టీ అయినా ప్రజలను ఆశల పందిర్లు ఎక్కించగలవు. వైసిపి గానీ టిడిపి గానీ ఇచ్చిన వాగ్దానాలు ప్రజలందరికి అందించగలిగాయా? తాను పేదలైన ఎస్‌సి, ఎస్టి, బీసీల సంక్షేమం కోసం కృషి చేస్తున్నానని, ఇది పేదలకు – పెత్తందారులకు నడుమ జరుగుతున్న పోరాటం అని జగన్ పదేపదే మాట్లాడాడు. ఇది రెడ్డి – కాపు – కమ్మ పెత్తందారులకు మింగుడుపడని మరో అంశం. ప్రభువు అంటే క్రీస్తు – ప్రభువు అన్నమాట, ఆ పదం పెద్దగా ఉపయోగించకపోయినా – అతను క్రిస్టియన్ అన్న భావన మత, కుల, ఛాందసుల బుర్రల్లోకి వెళ్ళింది.

గత ఐదేళ్ల పాలనా కాలంలో వైఎస్ఆర్‌పి ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రంలోని బిజెపి మతతత్వ, ప్రజా వ్యతిరేక విధానాలన్నింటికీ వంత పాడుతూ వచ్చింది. వీధుల్లోకి వచ్చిన ప్రజాసమూహాలన్నింటిపై నిర్బంధాలు, నిషేధాలతో నిరంకుశంగా వ్యవహరించేందుకు ప్రత్యేకించి జీవోలను తెచ్చింది. కర్ణుడి చావుకు వేయి కారణాలన్నట్లు, వైఎస్ఆర్‌పి ఓటమికి ఇంకా అనేక కారణాలు ఉండవచ్చు. అయితే వారి ఘోర ఓటమికి కారణంగా సోషల్ ఇంజనీరింగ్‌ను, సంక్షేమ పథకాలను అమలు జరపటాన్ని నమ్ముకోవటమే. కమ్మ – కాపు – రెడ్డి కుల పెత్తందారులు, మత ఛాందసవాదుల అసంతృప్తి తోడైందనే కారణాన్ని కూడా చేర్చు కోవాలి. జగన్ సామ్యవాది కాదు, సామాన్యవాదీ కాదు... అయినప్పటికీ 'కులం, మతం జోలికి వస్తే ఊరుకోము' అనే వాస్తవం రుజువైంది.

ప్రజలు జాగరూకులై ఉండాలి. వ్యవసాయాన్ని రక్షించుకునేందుకు, వ్యవసాయధారిత పరిశ్రమల కోసం, సామ్రాజ్యవాదుల, పెట్టుబడిదారుల ఆధిపత్యాన్ని ధిక్కరించాల్సిన అవసరం, ప్రజా ఉద్యమాలను సంఘటిత పరచుకోవాల్సిన అవసరం ఉంది. ✶

జనశక్తి
విప్లవ కమ్యూనిస్టుల మాస పత్రిక

వెబ్‌సైట్ :
www.janasakthionline.com
ఈ-మెయిల్ :
janasakthi1963@gmail.com

సంపుటి : 57
సంచిక : 6


లోపలిపేజీల్లో....


రాజకీయార్థికం :
బిజెపి దూకుడుకు కళ్లెం 1
2024 సార్వత్రిక ఎన్నికలు - విశ్వం 3
విద్యారంగ వాణిజ్యీకరణ - తోట జ్యోతిరాణి 4
లెనిన్ శతవర్ధంతి సంవత్సరం :
ట్రాట్స్కీవాదుల విచ్ఛిన్నానికి వ్యతిరేకంగా పోరాటం 7
కార్మికవర్గం-రైతాంగం 14
కార్మికవర్గ ఉద్యమాలు :
1974 రైల్వే సమ్మె-గుణపాఠాలు - కొమరయ్య 10
ఉద్యమ చరిత్ర :
రైతుకూలీసంఘం సావనీర్లు - పరిచయం 16
మనుగోపాల, బొమ్మనహాళ్, మక్కువ, పల్నాడు భూపోరాటాలు 22
అంతర్జాతీయం :
పాలస్తీనాకు సంఘీభావం 28
సంస్మరణ :
అల్లూరి శతవర్ధంతి 2
జోహార్లు :
రాగి సుబ్బారావు 27



వెల : విడిప్రతి..................రూ.10/-
సంవత్సర చందా....రూ. 100/-

చిరునామా :
ఎస్.శేషమ్మ, ఎడిటర్
32-13-26/1, బి.ఎం.ఆర్. రోడ్,
ఎం.ఆర్.పురం, విజయవాడ-10.


## 2024 మే 7 - అల్లూరి సీతారామరాజు శతవర్ధంతి

# మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజుకు అరుణారుణ జోహార్లు



**అల్లూరి** సీతారామరాజు 1897 జులై 4న విశాఖ జిల్లా, పాండ్రంగిలో జన్మించాడు. ఇబ్బందుల నడుమ సాగిన ప్రాథమిక విద్యాభ్యాస అనంతరం, విశాఖ ఏవిఎన్ విద్యాలయంలో చదువుతుండగా 1908 సం॥లో తండ్రి హటాన్మరణంతో, కాకినాడ పినతండ్రి వద్దకు ఆయన మకాం మార్చవలసి వచ్చింది. చదువు మీద అంతగా ఆసక్తి కనబరచని సీతారామరాజు, ప్రకృతి పరిశీలనలో, ప్రజల బాధల గురించిన ఆవేదనతో అంతర్ముఖంగా వుండేవాడు. తండ్రి నుండి అందిన జాతీయ భావాలు చిన్నతనంలో రామరాజుపై మంచి ప్రభావం కల్గించాయి.

1913-18 కాలంలో సీతారామరాజు తుని ప్రాంతంలో కృష్ణదేవిపేట, ధార పర్వతాలలో, సమీప గ్రామాలలో మన్యం ప్రజలకు చేరువై, వారి కష్టసుఖాలలో భాగం పంచుకుంటూ వారితో స్థానికంగా పంచాయితీల ద్వారా వారి సమస్యలను పరిష్కరించే క్రమంలో వారి నాయకునిగా ముందుకొచ్చాడు. బ్రిటిష్ పాలకుల కుట్రలను తిప్పిగొట్టి, వేర్వేరు తెగలను ఏకం చేశాడు. ఆయా గ్రామాల ప్రజలందరితో సమావేశాలు జరిపి వారిని కూడగట్టాడు. దేశవ్యాపితంగా పర్యటించి అనేకమంది జాతీయోద్యమ నాయకులతో పరిచయాలు పెంచుకోవటంతోపాటు, బ్రిటిష్ దుర్మార్గ పాలన గురించిన అవగాహనను విస్తృతం చేసుకున్నాడు. ఈ క్రమంలోనే పోరాటయోధులైన గాం గంటందొర, గాం మల్లుదొరలు తోడయ్యారు. తుపాకి పేల్చడంలో ఆదివాసీ యువకులకు శిక్షణనిచ్చి గెరిల్లా పోరాట ఎత్తుగడలను అనుసరించాడు. ఈ విధమైన సన్నాహకాలతో సీతారామరాజు 1920-22 మధ్యకాలంలో రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసుల తిరుగుబాటుకు నాయకత్వం వహించి నడిపించాడు.

బ్రిటిష్ పాలకుల దోపిడీ దుర్మార్గాలను నిరసిస్తూ దేశ వ్యాపితంగా ఎన్నో పోరాటాలూ, తిరుగుబాట్లు జరిగాయి. 1878-80ల మధ్య కాలంలో ద్వారబంధాల రామచంద్రయ్య తదితరుల నాయకత్వంలో మన్యం ప్రాంతంలో మొదటి రంప పితూరీ సాయుధంగా, హింసాత్మకంగా సాగింది. దానిని బ్రిటిష్ పాలకులు అణచివేసినప్పటికీ, ఆదివాసుల అసంతృప్తి అనేక ఆందోళనలుగా తదనంతర కాలంలోనూ ఆగకుండా పెల్లుబుకుతున్న పరిస్థితులలో, ఆదివాసులకు కనీస రక్షణ కల్పించకుంటే, తమ విశాల దోపిడీ ప్రయోజనాలు దెబ్బతింటాయని బ్రిటిష్ పాలకులు భావించారు. తమ పాలన సజావుగా ఎక్కువకాలం సాగటం కష్టతరమవుతుందని గ్రహించి, 'ఏజెన్సీ ప్రాంత ప్రయోజనాలు-భూ బదిలీ చట్టం-1917'ను ముందుకు తెచ్చారు. బ్రిటీషు పాలకుల విధానాలు, వారు సాగించే కొత్త కొత్త రూపాల్లో దోపిడీ, అణచివేతలు ఆదివాసులను మరింత అసంతృప్తికి లోను చేశాయి.

మరోవైపున సమాంతరంగా దేశ వ్యాపితంగా జాతీయోద్యమం ఊపందుకుంది. ఈ నేపథ్యంలో 1922-24 సం॥ మధ్య కాలంలో సీతారామరాజు నాటి విశాఖ, తూర్పుగోదావరిజిల్లా మన్యం గిరిజనులను కూడగట్టి ఉద్యమింపజేశాడు; గెరిల్లా పోరాటం సాగించాడు. బ్రిటిష్ ప్రభుత్వ దుర్మార్గ, నిరంకుశ పాలనపై గిరిజనులు ఆగ్రహించారు. పోడు వ్యవసాయంపై ఆంక్షలు వారిని మరింత వత్తిడికి లోను చేశాయి. అటవీ సంపదను దోచుకెళ్ళటానికి అనువుగా బ్రిటిష్ ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతంలో ప్రారంభించిన రహదారులు, తంతి సౌకర్యాల వంటి నిర్మాణ పనుల్లో పాల్గొన్న ఆదివాసులకు కనీసంగా చెల్లించే కూలీ డబ్బులలోనూ లంచగొండి అధికార్లు కోత విధించటం, **(తరువాయి 25వ పేజీలో)**

# ప్రజా ఉద్యమకారులను-ప్రగతిశీలశక్తులను హెచ్చరిస్తున్న 2024 జనరల్ ఎన్నికలు

## వాగ్దానాల మీద వాగ్దానాలు, వాగ్యుద్ధాలు, దౌర్జన్యాలు, డబ్బు పంపకం చేయడంలో పోటీపడిన బూర్జువా పార్టీలు

**విశ్వం**

**భారతదేశ** పార్లమెంటరీ రాజకీయాలు మరోసారి రసవత్తరంగా మారాయి. దశాబ్దాల కాలం దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ భూస్వాములకు, బడా బూర్జువా వర్గానికి, సామ్రాజ్యవాదులకు సేవ చేసి, చేసి ప్రాభవాన్ని కోల్పోయింది. దాని స్థానంలో మరో బూర్జువావర్గ కూటమి అధికారంలోకి వస్తూ పోతూ బిజెపి రూపంలో గత దశాబ్దకాలం తన చురుకుతనాన్ని, బుద్ధికుశలతను భూస్వామ్య, బూర్జువావర్గాల, సామ్రాజ్యవాదుల సేవకు ఉపయోగించింది. ఈ లభించిన అధికారాన్ని తన మూలపుటమ్మ ఆర్ఎస్ఎస్ హిందూమత సిద్ధాంత వ్యాప్తికి, దానిని తిరుగులేని విధంగా నెలకొల్పడానికి సాధనం చేసుకొంది.

భారత పార్లమెంటరీ, రాజ్యాంగ వ్యవస్థ నిరంకుశ స్వభావాన్ని 1950 దశాబ్దం నుంచి భారతదేశ పీడిత వర్గాలు చవిచూస్తూనే వున్నాయి. 1940లలో రైతాంగ, కార్మికవర్గ ఉద్యమాలతోపాటు బ్రిటీష్ సామ్రాజ్య వ్యతిరేక పోరాటాలను అణచడానికి 1930ల నాటి రాజ్యాంగ చట్టమే సాధనమయింది. దాని ఒరవడిలోనే 1956 రాజ్యాంగ చట్టం. కార్మిక, రైతాంగ ఉద్యమాలను, ప్రజాస్వామిక విప్లవోద్యమాలను అణచడానికి సాధనం చేసుకొంది.

జాతుల స్వయం నిర్ణయాధికార సమస్య; పీడిత దళిత కులాల, వెనుకబడిన కులాల రక్షణ సమస్య; ఆదివాసీ ప్రజల రక్షణ సమస్య – గత 70 సంవత్సరాల కాలంలో ఒక విస్పష్టమైన, ఖరాఖండి రూపంలో పరిష్కరించకుండానే భారత బడాబూర్జువా వర్గం, తన కుయుక్తులతో సాగదీస్తూ వచ్చింది. బుజ్జగింపులు, బెదిరింపులు, అణచివేతలు ఒకవైపు, హామీలు, రాయితీలు, సంస్కరణల ప్రకటనలు మరోవైపు ప్రయోగిస్తూ పీడిత ప్రజలను దగాచేస్తూ వచ్చింది. నిరుద్యోగ సైన్యాన్ని పెంచింది. స్వయం ఆధారిత వ్యవసాయ విధానం, స్వతంత్ర పారిశ్రామిక విధానం–వ్యవసాయ, పారిశ్రామిక రంగాల పరస్పర అభివృద్ధికి బదులు పరాధీన విధానాలను అనుసరించింది. దీని ఫలితంగానే నిరుద్యోగ సైన్యం – విద్యావంతులయిన యువకులు – పరిమిత విద్య గల యువకులు, అసలు విద్యకు నోచుకోని మారుమూల గ్రామీణ యువత – ఈ మొత్తాన్ని కలిపి నిరుద్యోగ సైన్యం అంటున్నాం. అత్యంత నీచమైన, అమ్ముడుపోయిన విధానాల మూలంగా సంభవిస్తూ వచ్చిన, ఈ పరిణామమే నిరుద్యోగ పరిస్థితి ఇంతగా పెరగడానికి కారణం.

గ్రామస్వరాజ్యం, స్వయం ఆధారిత విధానం, సహకార ఉద్యమం, సోషలిస్టు నమూనా ఆర్థిక విధానం, అలీన విదేశాంగ విధానం, స్వతంత్ర రక్షణ రంగం, నీటివనరుల ప్రాజెక్టులు, భూసంస్కరణల విధానాలు, లౌకిక–ప్రజాస్వామిక ప్రకటనల ఆర్భాటం నుండి, ఆకుపచ్చ విప్లవం, గరీబీ హఠావో, బ్యాంకుల జాతీయీకరణ, భూపరిమితి చట్టం, ఇరుగు పొరుగులతో యుద్ధం, సామ్రాజ్యవాదులతో రక్షణ ఒడంబడికలు, ఆయుధ ఒప్పందాలు, సామ్రాజ్యవాద దురాక్రమణ యుద్ధాలకు మౌలిక అండదండలు, దేశ ప్రజలను అణచడానికి మీసా, నాసా, ఉపా, డిఐఆర్ లాంటి చట్టాలతో ప్రజాస్వామికశక్తుల జీవితాలతో ఆడుకుంది. రైతాంగ ఉద్యమ నేతలను, కార్యకర్తలను హింసకు గురి చేసింది. ప్రజలపై హత్యాకాండ జరిపింది, పారిశ్రామిక శాంతి పేరుతో కార్మిక వర్గాన్ని అణచివేయడం, బడాపెట్టుబడిదారులతో కలిపి విదేశీ పెట్టుబడిని ఆహ్వానించడం, సమ్మెలు జరగనివ్వమనే హామీ, గ్యారెంటీలనిచ్చి శ్రమజీవులు లొంగి వుండేట్లు చేయడం, నోరు మెదపనీయకుండా చేయడం లాంటి విధానాలు చేపట్టింది. ఆ తర్వాత 1990 దశకంలో గాట్ ఒప్పందం, సరళీకరణ, ప్రైవేటీకరణ, గ్లోబలీకరణ విధానాలను రుద్దింది. సాంస్కృతికంగా వ్యక్తివాదానికి పెద్దపీట వేసింది. సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ దేశాలలో దశాబ్దాల పూర్వం నుంచే అమలు జరపబడుతూ వున్న ఆధునికాంతర సిద్ధాంతాలను అనేక పద్ధతులతో పోషిస్తూ నిలబెడుతూ, శ్రామికవర్గ పోరాటాల, ప్రజాస్వామిక ఉద్యమాల అవసరాన్నీ, ప్రాధాన్యతను నీరుగారుస్తున్నారు.

**II**

గత భారత రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితి కొనసాగింపుగానే పదేళ్ల బిజెపి పాలన వుంది. జోడింపుగా హిందూరాజ్య స్థాపన లక్ష్యాన్ని భారత ప్రజలపై రుద్దడానికి ఫాసిస్టు పద్ధతులనాశ్రయించింది.

2014 ముందు నుంచే లాల్ క్రిష్ట అద్వానీ రథయాత్ర, అయోధ్య బాబ్రీ మసీదు వివాదం, బాబ్రీ మసీదుకి యిటుకలు తీసుకురండని శిలాన్యాస్ రామభక్తులకు పిలుపునివ్వడం లాంటి హిందూమత ప్రాశస్త్యాన్ని చాటే పేరుతో మతతత్వ భావోద్రేకాలకు పునాదిరాయి వేశారు.

బిజెపి పాలన గత ప్రచారపు కొనసాగింపుగానే హిందూ రాజ్యం, అయోధ్యలో రామమందిర నిర్మాణం, వారణాసి జ్ఞానవాసి సమస్యలతో హిందూమత భావోన్మాదాన్ని పెంచడానికి పూనుకొంది. భారతదేశ బడా బూర్జువావర్గానికి, విదేశీ పెట్టుబడిదారులకు సేవలు చేస్తూ అమెరికా సామ్రాజ్యవాద విధానాలకు వంత పాడుతూ, దేశంలో ప్రాంతీయ విభేదాలను రెచ్చగొడుతూ విభజించి పాలించు అన్న దోపిడీ సూత్రాన్ని అమలు జరిపింది. ముస్లిం రిజర్వేషన్లు తీసివేస్తామని హిందూమత శక్తులకు, రిజర్వేషన్ వ్యతిరేక వాదులకు సంతోషం కలిగించే ప్రకటనలు చేసింది. విదేశాలలో వున్న (స్విస్ బ్యాంకులో) దాచుకొన్న మిలినీయనర్ల డబ్బంతా తెస్తానన్న మాటను వదిలేసి, నోట్లరద్దు, జిఎస్‌టిలతో డబ్బుగల అత్యంత ధనికులకు ఉపకరించే చర్యలను చేపట్టింది. ఆదాని, అంబానీల సేవలో మునిగింది.

బూర్జువా ప్రతిపక్ష పార్టీలు బిజెపి ప్రభుత్వ ఈ చర్యలను ఆసరా చేసుకొని ఇండియా కూటమిగా ఏర్పడి బూర్జువా పార్టీలను, పార్లమెంటరీ ప్రతిపక్షాలను సమీకరించే కర్తవ్యాన్ని చేపట్టాయి. అట్టహాసంగా ముందు కొచ్చిన బీహార్ ముఖ్యమంత్రి నితీష్, బెంగాల్ ముఖ్యమంత్రి మమత వెనక్కుపొయ్యారు. వామపక్ష ప్రతిపక్షం, రివల్యూషనరీ ప్రతిపక్ష శక్తులు కొందరు 'ఇండియా' కూటమిని స్వాగతించాయి. ఫాసిస్టు ప్రమాదం – హిందూ ఫాసిస్టు ప్రమాదంను ఎదుర్కొనడం నేటి కర్తవ్యంగా స్వీకరించాయి. ఎన్నికల నినాదంతో ప్రచార ఉధృతిని పెంచాయి. Indian National Developmental Inclusive Alliance (ఇండియా) పేరు పెట్టుకొని ఇండియా కూటమిలోని వారు కొన్ని చోట్ల పరస్పరం పోటీ చేసుకున్న సందర్భాలూ వున్నాయి. అయినప్పటికీ కూటమిని చివరిదాకా ఓపికతో నిలబెట్టు కొచ్చారు. ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క విధంగా పరిస్థితిని బట్టి సమన్వయం చేసుకోవడంలో కూటమి నాయకుడు ఖర్గే సఫలీకృతుడయ్యాడు.

(తరువాయి 15వ పేజీలో)

# విద్యారంగ వాణిజ్యీకరణ

## సంక్షోభం నుండి తీవ్రమైన సంక్షోభంలోకి

ప్రొ॥ తోట జ్యోతీరాణి

**నేడు** గ్లోబల్ ఆర్థిక వ్యవస్థలన్నీ మాంద్యం దిశగా పరుగులు పెడుతున్నాయి. నిరుద్యోగ సమస్య తీవ్రమవుతున్నది. ఉద్యోగాలను కోల్పోవడం వేగమందుకున్నది. మరొకవైపు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చదివిన చదువులు, నేర్చుకున్న నైపుణ్యాలు త్వరత్వరగా పనికిరానివి అవుతున్నాయి. శ్రామిక ప్రపంచం మొత్తంగా సంక్లిష్టమైన సంక్షోభంలో బందీ అవుతున్నది. ఇటువంటి విపత్కర పరిస్థితుల నేపథ్యంలో గ్లోబల్ విద్యా మార్కెట్ విలువ 2027 నాటికి 7 ట్రిలియన్ల అమెరికన్ డాలర్లకు (560 లక్షల కోట్ల రూపాయలకు) చేరు కుంటుందన్న అంచనాలకు పెట్టుబడిదారీ వర్గం రావటం ఎలా సాధ్యమైంది? విశాల శ్రామిక ప్రపంచానికి భిన్నంగా మరొక శిఖర స్థాయి ఆదాయ వర్గాల ప్రపంచమేదో వీరి విద్యా మార్కెట్ విలువకు గ్యారంటీ వున్నట్టే. పెరుగుతున్న అసమానతలు, విద్యారంగంలో ఏర్పడిన అపసవ్యతల మూలంగా అవకాశాలలో అసమత్వాన్ని పెంచుతాయి, తద్వారా అసమానతల గ్రాఫ్ ఇంకా పెరుగుతూ పోతుంది.

మన దేశంలో 1985లో మొదలై క్రమంగా 1990లలో విద్యారంగంలోకి ప్రవేశించిన ప్రైవేటీకరణ వల్ల విద్య వాణిజ్య సరుకైంది. అనేక పరిణామాల తర్వాత గుత్త పెట్టుబడుల లాభాల చట్రంలో బందీ అయింది. ప్రజలందరికీ అందుబాటులోకి రావాల్సిన విద్య పబ్లిక్ వస్తువుగా అదృశ్యమైంది. దీనివల్ల విద్య సార్వత్రిక మానవ హక్కు కానేకాదు. గుత్త పెట్టుబడుల మార్కెట్‌కు, లాభాలకు ఒక బలమైన సాధనమైంది. కార్పొరేట్ శక్తుల గుప్పిట్లో వున్న విద్యారంగం లక్ష్యం ఏమిటి? కేవలం గుత్త పెట్టుబడుల లాభాలు, ఆధిపత్యమే. ఇటువంటి విద్య కోసం భారీ ఫీజులు కడుతూ, పరుగులు పెడుతూ నేర్చుకుంటున్న యువత, కార్పొరేట్ శక్తుల ప్రయోజనం దృష్టి కోణం నుండి మాత్రమే ఆలోచించగలుగుతారు, పనిచేస్తారు. అంటే శ్రామిక ప్రపంచం యొక్క సమస్త మేధో సృజనాత్మక శక్తుల దిశను కూడా నిర్ణయించేది, నిర్ధారించేది కార్పొరేట్ శక్తులే.

ఈ నేపథ్యంలో తప్పనిసరిగా విద్యారంగం లక్ష్యాలు, లక్షణాలుగా వుండవలసిన సమత్వం, సమంగా అందుబాటులోకి రావడం, సమిష్టితత్వం, సామాజిక చైతన్యం, నాణ్యతలనేవి గంభీర సమస్యలుగా ముందుకొచ్చాయి. అట్టడుగు వర్గానికి చెందిన మెజారిటీ ప్రజలు విద్యకు దూరమైనారు. ఆస్తులనమ్మి, అప్పులు చేసి చదివించాల్సిన పరిస్థితి వల్ల వర్ధమాన దేశాలకు చెందిన మధ్యతరగతి వర్గానికి ఆర్థికంగా పెనుభారం అవుతున్నది. దీనితో పాటు సమాంతరంగా కోచింగ్ సెంటర్లలో భారీ ఫీజులు కడుతూ వివిధ నైపుణ్యాలను నేర్చుకోవటం తప్పనిసరయింది. ఏ నైపుణ్యంతో ఏ ఉద్యోగం వస్తుందో తెలియదు. దొరికినా ఉద్యోగం వుంటుందన్న గ్యారంటీ లేదు. భయంకరమైన అనిశ్చిత పరిస్థితి. ఏ కోర్సుకు డిమాండ్ ఉంటుందని ప్రచారమయితే, ఆ నైపుణ్యాన్ని నేర్చుకోవడానికి పరుగులు పెట్టడం యువత నిత్య కృత్యమైంది. సంక్లిష్టమైన ఉద్యోగ సంక్షోభంలో మెజారిటీ ప్రజల బతుకులు చితికి పోతున్నాయి.

ఆశ్చర్యకరంగా, మెజారిటీ ప్రజల జీవన్మరణ సమస్యలే విద్యా మార్కెట్‌ను విస్తృతం చేయడానికి, కార్పొరేట్‌శక్తుల అత్యధిక లాభాలకు సాధనాలుగా మారటం విషాదమే, తీవ్ర వైరుధ్యమే. రోజురోజుకూ తీవ్రమవుతున్న నిరుద్యోగిత, మరింత తీవ్రంగా కోల్పోతున్న ఉద్యోగాలు, త్వరత్వరగా కాలం చెల్లిపోతున్న నైపుణ్యాలు మొదలైన సమస్యలకు, వ్యవస్థ సంక్షోభానికి పరిష్కారం ఏమిటి? తన లాభాలు, కొనసాగింపు దృష్ట్యా మాత్రమే పరిష్కారాలు వెతుక్కునే సామ్రాజ్యవాద దోపిడీ వ్యవస్థ ఏం చెబుతుంది? ఎప్పటికప్పుడు వేగంగా శ్రామిక ప్రపంచం తమ నైపుణ్యాలను నవీకరించుకోవాలని, అందువల్లనే ఉద్యోగాలు దొరికే అవకాశాలు పెరుగుతాయని బలంగా చెబుతూ కార్పొరేట్ శక్తులు, యువతను మభ్యపెడుతున్నాయి. కొత్త కోర్సులు అంటూ భారీ ఫీజులతో, అత్యాధునిక సౌకర్యాలతో అతిపెద్ద ఉన్నత విద్యాసంస్థలను స్వదేశీ, విదేశీ గుత్త పెట్టుబడులు తెరుస్తున్నాయి. సంక్షోభానికి అసలు కారణాన్ని శ్రామిక ప్రపంచం తెలుసుకోకుండా కార్పొరేట్ శక్తులు జాగ్రత్త పడుతున్నాయి. ఆశల భ్రమలను కల్పిస్తున్నాయి.

కోవిడ్ విపత్తు కాలంలో తప్పనిసరైన ఆన్‌లైన్ విద్య వల్ల వర్ధమాన దేశాలలో, ప్రత్యేకించి భారతదేశంలో మెజారిటీ విద్యార్థులు విద్యకు దూరమైన వాస్తవం అందరికీ తెలిసిందే. ఇందుకు విరుద్ధంగా డిజిటలైజేషన్, ఆన్‌లైన్ విద్యలకే భవిష్యత్తు వుంటుందని బలంగా ప్రచారం చేస్తున్నారు. రాబోయే రెండు సంవత్సరాలలో ప్రపంచ స్థాయిలో 200 మిలియన్ల మంది స్మార్ట్ ఫోన్లను ఉపయోగించే వాళ్లు అదనంగా పెరుగుతారని అంచనాలు వేస్తున్నారు. దీనితో 2025 నాటికి ప్రపంచంలో స్మార్ట్ ఫోన్లను వాడే వాళ్ళ సంఖ్య 7.5 బిలియన్లకు (750 కోట్లకు) చేరుకుంటుందని అంచనాలు వేస్తున్నారు. టీచర్లకు బోధించే సాధనాలు, విద్యార్థులు నేర్చుకునే సాధనాలు అంటూ ఎప్పటికప్పుడు మెరుగుపరుస్తున్నామని చెబుతున్న ఎడ్ టెక్ రంగం (Global Education Technology) యొక్క సంయోజిత వార్షిక (Compound Annual growth rate) వృద్ధి రేటు 18 శాతం వుంటుందని, 2028 నాటికి ఈ మార్కెట్ విలువ 500 బిలియన్ల అమెరికన్ డాలర్లు (40 లక్షల కోట్ల రూ॥లు)వుంటుందని అంచనాలు వేస్తున్నారు. ప్రధాన స్రవంతిలో విద్యకు దూరం అవుతున్న వాళ్ల సంఖ్య పెరిగిన కొద్దీ ఈ మార్కెట్ బలపడుతుంది. గౌరవప్రద మైన ఉపాధులు అసలే లభించక పోవటంతో యాప్ కంపెనీలలో అత్యధిక దోపిడీకి గురవుతున్న గిగ్ కార్మిక వ్యవస్థ ఏర్పడటం, బలపడటం మనం చూస్తూనే వున్నాం. ఇదేవిధంగా, విద్యారంగం ప్రైవేటీకరణ వల్ల ప్రధాన స్రవంతి విద్యకు దూరమైన అట్టడుగు వర్గానికి చెందిన మెజారిటీ విద్యార్థులు యాప్ కంపెనీల ద్వారా చదువుకునే విద్యార్థులుగా ఏర్పడతారు. టీచర్‌తో సహా తోటి విద్యార్థులతో ఎవరికీ పరిచయం వుండదు.

కార్పొరేట్ శక్తుల లాభం కోసం, కార్పొరేట్ శక్తులే నడుపుతున్న ఉన్నత విద్యాసంస్థలలో గాని, ఆన్‌లైన్‌లో గాని చదువుకుంటున్న విద్యార్థులు నేర్చుకునే విద్య మొత్తంగా కార్పొరేట్‌శక్తుల ప్రయోజనపు దృష్టి కోణం నుండే వుంటుంది. విద్య నుండి విద్యార్థులు పూర్తిగా పరాయీకరించబడతారు. విద్య నుండి ఆశించే సమస్త వ్యక్తిగత, సమిష్టి, సామాజిక, మానవీయ ప్రయోజనాలన్నీ రద్దువుతున్నాయి. సకల మానవ సంబంధాలు విధ్వంసం అవుతున్నాయి. విద్యా రంగంలో కేవలం కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలే ఉనికిలో వుంటాయి. అందుకోసం రోజుకు ఎన్ని గంటలైనా పనిచేయడంతోనే తమ

బ్రతుకుతెరువు ముడిపడి వుంటుందని శ్రామిక ప్రపంచం బలంగా విశ్వసించే స్థితికి నెట్ట బడుతున్నది.

### విద్యా వాణిజ్యీకరణ – ప్రపంచ ధోరణులు :

ప్రపంచీకరణ విస్తరించడం వల్ల 1990 లోనే ప్రపంచ దేశాలలో విద్యా రంగంలో ప్రైవేటీకరణ ఊపందుకుంది. ప్రపంచ వాణిజ్య సంస్థ జనవరి 1995 నుండి అమలుచేస్తున్న గాట్స్ జనరల్ ఎగ్రిమెంట్ ఆన్ ట్రేడ్ ఇన్ సర్వీసెస్–(GATs)ఒప్పందంతో విద్యారంగంలో వాణిజ్యీకరణ బలపడింది. ప్రపంచంలో ప్రభుత్వ విద్య నిలిచిపోయింది. ప్రైవేట్ రంగాన్ని ఆదర్శవంతం అని కీర్తించటం తీవ్రం అయింది. ఉన్నత విద్యలో ప్రైవేటీకరణ బాగా విస్తరించింది. సమాంతరంగా ప్రభుత్వాలు ఉన్నత విద్యకు సబ్సిడీలు ఇవ్వటం తగ్గించాయి. అత్యధిక ఫీజులతో విద్యా వ్యయాన్ని రాబట్టుకోవడం సాధారణం అయింది. ఇదొక మార్కెట్ నమూనా. విద్యను వాణిజ్య సరుకుగా మార్చే క్రమం. విద్యారంగంలో అంతర్జాతీయీకరణ పేరుతో ప్రపంచ దేశాల విద్యా రంగంలో గుత్త పెట్టుబడులు ప్రవేశించి ఆక్రమించుకోవటానికి అనుకూల పరిస్థితులను సృష్టించారు. ప్రపంచీకరణ వల్ల ప్రపంచ దేశాలలో ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరిగాయి. విద్యా వాణిజ్యీకరణ వల్ల మేధో సృజనాత్మక శక్తులను ఉపయోగించటం సంపన్న వర్గాలకే పరిమితం అవుతుంది. లక్ష్యం రద్దవుతుంది. పేదరికం, ఉపాంతీకరణ (మార్జినలైజేషన్)వల్ల ప్రపంచంలో స్కూలుకు వెళ్లవలసిన వయస్సులో వున్న 7 కోట్ల 20 లక్షల మంది పిల్లలు బడికి పోలేని స్థితి కొనసాగుతున్నది. ప్రపంచంలో 50 శాతానికి పైగా పిల్లలకు రెండు సంవత్సరాలపాటు విద్య కూడా లభించని తీవ్రమైన విద్యా పేదరికంలో వున్నారని అంచనా.

విద్యలో, ప్రధానంగా వర్ధమాన దేశాల్లో లింగ అసమానతలు తీవ్రంగా వున్నాయి. OECD (ఆర్గనేజషన్ ఫర్ ఎకనమిక్ కోపరేషన్ ఫర్ డెవలప్‌మెంట్) గ్లోబల్ నివేదిక–2019 ప్రకారం ప్రస్తుత ధోరణి ఇదేవిధంగా కొనసాగినట్లయితే, 2030లో సాధించవలసిన సుస్థిరాభివృద్ధి లక్ష్యం – SDGs 5, ఇంకా 200 సంవత్సరాలకు కూడా సాధించటం సాధ్యం కాదు. ప్రైవేటు స్కూళ్లు అసలే లేని ఫిన్ లాండ్, కొద్దిపాటి ప్రైవేట్ విద్య వున్న నార్వే మానవాభివృద్ధి సూచీలో శిఖరాగ్ర భాగాన నిలుస్తున్నాయి. ప్రపంచ సంతోష సూచీలో కూడా ముందుంటున్నాయి. అందువల్లనే విద్యారంగం మొత్తం ప్రభుత్వ నిర్వహణలోనే ఉచితంగా అందజేయటం తప్పనిసరి అని ఆక్స్ ఫాం 2014 నుండే చెబుతున్నది. ఆర్థిక అసమానతలు, విద్యలో అసమానతలు పరస్పరం బలోపేతం చేసుకుంటాయి. సంక్షుభిత ప్రపంచం ఏర్పడుతుంది.

### విద్యా వాణిజ్యీకరణ – దక్షిణాసియా :

దక్షిణాసియా ప్రాంతంలో భారతదేశంతో పాటు బంగ్లాదేశ్, భూటాన్, మాల్దీవులు, నేపాల్, శ్రీలంక, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ వుంటాయి. ప్రపంచ జనాభాలో 25 శాతం జనాభా ఈ దేశాలలోనే. నిరక్షరాస్యతలో ఈ ప్రాంతానిది ప్రపంచంలోనే రెండవ స్థానం. అత్యధిక అక్షరాస్యతతో వున్న శ్రీలంక ఇందుకు మినహాయింపు. అతి చిన్న దేశమైన మాల్దీవుల్లో కూడా అక్షరాస్యత అధికం. ప్రపంచీకరణతో ఆర్థిక అసమానతలు, విద్యా ప్రైవేటీకరణతో విద్యలో అసమానతలు తీవ్రంగా వున్న ప్రాంతం ఇది. యునెస్కో, నవంబర్ 2022 నివేదిక ప్రకారం ఈ ప్రాంతంలో ప్రైవేటీకరణ సాపేక్షికంగా అధికం. దీనితో సమత్వం, నాణ్యత ప్రధాన సమస్యలైనాయి. ప్రాథమిక విద్యా స్థాయి పిల్లల్లో 12.5 మిలియన్ల మంది(1కోటి 25 లక్షలు) సెకండరీ విద్యా స్థాయిలో 16.5 మిలియన్ల (1కోటి 65 లక్షలు) మంది పిల్లలు స్కూలు బయటనే వున్నారు. 30 శాతం మంది యువతకు ఏ చదువూ, శిక్షణా లభించడం లేదు. ప్రైవేట్ విద్యా రంగంతో పాటు విదేశీ యూనివర్సిటీలకు అనుమతులు లభిస్తున్నాయి. ప్రభుత్వ విద్య పతనమవుతున్నది. ఉన్నత విద్య వాణిజ్యీకరణ వల్ల మెజార్టీ ప్రజలు విద్యకు దూరమవుతున్నారు.

అందువల్లనే దక్షిణ ఆసియా దేశాలలో విద్యా ప్రైవేటీకరణను వ్యతిరేకించటం, ప్రతిఘటించటం తీవ్రమవుతున్నది. కాబట్టి నేపాల్‌లో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థలు, విదేశీ ఉన్నత విద్యా సంస్థలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగినప్పటికీ, గ్లోబల్ విద్యా ప్రమాణాలలో, ప్రత్యేకించి భారతదేశంలో కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థలు ఐఐటి, ఐఐఎంలు వుంటున్నాయి. విద్యా వాణిజ్యీకరణతో ముడిపడి వున్న సమస్త సమస్యలు బయటపడటం వల్ల ఈ దేశాలలో విద్యా వాణిజ్యీకరణకు వ్యతిరేకత తీవ్రమైంది. కాగా, నయా ఉదారవాద విధానాలను బలంగా అనుసరిస్తున్న ప్రభుత్వాలు విద్యా వాణిజ్యీకరణను బలోపేతం చేయటానికి చర్యలు తీసుకోవడం సీరియస్ వైరుధ్యమే.

### విద్యారంగం – చైనా :

ఆర్థిక సంస్కరణల పేరిట మార్కెట్ ఆర్థిక వ్యవస్థను చైనా ఆమోదించడంతో 1993లో విద్యారంగం వాణిజ్యీకరించబడింది. ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల్లో అత్యధిక ఫీజులు సాధారణం అయినాయి. చైనా విద్యారంగం మీద ప్రైవేట్ గుత్తాధిపత్యం బలపడింది. సంపన్నులకు మాత్రమే అందుబాటులో వుండే ఖరీదైన విశ్వవిద్యాలయాలు ఎక్కువైనాయి. భారీ స్థాయి ఫీజుల వల్ల మెజారిటీ ప్రజలు విద్యకు నిరాకరించబడుతున్నారు. ఈ విధంగా విద్యా వాణిజ్యీకరణతో చైనాలో వర్గ వ్యత్యాసాలతో పాటు గ్రామీణ – పట్టణ ప్రాంత అసమానతలు కూడా తీవ్రం అయినాయి.

విదేశీ ఉన్నత విద్యాసంస్థలను చైనా ఆహ్వానిస్తున్నది. కానీ 2021 జూలై, 24న రూపొందించిన నూతన విద్యా విధానం, ఉన్నత విద్యలో లాభాలను ఆమోదించదు. ఉన్నత విద్యాసంస్థలు మూలధన మార్కెట్ నుండి విత్తాన్ని సమకూర్చుకోవటానికి అనుమతులు వుండవు. ప్రైవేటు ఉన్నత విద్యా గుత్త సంస్థలు ఏర్పడకుండా ప్రైవేట్ విద్యాసంస్థల మిలాఖత్తును, విలీనాలను చైనా నిషేధించింది. విద్యా వాణిజ్యీకరణవల్ల అసమానతలు తీవ్రమవుతాయని, వర్గాల వ్యత్యాసం పెరుగుతుందని చైనా అనుభవం కూడా రుజువు చేస్తున్నది.

### విద్యా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రపంచ స్థాయి పోరాటాలు :

ప్రైవేటు విద్య ప్రజాస్వామిక, ప్రగతి శీలమైన మార్పుకు వ్యతిరేకం. విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యాలను కృంగదీస్తుంది. సమిష్టి అవసరాల కోసం సమిష్టి బాధ్యత, సామాజిక చైతన్యం అంతమవుతాయన్న వాదనలు బలపడ్డాయి. అధ్యాపకులు, విద్యార్థుల మధ్య సంబంధాలు, విద్యా ప్రైవేటీకరణ వల్ల 'సేవలను అందించేవారు – కొనుగోలుదారుల' మధ్య సంబంధాల స్థాయికి కుదించి వేయబడ్డాయి. ఉదారవాద విధానాలు విద్యా ప్రైవేటీకరణను బలోపేతం చేస్తున్నాయన్న చైతన్యం పెరిగింది.

ప్రభుత్వ విద్య ద్వారానే విద్యా విస్తరణ, సమత్వం, సమర్థత సాధ్యమవుతాయన్న అవగాహన పెరిగింది. విద్య వాణిజ్య సరుకుగా వుండకూడదు. ప్రభుత్వ ఉచిత విద్య ద్వారానే విద్యా ప్రాథమిక హక్కు వాస్తవమవుతుంది. ఈ అవగాహనతో 2015 లోనే 'విద్య వాణిజ్యీకరణ, ప్రైవేటీకరణలకు ప్రపంచవ్యాపిత ప్రతిస్పందన'

అన్న ఉద్యమం మొదలైంది. గ్లోబల్ కార్పొరేట్ శక్తులను, విద్యా ప్రైవేటీకరణను, వాణిజ్యీకరణను ప్రోత్సహించే విద్యా సాంకేతిక కంపెనీలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఎడ్యుకేషనల్ ఇంటర్నేషనల్ ఏర్పడింది.

ఇది 'ప్రపంచ విద్యా ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి' సంఘీభావం. ప్రపంచంలోని అన్ని దేశాలకు ఈ ఉద్యమం విస్తరిస్తున్నది. విద్యార్థుల ఉద్యమాలకు మద్దతునిస్తున్నది. 2022 జూన్ 12-15 తేదీలలో జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ యొక్క మంత్రిత్వస్థాయి సదస్సులో విద్యా వాణిజ్యీకరణ వల్ల ప్రపంచానికి ఏర్పడే ముప్పు గురించి ఈ సంస్థ హెచ్చరించింది. దీని ప్రభావం వల్ల 2016 తర్వాత ప్రపంచంలో అనేక ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థలలో పెరుగుతున్న ఫీజులను, తగ్గుతున్న సబ్సిడీలను, తగ్గిస్తున్న సీట్ల సంఖ్యను, అమలుజరుపుతున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ విద్యార్థుల ఉద్యమాలు తీవ్రం అయినాయి. అయినప్పటికీ కేవలం గుత్త పెట్టుబడుల లాభాలు, ఆధిపత్యం కోసం విద్యా వాణిజ్యీకరణ వేగవంతం అవుతూనే వున్నది. మెజారిటీ ప్రజల జీవితాలను విధ్వంసం చేస్తూనే వున్నది. ఈ ధోరణిని ప్రతిఘటించే బలమైన పోరాటాలు రావాల్సిందే.

## భారతదేశం – విద్యా వాణిజ్యీకరణ :

భారతదేశంలో ఉన్నత విద్య గుత్త పెట్టుబడుల స్వాధీనంలో వున్న వాస్తవం అందరికీ తెలిసిందే. మన దేశ విద్యా మార్కెట్ విలువ 2022 నాటికి 190 బిలియన్ల అమెరికన్ డాలర్లు (15 లక్షల 20వేల కోట్ల రూపాయలు) వున్నదని, 8 శాతం వార్షిక వృద్ధిరేటుతో 2025 నాటికి 225 బిలియన్ల అమెరికన్ డాలర్లకు (18 వేల కోట్లరూపాయలకు) చేరుకుంటుందని అంచనాలు వేస్తున్నారు. ఏప్రిల్ 2020 - సెప్టెంబర్ 2022 మధ్యకాలంలో ఈ రంగం లోకి వచ్చిన విదేశీ పెట్టుబడులు 869 కోట్ల అమెరికన్ డాలర్లని (69,520 కోట్ల రూ॥లు) గొప్పగా చెబుతున్నారు. విద్యారంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతులను ఇవ్వటం వల్ల మన విద్య అంతర్జాతీయీకరణ చెందిందని గర్వపడుతున్నారు. 2001 నుండి ఈ రంగం 400 శాతం వృద్ధితో బలంగా వాణిజ్యీకరించబడింది, గుత్త పెట్టుబడుల స్వాధీనమైంది. అయినప్పటికీ, 2015 నాటికి ఉన్నత విద్యలో నమోదు రేటు 23 శాతానికి మించలేదు. బ్రూకింగ్ సంస్థ నివేదిక ప్రకారం 2019-20లో నమోదు రేటు 27.1 శాతం మాత్రమే. 2020-21లో ఇది 27.2 శాతానికి చేరిందని AISHE అంచనాలు చెబుతున్నాయి. అంటే 70 శాతానికి పైగా మన యువతకు ఉన్నత విద్య అందుబాటులో లేదు. ప్రధాన స్రవంతి ఉన్నత విద్యకు నిరాకరించబడిన, అట్టడుగు వర్గ యువతకు ఆన్‌లైన్ విద్య తప్ప మరొక ప్రత్యామ్నాయం లేదు.

తినీ తినక, ఆస్తులను అమ్మి, అప్పులు చేసి, బ్యాంకు రుణాలు తీసుకొని మధ్య తరగతి వర్గం తమ పిల్లలను చదివిస్తున్నారు. అయితే సామ్రాజ్యవాద దోపిడీ వ్యవస్థను బలోపేతం చేయటం కోసమే అమలవుతున్న ఉదారవాద విధానాలు, అందువల్ల బలపడుతున్న ప్రైవేటీకరణ వల్ల గత రెండు దశాబ్దాలుగా మనదేశంలో ఉద్యోగరహిత అభివృద్ధి కొనసాగుతున్నది. అది క్రమంగా ఉద్యోగాలు కోల్పోయే అభివృద్ధిగా పరిణమించి గౌరవప్రదమైన ఉపాధుల గురించి ప్రస్తావించలేని పరిస్థితి, అసలు బతుకుతెరువు దొరకని స్థితి. విద్యా సంక్షోభం, ఉపాధి సంక్షోభం వల్ల మెజారిటీ ప్రజల జీవితాలు విధ్వంసం అవుతున్నాయి.

విద్యా ప్రైవేటీకరణ వల్ల ఆర్థిక అసమానతలతో పాటు లింగ వివక్ష, గ్రామీణ – పట్టణ ప్రాంత వ్యత్యాసం తీవ్రమవుతాయని, ఉన్నత విద్య పబ్లిక్ వస్తువుగానే వుండాలని 2002 నుండి UNESCO చెబుతూనే వున్నది. NIEPA - National Institute of Educational Planning and Administration, 2008లో నిర్వహించిన సదస్సులో విద్యా వాణిజ్యీకరణ వుండకూడదని తీర్మానించింది. విద్యా హక్కు-2009 కూడా ఈ విషయాన్నే చెబుతుంది.

అయినప్పటికీ, జాతీయ విద్యా విధానం-2020, విద్యను బలంగా వాణిజ్యీకరించాలని చెబుతుంది. అందుకనుగుణంగానే ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థలు-మిలాఖత్‌లు, విలీనాలతో భారీ సంస్థలుగా రూపొందటానికి 2022లో యూనివర్సిటీ గ్రాంట్ల సంఘం మార్గదర్శకాలను విడుదల చేసింది. జనవరి 2023లో విదేశీ యూనివర్సిటీలు తమ క్యాంపస్‌లను మన దేశంలో తెరవటానికి అనుమతులు ఇచ్చింది. 2012 లోనే జాతీయ అభివృద్ధి మండలి విద్యను లాభం కోసం సరుకుగా మార్చడానికి అవసరమైన చట్ట సవరణలు చేసింది. ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థలు, కంపెనీలు అయినాయి. బాండ్లు, షేర్లు ద్వారా నిధులను సమకూర్చుకోవచ్చు.

కాగా, ఇందుకు భిన్నంగా 2021లో చైనా రూపొందించిన నూతన విద్యా విధానం ప్రకారం ఉన్నత విద్యా రంగంలో లాభాలు వుండకూడదు. మిలాఖత్తులు, విలీనాలతో గుత్త సంస్థలుగా ఏర్పడకూడదు. షేర్లు, బాండ్ల ద్వారా నిధులను సమకూర్చుకోకూడదు. ఈ నిబంధనలన్నీ విద్యలో సమత్వం సాధించడానికి, వర్గాలు బలపడకుండా ఉండటానికే.

## సంక్షోభానికి సమాధానంగా సంక్షోభాన్ని బలోపేతం చేయటం :

ప్రపంచ దేశాలన్నీ భారతదేశంతో సహా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ సంక్షోభాలనే సృష్టిస్తుందని గత 100 సంవత్సరాల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్పష్టం చేసింది. సమర్థవంతమైన మార్కెట్ శక్తులు సంక్షోభాలను ఆపిన దాఖలాలు లేనే లేవు. విద్యా వాణిజ్యీకరణ వల్ల మెజారిటీ యువత విద్యకు దూరమవుతున్నారు. చదువు అందుబాటులోకి వచ్చిన మధ్యతరగతి యువతకు చదివిన చదువులతో ఉద్యోగాలు దొరకటం లేదు. బిట్స్ పిలాని, ఐఐటిలనే ఆదర్శంగా చెప్పడంతో వాటిలో చదివిన విద్యార్థులకు కూడా ఉద్యోగాల్లేవు. దొరికిన ఉద్యోగాలు త్వరత్వరగా కోల్పోతున్నారు. విద్య, ఉపాధి రంగాలలో ఏర్పడిన సంక్షోభం రోజు రోజుకీ బలపడుతున్నది. గుత్త పెట్టుబడుల లాభాల కోసం రూపొంది, బలపడిన ప్రైవేటీకరణ, విద్యా వాణిజ్యీకరణ ఈ సంక్షోభానికి కారణాలని స్పష్టంగా కనిపిస్తూనే వున్నది.

కానీ గుత్త పెట్టుబడులు తమ లాభాలను పెంచుకోవడానికి విద్యా మార్కెట్ ను మరింత విస్తరించడం, బలంగా వాణిజ్యీకరించటమే ఈ సంక్షోభాలకు పరిష్కారమని సీరియస్‌గా ప్రచారం చేయడం ఆందోళనకరమే. నిరుద్యోగితకు, ఉద్యోగాలను కోల్పోవడానికి తగిన నైపుణ్యాలు లేకపోవడం, నైపుణ్యాలను నవీకరించుకోకపోవటమే కారణాలని నమ్మ బలుకుతున్నారు. నిరుద్యోగ సమస్య ఎంత తీవ్రంగా వుంటే అంత ఎక్కువగా నైపుణ్యాల నవీకరణ కోర్సులకు డిమాండు పెరుగుతుందన్న మాట. విద్య వాణిజ్యీకరణ వల్ల మనదేశంలో 70 శాతం యువతకు ఉన్నత విద్య అందుబాటులో లేదు. ఆన్‌లైన్ విద్య, ఎడ్ టెక్ కంపెనీలకు, స్మార్ట్ ఫోన్ కంపెనీలకు ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

అందువల్లనే ఎడ్ టెక్ పరిశ్రమ 18 శాతం వార్షికాభివృద్ధి రేటుతో 2023లో 6 బిలియన్ల అమెరికన్ డాలర్ల (48 వేల కోట్ల రూ॥లు) నుండి 2026లో 10 బిలియన్ల అమెరికన్ డాలర్లకు(80వేల కోట్ల రూ॥లు) పెరుగుతుందని అంచనాలు వేస్తున్నారు. ఆన్‌లైన్ విద్య కోసం స్మార్ట్ ఫోన్లకు గిరాకీ పెరుగుతుందని, అందువల్ల ఈ ఫోన్ల కంపెనీలు కూడా అత్యధిక అభివృద్ధిని సాధిస్తాయని చెబుతున్నారు.

ప్రపంచ ఆర్థిక వేదిక (World Economic Forum) రూపొందించిన భవిష్య ఉద్యోగ

➡

లెనిన్ శతవర్ధంతి సంవత్సరం

# ఆర్థిక పునరుద్ధరణ కాలంలో ట్రాట్స్కీవాదుల విచ్ఛిన్నానికి వ్యతిరేకంగా సాగించిన పోరాటం-ట్రాట్స్కీవాదుల ఓటమి

("సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ చరిత్ర(బోల్షివిక్కులు)"లోనిది ఈ అధ్యాయం. ఆ రోజుల్లో బూర్జువా సిద్ధాంత భ్రమల గురించి అధ్యయనానికి ప్రాధాన్యమిస్తూ, మార్క్సిజం- లెనినిజంపట్ల కొందరికి నమ్మకం వుండేదిగాదు. మార్క్సిజం-లెనినిజం బోధనలపై కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించటానికి జరిగిన అవిశ్రాంత పోరాటాన్ని ఈ అధ్యాయం వివరిస్తోంది. - *సంపాదకులు*)

**జాతీయ** ఆర్థిక సంపదను పునరుద్ధరించ డానికి సాగించిన పోరాటం మొదటి సంవత్సరాలలోనే చెప్పుకోదగ్గ ఫలితాలను సమకూర్చింది. 1924 నాటికి అన్నిరంగాల లోను అభివృద్ధి కనిపించింది. 1921 నుండి పంటపండే భూమి విస్తీర్ణం తగినంతగా హెచ్చింది. రైతుల వ్యవసాయం క్రమంగా అభివృద్ధి చెందుతూంది. సోషలిస్టు పరిశ్రమ పెంపొంది విస్తరించుతూంది. సంఖ్యలో కార్మిక వర్గం చాలా హెచ్చింది. జీతాలు పెరిగాయి. 1920-21లతో పోల్చిచూస్తే కార్మికుల, రైతుల జీవితం చాల బాగుపడి సుఖప్రదమైంది.

కాని ఆర్థిక విచ్ఛిత్తి యొక్క ఫలితాలు ఇంకా కన్పడుతూనే వున్నాయి. పరిశ్రమలు ఇంకా యుద్ధానికి పూర్వపు స్థాయికంటే తక్కువగానే ఉన్నాయి. ఇంకా పారిశ్రామికాభివృద్ధి దేశ అవసరాలకు తగినంతగాలేక ఎంతో వెనుకబడి ఉంది. 1923 సంవత్సరాంతంలో దాదాపు 10 లక్షలమంది నిరుద్యోగులున్నారు. నిరుద్యోగులను పనిలో ఇముడ్చుకోగలిగినంతగా జాతీయ ఆర్థిక విధానం పెంపొందడం లేదు. వర్తకాభివృద్ధి పారిశ్రామిక వస్తువుల విపరీత ధరల వలన కుంటుబడింది. నెప్‌మెన్, మన వర్తక సంస్థలలోవున్న అలాంటి వ్యక్తులూ దేశంపై ఈ అధిక ధరలను రుద్దసాగారు. ఇందువల్ల సోవియట్ రూబుల్ నిలకడలేకుండా పోయింది. దాని విలువ పడిపోసాగింది. ఇవన్నీ కార్మికుల, రైతుల పరిస్థితి అభివృద్ధి కాకుండా ఆటంకపరచాయి.

1923 ఆకురాలు కాలంలో మన పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు సోవియట్ ధరల విధానాన్ని ఉల్లంఘించడం వల్ల ఆర్థిక కష్టాలు కొంతవరకు హెచ్చాయి. పారిశ్రామిక వస్తువుల ధరలకు, వ్యవసాయ ఉత్పత్తి ధరలకు మధ్య వ్యత్యాసం చాలా వుంది. ధాన్యపు ధరలు చాలా తక్కువగా వున్నాయి. పారిశ్రామిక వస్తువుల ధరలు అసాధారణంగా హెచ్చాయి. పరిశ్రమలు తలకుమించిన వ్యయంతో భారమైపోయాయి. అందుచే పారిశ్రామిక వస్తువుల ధరలు పెరిగాయి. రైతులు తమ ధాన్యాన్ని అమ్ముట ద్వారా పొందిన డబ్బుకు విలువ త్వరగా తగ్గిపోసాగింది. పరిస్థితులను మరింత అధ్వాన్నం చేయటానికి ట్రాట్స్కీవాది కేటకావ్ పనిచేశాడు. అతడు ఆ రోజుల్లో జాతీయ ఆర్థిక విధాన ఉన్నత సమితిలో (సుప్రీమ్ కౌన్సిల్ ఆఫ్ - నేషనల్ ఎకానమీ) ఉండేవాడు. మేనేజర్లకు, డైరెక్టర్లకు యిచ్చిన వినాశకరమైన పారిశ్రామిక వస్తువుల అమ్మకంలో ఎంత వీలైతే అంత లాభాన్ని పిండాలనీ, వీలైనంత హెచ్చుస్థాయికి ధరలను పెంచాలనీ అతడు ఉత్తరువులిచ్చాడు. ఇదంతా పరిశ్రమలను అభివృద్ధి చేయటానికట. కానీ వాస్తవంలో యీ నెప్‌మెన్ విధానం పరిశ్రమల పునాదినే సంకుచితపరచి కూల ద్రోస్తుంది. పారిశ్రామిక వస్తువులను కొనటం రైతాంగానికి నష్టకరంగా వుంది. అందుచేత వారు కొనటం మానివేశారు. దీని ఫలితంగా అమ్మకంలో సంక్షోభం బయలుదేరింది. దానివల్ల పరిశ్రమలు దెబ్బతిన్నాయి. కార్మికులకు వేతనాలు చెల్లించటంలో కష్టాలు వచ్చాయి. ఇది కార్మికులలో అసంతృప్తిని రెచ్చగొట్టింది. కొన్ని ఫ్యాక్టరీలలో చాలా వెనుకబడ్డ కార్మికులు పనిచేయటం మానివేశారు.

ఈ కష్టాలను, విపరీతాలను తొలగించ టానికి అవసరమైన చర్యలను పార్టీ సెంట్రల్ కమిటీ తీసుకొంది. అమ్మకపు సంక్షోభాన్ని తొలగించటానికి కొన్ని చర్యలను తీసుకొన్నారు. నోట్ల చలామణిలో (కరెన్సీ) మార్పుచేసి, వినిమయ వస్తువుల ధరలు తగ్గించారు. నిలకడమైన, దృఢమైన "చర్వోనెట్జ్" అనే కరెన్సీ యూనిట్‌ను ఏర్పరచటానికి నిర్ణయించబడింది. వేతనాలు మామూలుగా చెల్లించడం ప్రారంభించారు. ప్రభుత్వం ద్వారా, సహకార మార్గాల ద్వారా వర్తకాన్ని అభివృద్ధిచేసి ప్రయివేటు వర్తకులను, అధికలాభాపేక్షాపరులను తొలగించటానికి కొన్ని చర్యలను సూచించారు.

## ట్రాట్స్కీవాదుల ప్రమాదం

ఈ సమయంలో కావలసింది, ప్రతివారు సమిష్టి కృషిలో పాల్గొనడం, నడుములు బిగించి ఉత్సాహంతో పనికి పూనుకోవటం. పార్టీ యెడల విశ్వాసమున్న వారందరూ ఇలాగే భావించి పనిచేశారు. కాని ట్రాట్స్కీవాదులలా కాదు. తీవ్రమైన జబ్బు వల్ల లెనిన్ కదలలేకుండా వుండటం చూచి, పార్టీ పైనా, పార్టీ నాయకత్వం పైనా మరొక కొత్త దాడిని ప్రారంభించారు. పార్టీని నాశనం చేసి, దాని నాయకత్వాన్ని

---

→

నివేదిక ప్రకారం ప్రస్తుత ఉద్యోగాలలో 85 శాతం, 2030 నాటికి పనికిరావు. ఇందుకు కారణం నిజానికి ఆటోమేషన్, రోబోల వినియోగం, కృత్రిమ మేధ. కేవలం నైపుణ్యాల నవీకరణతో ఈ 85 శాతం మందికి ఉద్యోగాలు తిరిగి ఇవ్వగలరా? కొత్తగా నైపుణ్యాలు నేర్చుకుంటున్న యువత ఉపాధులు ఏమిటి? పెరుగుతున్న నిరుద్యోగ సంక్షోభానికి ఇది ఎట్లా పరిష్కారం అవుతుంది? పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ అభివృద్ధి క్రమం సృష్టించిన ఈ సంక్షోభం, నైపుణ్యాల నవీకరణతో పరిష్కరించబడుతుందని ప్రపంచ ఆర్థిక వేదిక చెప్పటం పూర్తిగా అశాస్త్రీయం. శ్రామిక ప్రపంచం అసలు వాస్తవాల్ని తెలుసుకోకుండా అడ్డుపడు తున్నది. విద్య, ఉపాధి సంక్షోభాన్ని మరింత తీవ్ర సంక్షోభంలోకి నెట్టడమే గుత్త పెట్టుబడుల లక్ష్యం.

విద్య అనేది ఉత్పాదకత వ్యవస్థలతో, సామాజిక అభివృద్ధితో సంబంధం లేనిది కాదు కదా! దోపిడీ వ్యవస్థ నిర్మాణాలతో ముడిపడి వున్న ఈ సంక్షోభం దోపిడీ వ్యవస్థలు బలపడటం వల్ల పరిష్కరించబడతాయా? విద్య, గౌరవప్రదమైన ఉపాధులు ప్రజలందరికీ హక్కుగా లభించడం వాస్తవం కావాలంటే వ్యవస్థలో అంతర్గతంగా విశాల శ్రామిక ప్రపంచానికి వ్యతిరేకమైన, దుష్ఫలితాలను ఇస్తున్న దోపిడీ నిర్మాణాలను నిర్మూలించాల్సిందే. అందుకు సంఘటిత ప్రజా విప్లవ పోరాటాలు తప్పనిసరి. ✶

కూలద్రోయుటకు ఇది చాల అనుకూలమైన సమయమని వారు నిర్ణయించుకొన్నారు. 1923 ఆకురాలు కాలంలో బల్గేరియా, జర్మనీల విప్లవాల ఓటమినీ, దేశంలోని ఆర్థిక కష్టాలనూ, లెనిన్ జబ్బుపడటాన్నీ ఇలా ప్రతిదానినీ పార్టీకి వ్యతిరేక ఆయుధంగా ఉపయోగించుకొన్నారు. పార్టీ నాయకుడు లెనిన్ జబ్బుతో బాధపడుతున్న సమయంలో, బోల్షివిక్ పార్టీపై ట్రాట్స్కీ తన దాడిని ప్రారంభించాడు. పార్టీలో లెనినిస్టు వ్యతిరేకులైన వ్యక్తులనందరిని ప్రోగుచేసి, పార్టీకీ, పార్టీ నాయకత్వానికి పార్టీ విధానానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష వేదిక నొకదానిని సృష్టించాడు. ప్రతిపక్షాలైన 46 గురి ప్రకటన అంటూ దీనికి పేరు. ప్రతిపక్ష ముఠాలన్నీ – ట్రాట్స్కీవాదులు, డెమాక్రటిక్ సెంట్రలిస్టులు, "తీవ్రవాద కమ్యూనిస్టుల"లోను "కార్మిక ప్రతిపక్ష" ముఠాలలోను మిగిలిన వ్యక్తులు – లెనినిస్టు పార్టీపై పోరాడటానికి ఐక్యమయ్యారు. ఈ ప్రకటనలో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం రానున్నదనీ, సోవియట్ ప్రభుత్వం పడి పోనున్నదని జోస్యం చెప్పారు. ఈ పరిస్థితి నుండి బయటపడటానికి మార్గం, చీలికలకు ముఠాలకు స్వాతంత్ర్యం ఇవ్వటమేననీ, అలాంటి స్వాతంత్ర్యాన్ని ఇవ్వవలసిందిగా కోరారు.

పార్టీ 10వ కాంగ్రెస్‌లో లెనిన్ సూచనపైన ముఠాతత్వాన్ని నిషేధించారు. దానినే తిరిగి పునరుద్ధరించడానికి సాగించిన పోరాటమే ఇది.

ట్రాట్స్కీవాదులు వ్యవసాయాన్ని, లేక పరిశ్రమలను అభివృద్ధి చేయటానికి గానీ, వస్తువుల పంపిణీని అభివృద్ధి చేయడానికిగానీ, కష్టపడే ప్రజల పరిస్థితిని అభివృద్ధి పరచడానికి గానీ ఖచ్చితమైన సూచనను ఒక్కదానినీ చేసిన పాపానపోలేదు. ఇది వారికి పట్టనేలేదు. వారికి పట్టినదల్లా లెనిన్ జబ్బు నాధారంగా తీసుకొని పార్టీలో చీలికలు పునరుద్ధరించడం, పార్టీ పునాదులనూ పార్టీ సెంట్రల్ కమిటీని కూలద్రోయటానికి కృషిచేయడం.

ఈ 46 గురి వేదిక(ముఠా) ఏర్పరచడంతో పాటు ట్రాట్స్కీ ఒక లేఖను ప్రకటించాడు. దానిలో పార్టీ అనుయాయులను దూషించాడు. పార్టీపై కొత్త నిందాగర్భితమైన ఆరోపణలను చేశాడు. ఈ ఉత్తరంలో ట్రాట్స్కీ పాత మెన్షివిక్కు పురాణాలనే వల్లించాడు. పార్టీ అనేకసార్లు వీటిని ఇంతకు పూర్వమే అతను చెప్పగా విన్నది.

మొట్టమొదట ట్రాట్స్కీవాదులు పార్టీ యంత్రాంగంపై దాడిచేశారు. బలోపేతమైన యంత్రాంగం లేనిదే పార్టీ జీవించి పని చేయలేదని వారికి తెలుసు. అందుచే ఈ ప్రతిపక్షం పార్టీ యంత్రాంగాన్ని నాశనం చేసి కూలద్రోయాలని తలచింది. పార్టీ సభ్యులను దానిపైకి ఉసికొల్పాలని ప్రయత్నించింది. పార్టీలోని రాటుదేలిన వయోవృద్ధులైన యోధులపై యువక సభ్యులను ఉసిగొల్ప ప్రయత్నించారు. ట్రాట్స్కీవాదానికి వ్యతిరేకంగా పార్టీ సాగించిన, పార్టీ చరిత్ర తెలియని యువకపార్టీ సభ్యులను, విద్యార్థులను రెచ్చగొట్టడానికి యీ ఉత్తరంలో ట్రాట్కీ పూనుకొన్నాడు. విద్యార్థుల అండను సంపాదించడానికి ట్రాట్స్కీ వారిని పొగిడాడు. "పార్టీకి ఖచ్చితమైన కొలతబద్ధ (బరామీటర్) మీరేన"ని పొగిడాడు. దీనితో బాటు లెనినిస్టు వయోవృద్ధ యోధులంతా (ఓల్డ్ గార్డు) పతనం చెందారని ప్రకటించాడు. రెండవ ఇంటర్‌నేషనల్ నాయకుల పతనాన్ని ఉదహరించి అదేవిధంగా బోల్షివిక్కు వృద్ధనాయకులు కూడా పోతున్నారని సూచించుతూ ట్రాట్స్కీ తుచ్ఛమైన అభాండం వేశాడు. పార్టీ పతనాన్ని గురించి వేసిన యీ పొలికేకతో ట్రాట్స్కీ తన పతనాన్ని, తన పార్టీ వ్యతిరేక కుట్ర బుద్ధిని దాచుకోవాలని ప్రయత్నించాడు.

ట్రాట్స్కీవాదులు, ప్రతిపక్షం వారి పత్రాలకు రెంటినీ అనగా '46 గురి వేదిక'ను 'ట్రాట్స్కీ ఉత్తరాన్ని' జిల్లాలలోను, పార్టీ ప్రాథమిక యూనిట్లు (Nuclei)లోను పంచి పెట్టారు. పార్టీ సభ్యులు వాటిని చర్చించాలని కోరారు.

## లెనినిజం బదులు ట్రాట్స్కీయిజాన్ని రుద్దే ప్రయత్నాలు

వీటిని చర్చించాలని పార్టీని వారు సవాలు చేశారు.

పార్టీ 10వ కాంగ్రెస్‌లో కార్మిక సంఘ సమస్య పైన చర్చను రుద్దినట్లుగానే, ఇప్పుడు కూడ ట్రాట్స్కీవాదులు పార్టీ పైన సాధారణ చర్చ జరపాలని ఒత్తిడి చేశారు.

ఇంతకన్నా చాలా ప్రాముఖ్యమైన దేశ ఆర్థిక జీవితానికి సంబంధించిన సమస్యలపైన నిమగ్నమై యున్నప్పటికీ, ఈ సవాలును అంగీకరించి పార్టీ చర్చను ప్రారంభించింది.

ఈ చర్చలో పార్టీ అంతా నిమగ్నమైంది. పోరాటం అతి తీవ్రరూపం దాల్చింది. మాస్కోలో అది అత్యంత భయంకర రూపం దాల్చింది. రాజధాని నగరంలోని పార్టీ సంస్థను వశపరచు కోవాలని ట్రాట్స్కీవాదులు ప్రయత్నించారు. కానీ యీ చర్చ ట్రాట్స్కీవాదులకు ఏమీ సహాయ పడలేదు. వారిని మరింత అపఖ్యాతిపాలు చేసింది. మాస్కోలోను, సోవియట్ యూనియను ఇతర భాగాలలోను వారు పూర్తిగా అపజయం పాలయ్యారు. విశ్వవిద్యాలయాలలోనూ, ఆఫీసుల లోను కొద్ది ప్రాథమిక యూనిట్లు మాత్రమే (ప్రాథమిక పార్టీ సంఘాలు మాత్రమే) ట్రాట్స్కీవాదులకు వోటు చేశాయి.

1924 జనవరిలో 13వ సమావేశాన్ని (కాన్ఫరెన్స్) జరిపింది. దీనిలో కామ్రేడ్ స్టాలిన్, చర్చ ఫలితాలను క్రోడీకరించుతూ ఒక రిపోర్టు యిచ్చాడు. ఈ సమావేశం ట్రాట్స్కీవాదుల ప్రతికూలతను ఖండించింది. అది మార్క్సిజం నుండి పెడత్రోవపట్టిన మధ్యతరగతివాదమని (పెటీబూర్జువా డీవియేషన్ ఫ్రమ్ మార్క్సిజం) యీ సమావేశం ఖండించింది. ఈ సమావేశ తీర్మానాలను ఆ తరువాత పార్టీ 13వ కాంగ్రెసూ, కమ్యూనిస్టు ఇంటర్‌నేషనల్ 5వ కాంగ్రెసూ ఆమోదించాయి. ట్రాట్స్కీవాదానికి వ్యతిరేకంగా బోల్షివిక్ పార్టీ చేసిన పోరాటాన్ని అంతర్జాతీయ కమ్యూనిస్టు కార్మికవర్గం బలపరచింది.

కాని ట్రాట్స్కీవాదులు తమ విద్రోహ చర్యలను మానలేదు. 1924 ఆకురాలు కాలంలో ట్రాట్స్కీ "అక్టోబరు గుణపాఠాలు" అనే పేరుతో ఒక వ్యాసాన్ని ప్రకటించాడు. అందులో లెనినిజం స్థానే ట్రాట్స్కీజంను పెట్టటానికి ప్రయత్నించాడు. అది మన పార్టీ మీద, పార్టీ నాయకుడగు లెనిన్ మీద కేవలం నింద తప్ప మరేమీకాదు. ఈ నిందాగర్భిత పత్రాన్ని సోవియట్ ప్రభుత్వానికీ కమ్యూనిజానికీ శత్రువు లయిన వారందరూ ఉపయోగించుకొన్నారు. బోల్షివిజం యొక్క వీరోచిత చరిత్రను సిగ్గు బిడియం లేకుండా ట్రాట్స్కీ మార్చిచేసిన ఈ వక్రభాష్యానికి పార్టీ క్రోధంతో ఉడికిపోయింది. లెనినిజం స్థానే ట్రాట్స్కీజంను ప్రవేశ పెట్టాలనే ట్రాట్స్కీ ప్రయత్నాన్ని కామ్రేడ్ స్టాలిన్ ఖండించాడు. "ట్రాట్స్కీజం ఒక సిద్ధాంత ధోరణిగా లేకుండా పూడ్చిపెట్టవలసిన విధి పార్టీది"ని కామ్రేడ్ స్టాలిన్ ప్రకటించాడు.

## ట్రాట్స్కీవాదానికి వ్యతిరేకంగా పోరాటం

ట్రాట్స్కీవాదం సిద్ధాంతరీత్యా ఓడిపోవటానికీ, లెనినిజాన్ని సంరక్షించటానికీ కామ్రేడ్ స్టాలిన్ వ్రాసిన సిద్ధాంత గ్రంథం తగిన సహాయం చేసింది. ఆ గ్రంథం పేరు లెనినిజం యొక్క పునాదులు (ఫౌండేషన్సు ఆఫ్ లెనినిజం). ఇది 1924లో ప్రకటించబడింది. ఈ గ్రంథం లెనినిజాన్ని విశదీకరించే సిద్ధాంత గ్రంథం. ఇది లెనినిజాన్ని చక్కగా నిరూపించే సిద్ధాంత గ్రంథం. అప్పటికీ ఇప్పటికీ ప్రపంచమంతటా బోల్షివిక్కుల చేతుల్లో మార్క్సిస్టు–లెనినిస్టు సిద్ధాంతమనే నిశిత ఆయుధంగా ఈ గ్రంథం ఉపయోగించ బడుతూంది.

ట్రాట్స్కీవాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలలో సెంట్రల్ కమిటీ చుట్టూ పార్టీ

నిలబడేటట్లు కామ్రేడ్ స్టాలిన్ చేశాడు. మన దేశంలో సోషలిస్టు విజయానికై సాగించవలసిన పోరాటాన్ని కొనసాగించుటకై పార్టీని సమీకరించాడు. సోషలిజం విజయవంతంగా పురోగమించడం తథ్యమయ్యేటట్లు చెయ్యాలంటే, ట్రాట్స్కీజాన్ని సిద్ధాంతరీత్యా సర్వనాశనం చెయ్యాలని కామ్రేడ్ స్టాలిన్ నిరూపించాడు.

ట్రాట్స్కీజానికి వ్యతిరేకంగా జరిగిన పోరాట కాలాన్ని సమీక్షిస్తూ కామ్రేడ్ స్టాలిన్ ఇలా అన్నాడు :

"ట్రాట్స్కీజంను ఓడించితే తప్ప నూతన ఆర్థిక విధాన పరిస్థితులలో విజయాన్ని సాధించడం అసాధ్యం. ఈనాటి రష్యాను సోషలిస్టు రష్యాగా మార్చడం అసాధ్యం."

## లెనిన్ మరణం – అతి తీవ్రమైన నష్టం

కానీ పార్టీ యొక్క లెనినిస్టు విధానం పొందిన విజయాలను, కార్మికవర్గానికి పార్టీకి సంభవించిన ఒక మహా ప్రమాదం మేఘంలాగా కమ్మివేసింది. 1924 జనవరి 21వ తేదీన మన నాయకుడూ, మన గురువూ, బోల్షివిక్ పార్టీ నిర్మాతా అయిన లెనిన్ మాస్కో వద్ద గోర్కీ అనే గ్రామంలో మరణించాడు. లెనిన్ మరణంతో యావత్ ప్రపంచ కార్మికవర్గం తమకు అతి తీవ్రమైన నష్టం జరిగిందని గుర్తించింది. లెనిన్ అంత్యక్రియల రోజున అంతర్జాతీయ శ్రామిక వర్గం అయిదు నిమిషాల పాటు కార్మికులంతా పని మానివెయ్యాలని ప్రకటించింది. రైల్వేలు, మిల్లులు, ఫ్యాక్టరీలు అన్నీ ఆగిపోయాయి. లెనిన్‌ను సమాధి చేస్తున్నపుడు యావత్ ప్రపంచ కార్మికవర్గమూ పొంగి పొరలుతున్న దుఃఖాన్ని ఆపుకుంటూ లెనిన్ తమకు పితృతుల్యుడనీ, గురువనీ, అత్యుత్తమ స్నేహితుడనీ, సంరక్షకుడనీ ప్రశంసించారు.

లెనిన్ మరణంతో సోవియట్ యూనియన్ లోని కార్మికవర్గం, లెనినిస్టు పార్టీ పక్షాన మరింత ఐక్యతతో నిలిచింది. ఆ సంతాప దినాలలో వర్గ చైతన్యంగల ప్రతి కార్మికుడు లెనిన్ ఆజ్ఞలను ఆచరణలో పెట్టే కమ్యూనిస్టు పార్టీ యెడల తన వైఖరి యేమిటో తెలియపరచాడు. పార్టీలో చేర్చుకోవలసిందిగా కోరుతూ కార్మికులు పంపిన దరఖాస్తులు వేలకువేలు పార్టీ సెంట్రల్ కమిటీకి వచ్చిపడ్డాయి. అభివృద్ధి చెందిన కార్మికుల ఈ ఉద్యమానికి సెంట్రల్ కమిటీ ఆమోదాన్ని తెలిపింది. లెనిన్ స్మారక సభ్యత్వమంటూ ప్రకటించింది. పార్టీలోనికి అభివృద్ధిచెందిన కార్మికులను చేర్చుకొనటానికి అంగీకరించింది. వేలకొలది కార్మికులు పార్టీలోకి మూకుమ్మడిగా చేరారు. పార్టీ ఆశయం కోసం, లెనిన్ ఆశయం కోసం తమ ప్రాణాలను అర్పించటానికి సిద్ధమైన ప్రజలు వారు. కొద్దికాలంలోనే 2 లక్షల 40 వేలమంది కార్మికులు బోల్షివిక్ పార్టీలో చేరారు. వారు కార్మికవర్గంలో అందరికన్నా ముందు నడచే విభాగం. ఎక్కువ వర్గ చైతన్యం గలవారు. విప్లవకారులు. మంచి క్రమశిక్షణ గలవారు. అతి నిర్భయులు లెనిన్ స్మారక సభ్యత్వ ఉద్యమం ఇది.

## లెనిన్ స్మారక సభ్యత్వ నమోదు – పార్టీ సభ్యుడి గొప్ప అర్హత

లెనిన్ మరణం తర్వాత వ్యక్తమయిన పై విషయాలు, మన పార్టీ ప్రజా సామాన్యంలో ఎంత సన్నిహితంగా సంబంధాలు కల్గియున్నదో ప్రదర్శించాయి. కార్మికుల హృదయాలలో లెనినిస్టు పార్టీ ఎంత ఉన్నత స్థానాన్ని అక్రమించుకుందో తెలియజేశాయి.

లెనిన్ కోసం పరితపిస్తున్న దినాలలో సోవియట్ యూనియన్ యొక్క సోవియట్ల రెండవ కాంగ్రెస్ జరిగింది. అందులో పార్టీ పేరిట కామ్రేడ్ స్టాలిన్ పవిత్రమైన ఈ క్రింది ప్రతిజ్ఞను గావించాడు:

"కమ్యూనిస్టులమగు మనం ప్రత్యేక పదార్థంతో మూసపోయబడిన ఒక ప్రత్యేక తరహా ప్రజలం. శ్రామికవర్గ మహా వ్యూహ నిర్మాతయైన కామ్రేడ్ లెనిన్ సైన్యానికి చెందినవారం. ఈ సైన్యానికి చెందియుండటం కన్న ఉన్నతమైన గౌరవం మరొకటి లేదు. కామ్రేడ్ లెనిన్ స్థాపించి నాయకత్వం వహించిన పార్టీ యొక్క సభ్యత్వం అనే అర్హతకన్నా ఉన్నతమైనది మరేదీలేదు...

"కామ్రేడ్ లెనిన్ మనలను వీడిపోతూ పార్టీ సభ్యత్వమనే గొప్ప అర్హత యొక్క పవిత్రతను కాపాడాలనీ, దాని ఔన్నత్యాన్ని నిలపాలనీ ప్రతిన చేయించాడు. కామ్రేడ్ లెనిన్! మీ ఆజ్ఞను కూడా గౌరవప్రదంగా పూర్తి చేస్తామని మేము ప్రతిజ్ఞ చేస్తున్నాం!"

"మనలను వీడిపోతూ కామ్రేడ్ లెనిన్ మన పార్టీ ఐక్యతను కంటిపాపవలె కాపాడమని ప్రతిజ్ఞ చేయించాడు. కామ్రేడ్ లెనిన్! ఈ ఆజ్ఞను కూడా గౌరవప్రదంగా పూర్తి చేస్తామని మేము ప్రతిన చేస్తున్నాం.

"కామ్రేడ్ లెనిన్ మనలను వీడిపోతూ శ్రామికవర్గ నియంతృత్వాన్ని కాపాడి బలపరచాలని ప్రతిన చేయించాడు. కామ్రేడ్ లెనిన్! ఈ మీ ఆజ్ఞను కూడా గౌరవప్రదంగా నెరవేర్చుటకు అన్నివిధాలా ప్రయత్నించుతామని మేము మీకు మాట యిస్తున్నాం!

"కామ్రేడ్ లెనిన్ మనలను వీడిపోతూ మన శక్తినంతా ఉపయోగించి కార్మికుల, రైతుల మైత్రిని బలపరచవలసిందని ప్రతిజ్ఞ చేయించాడు. కామ్రేడ్ లెనిన్! ఈ ఆజ్ఞను కూడ గౌరవప్రదంగా నెరవేరుస్తామని ప్రతినబూనుతున్నాం!..."

"మన దేశంలోని వివిధ జాతులు ఇచ్ఛా పూర్వకంగా ఏకం కావలసిన ఆవశ్యకతను, రిపబ్లిక్కుల యూనియన్ అనే చట్రం లోపలనే వివిధ జాతుల మధ్య సోదర సహకారం వుండవలసిన అవశ్యకతను గురించి కామ్రేడ్ లెనిన్ నిర్విరామంగా కోరేవాడు. మనల నుండి వీడిపోతూ కామ్రేడ్ లెనిన్ రిపబ్లిక్కుల యూనియన్ స్థిరపరచి విస్తరింపజేయమని ప్రతిజ్ఞ చేయించాడు. కామ్రేడ్ లెనిన్! ఈ ఆజ్ఞను కూడ గౌరవప్రదంగా నిర్వర్తించుతామని ప్రతిజ్ఞ చేస్తున్నాం!...

"మనపార్టీ ప్రధాన కర్తవ్యాలలో ఒకటి రెడార్మీని బలపరచుట, రెడార్మీ పరిస్థితులను అభివృద్ధిచేయుట అని లెనిన్ అనేకసార్లు పేర్కొన్నాడు... కాబట్టి, కామ్రేడ్స్! మన రెడార్మీని, నౌకాదళాన్ని బలపరచటానికి సకలవిధాలా ప్రయత్నించుతామని మనం ప్రతిన బూనుదాం!..."

"మన నుండి వీడిపోతూ కామ్రేడ్ లెనిన్ కమ్యూనిస్టు ఇంటర్‌నేషనల్ సూత్రాలకు విశ్వాసంతో కట్టుబడి యుండవలసిందని ప్రతిన చేయించాడు. కామ్రేడ్ లెనిన్!, యావత్ప్రపంచ కష్టజీవుల యూనియన్‌ను – కమ్యూనిస్టు ఇంటర్‌నేషనల్‌ను విస్తరింపజేసి బలపరచుటకు మా ప్రాణాలను సహితం లెక్కచేయమని మేము శపథం చేస్తున్నాం!"

ఎవని పేరు యుగయుగాల వరకు చిరస్మరణీయంగా వుంటుందో, అట్టి తమ నాయకుడైన లెనిన్ స్మారకంగా బోల్షివిక్ పార్టీ గావించిన శపథం యిది.

1924 మేలో పార్టీ 13వ కాంగ్రెస్ సమావేశమయింది. దీనికి 7 లక్షల 35 వేల 881 మంది సభ్యులకు ప్రాతినిధ్యం వహించే ప్రతినిధులు హాజరయ్యారు. వోటింగు హక్కు గల్గిన ప్రతినిధులు 748 మందీ, వోటింగు హక్కు లేకుండా చర్చించే హక్కుగల ప్రతినిధులు 416 మంది హాజరయ్యారు. సభ్యత్వంలో కిందటి కాంగ్రెస్ కంటే ఇప్పుడు గమనించదగిన అభివృద్ధికి కారణం రెండున్నర లక్షల కొత్త సభ్యులు లెనిన్ స్మారక సభ్యత్వ ఉద్యమం ద్వారా పార్టీలో చేరటం వల్లనే.

ట్రాట్స్కీవాదుల ప్రతిపక్ష వేదికను కాంగ్రెస్ ఏకగ్రీవంగా ఖండించింది, అది మార్క్సిజం నుండి పెడతోవపట్టిన మధ్యతరగతివాదమనీ, లెనినిజాన్ని కుసంస్కరించే ప్రయత్నమని కాంగ్రెస్ దానిని ఖండించింది. "పార్టీ వ్యవహారాలు," "చర్చా ఫలితాలు" అని 13వ పార్టీ కాన్ఫరెన్సు తీర్మానాలను ఈ కాంగ్రెస్ ఆమోదించింది.

**(తరువాయి 10వ పేజీలో)**

కార్మికవర్గ సమస్యలు-ఉద్యమాలు

# 5 దశాబ్దాలనాటి చారిత్రాత్మక అఖిలభారత రైల్వే సమ్మె (1974)-కొన్ని గుణపాఠాలు

కొమరయ్య

**1974** నాటి అఖిలభారత రైల్వేసమ్మె-భారత రైల్వేల చరిత్రలో దీర్ఘకాలం కొనసాగిన, ప్రభావం నెరిపిన భారీ సమ్మెలలో ఒకటిగా వుంది. 1974 మే 8 నుండి రైల్వే కార్మికులు గతంలో ఎన్నడూ లేని విధంగా 20 రోజులపాటు వీరోచిత పోరాటం చేశారు. భారత కార్మికోద్యమ చరిత్రలో అత్యంత కీలకమైన ఘటనలలో ఇది ఒకటి.

1974ల నాటి భారత రైల్వే కార్మికుల సమ్మె - సామాన్యమైన రైల్వే కార్మికులు, వారి కుటుంబాలు, సాగించిన వీరోచిత, సమరశీల పోరాట చిత్రాలను గుర్తుచేస్తోంది. భారత రాజ్యాధికార దర్పానికి వ్యతిరేకంగా నిలబడిన కార్మికులకు మద్దతుగా నిలిచినవారి తలపులను 50 సం॥ల తర్వాత కూడా ఈనాటికీ రేకెత్తిస్తోంది. భారతదేశంపై ఆ సమ్మె దీర్ఘకాలిక ప్రభావం చూపింది.

ఆ సమ్మె నుండి భారత కార్మికోద్యమం అనేక ముఖ్యమైన గుణపాఠాలను తీసుకొని ఈనాటి ఉదాసీన స్థితి నుండి బయటపడాల్సి వుంది. ఆ సమ్మె - దాని అనుభవాలు, గుణపాఠాల వెలుగులో భారత కార్మికవర్గ చరిత్రను లోతుగా అధ్యయనం చేసి, సరైన గుణపాఠాలను తీయాలని డిమాండ్ చేస్తోంది. కొన్ని కేంద్రస్థాయి కార్మిక యూనియన్లు, వాటి మాతృ సంస్థలైన రాజకీయ పార్టీల నాయకత్వం ఈ సమ్మె గురించి నిర్ణీతమైన సాధారణ, సంక్షిప్త సమీక్షలు చేశాయనటంలో సందేహం లేదు; అయితే, ఆ సమ్మె కాలంలో వారు చేపట్టిన విధానాలకు, ఎత్తుగడలకు మద్దతుగానూ, వాటి సమర్థన కోసమే ఈ సమీక్షలు ఉద్దేశించబడటం విచారకరం. అదే సమయంలో ప్రత్యర్థి కార్మిక యూనియన్ల నాయకత్వాలు, ఆయా కేంద్ర ట్రేడ్ యూనియన్లకు అనుబంధంగా వున్న రాజకీయ పార్టీలు చేపట్టిన విధానాలను విమర్శించటానికే ఈ సమీక్షలు పరిమితమయ్యాయి.

ఏమైనా, 50 సం॥లు గడిచిపోయినప్పటికీ, ఈనాటికీ 1974 నాటి రైల్వే సమ్మె దాని అనుభవాలు ప్రాసంగికత కలిగి వుండి భారత కార్మికోద్యమంపై ప్రభావాన్ని కలిగివున్నాయి. ప్రత్యేకించి, భారత కార్మికోద్యమం అత్యంత సంక్లిష్ట స్థితికి చేరుకుంటూ ప్రభావరహిత స్థితిలోకి జారుకుంటున్న దశలో సమ్మె అందించిన అనుభవాలు విలువైనవిగా వున్నాయి.

సరైన, తగిన నిర్ధారణలకు రావటానికి లోతైన అధ్యయనాన్ని చేపట్టాలి. 1974 నాటి అఖిలభారత రైల్వే సమ్మె అనుభవాలు, భారతదేశంలో 1947 అధికార మార్పిడి తర్వాత కాలంలోని కార్మికోద్యమాన్ని క్షుణ్ణంగా పరిశీలించే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. అయితే, ఆ అధ్యయనం - కార్మికవర్గ రాజకీయాలైన శాస్త్రీయ సోషలిజం, మార్క్సిజం-లెనినిజమనే సిద్ధాంత బోధనల అవగాహనపై ఆధారపడి సాగాలి. రైల్వే కార్మికులు మొత్తంగా తమ వర్గం యొక్క, వర్గ ప్రయోజనాల యొక్క చైతన్య యుతమైన ప్రతినిధులుగా వ్యవహరించారు. అంతే తప్ప, కొన్ని నిర్దిష్ట కుల, లింగ ప్రాతిపదికన వారి ప్రతినిధులుగా వర్గ చైతన్యం, వర్గ పోరాటతత్వమే, వారిని శక్తివంతమైన రాజ్యయంత్రాంగానికి వ్యతిరేకంగా వీరోచిత పోరాటం సాగించేట్లు చేసింది.

1974 రైల్వే సమ్మెకు దారితీసిన పరిస్థితుల నేపథ్యాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. 1947 "అధికార మార్పిడి"తో బ్రిటిష్ వలసవాద పాలకులు భారతదేశానికి 'స్వాతంత్ర్యం' ప్రసాదించిన నాటికి, 1920లో ఏర్పడిన కేంద్ర కార్మిక యూనియన్ ఏఐటియుసి ని విడగొట్టి, దానికి పోటీగా మరో కేంద్ర కార్మిక యూనియన్ ఐఎన్‌టియుసిని ఏర్పాటు చేయటం ద్వారా, అప్పటికే పాలక కాంగ్రెస్ పార్టీ కార్మికవర్గం నడుమ ఒక విభజనను సృష్టించింది. ఇది కార్మికవర్గం నడుమనున్న ఐక్యతను బలహీన పరిచింది. దీనికి తోడుగా వివిధ రాజకీయ పార్టీలు కూడా తమ స్వీయ అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు కార్మికవర్గ కేంద్రాలను ఏర్పరచి, కార్మికవర్గంలో మరిన్ని విభజనలను కలిగించాయి. ఏఐటియుసి నుండి విడగొట్టుకొని సోషలిస్టులు హెచ్ఎంఎస్‌ను ఏర్పరచుకున్నారు. హెచ్ఎంఎస్‌తో కొంతమంది నాయకులు విబేధించి యుటియుసిని ఏర్పరచుకోగా, ఇది కూడా తిరిగి చీలిపోయి ఎస్‌యుఐసి ఏర్పడింది. 1955లో హిందూ జాతీయవాద రాజకీయాల ప్రతినిధి అయిన జనసంఘ్ పార్టీ, హిందూ మత పునరుజ్జీవ ప్రయోజనాన్ని ఆశించి, కేంద్ర కార్మిక యూనియన్ బిఎంఎస్‌ను ఏర్పరిచింది. ఆవిధంగా ట్రేడ్ యూనియన్ ఉద్యమం, వివిధ కేంద్ర కార్మిక యూనియన్లుగా విడివడి, తమ సమస్యల పరిష్కారానికి అత్యావశ్యక అంశమైన "కార్మికుల ఐక్యత"లో అనేక విభజనలను తీసుకువచ్చింది. కార్మిక యూనియన్లలో ఈ చీలికలు-కార్మికుల, కార్మికవర్గ ప్రయోజనాలను, కార్మికుల ఐక్యతను కూడా పణంగా పెట్టి కార్మికసంఘాలు ఇతర సంఘాలతో శత్రుత్వ వైఖరికి దారితీశాయి.

నెహ్రూ నాయకత్వాన అధికార మార్పిడి తదనంతరం ప్రభుత్వాధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ - ఒకవైపున తనది 'సామ్యవాద' సిద్ధాంతంగా

---

**(9వ పేజీ తరువాయి)** పట్టణాలకూ, పల్లెలకూ మధ్య సంబంధాన్ని బలపరచడానికి పరిశ్రమలను మరింత విస్తృతం చేయాలని కాంగ్రెస్ ఉత్తరువు లిచ్చింది. ఇనుము, ఉక్కు పరిశ్రమ త్వరితంగా అభివృద్ధి చెందవలసిన ఆవశ్యకతను ప్రత్యేకంగా నొక్కి చెబుతూనే చిన్న పరిశ్రమలను ప్రధానంగా విస్తృతపరచాలని కాంగ్రెస్ ఉత్తరువులిచ్చింది.

దేశీయ వర్తకంలో ప్రజాకమిసార్ల సంఘాన్ని ఏర్పరచడాన్ని కాంగ్రెస్ ఆమోదించింది. వర్తక సంఘాలకు మార్కెట్లుపై కంట్రోలును సంపాదించి వర్తక రంగంలో ప్రయివేటు పెట్టుబడి తుడిచివేసే బాధ్యతను కాంగ్రెస్ అప్పగించింది.

గ్రామసీమల్లో వడ్డీ వ్యాపారస్థులను తుడిచివేయటానికిగాను రైతాంగానికి చౌకగా ప్రభుత్వం యిచ్చే ఋణాలను ఎక్కువ చేయవలసిందని కాంగ్రెస్ ఉత్తరువులిచ్చింది.

గ్రామసీమలో రైతాంగం మధ్య సహకార ఉద్యమాన్ని అత్యున్నతస్థాయికి పెంపొందించుట ప్రధాన కర్తవ్యమని కాంగ్రెస్ తెలియజేసింది.

లెనిన్ స్మారక సభ్యత్వం యొక్క గాఢ ప్రాముఖ్యతను కాంగ్రెస్ నొక్కి చెప్పింది. యువక పార్టీ సభ్యులకు, ముఖ్యంగా లెనిన్ స్మారక కాలంలో చేరిన సభ్యులకు లెనినిజం యొక్క సూత్రాలను బోధించుటలో ఇతోధిక కృషి చేయాల్సిన ఆవశ్యకతను పార్టీ దృష్టికి కాంగ్రెస్ తెచ్చింది. ✸

ప్రకటించుకుంటూనే, అభ్యుదయకరమైన పోజు పెడుతూనే, మరోవైపున, ఆచరణలో బ్రిటిష్ పాలకులు అనుసరించిన కార్మిక వ్యతిరేక విధానాలనే అమలుచేస్తూ వచ్చింది. కార్మికులు, ఉద్యోగులు తమ వేతనాలు, పరిస్థితులకు సంబంధించిన న్యాయబద్ధమైన డిమాండ్లను ముందుకు తెచ్చినప్పుడల్లా, వాటిని అది తీవ్రంగా వ్యతిరేకించటమేగాక, ఆ ఉద్యమాలను నిర్దాక్షిణ్యంగా అణచివేసింది.

1960 సంIIలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన అన్ని విభాగాల ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ కమిటి (జెఏసి) సంప్రదింపులు జరపవలసిందిగా కోరుతూ తమ డిమాండ్ల పత్రాన్ని అందజేయగా, భారత ప్రభుత్వం ఆ జెఏసితో ఎలాంటి ఒప్పందం చేసుకోవటానికి సిద్ధం కాకుండా, చర్చలు జరపటానికి నిరాకరించింది. కనుక అనివార్యంగా 1960 జులై 11న జెఏసి సమ్మెకు పిలుపునిచ్చింది. భారత రాష్ట్రపతి అత్యవసర సర్వీసుల నిర్వహణా ఆర్డినెన్స్‌ను జారీ చేశాడు. ఉద్యోగులు చేయ తలపెట్టిన సమ్మెను చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించాడు. నాటి ప్రధాని నెహ్రూ ఈ సమ్మెను 'ప్రజా తిరుగుబాటు'గా పేర్కొని, దీనిని తిప్పికొడతామని ప్రకటించాడు. తదనుగుణంగా పలువురు సమ్మెలోనున్న నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేశారు. సమ్మెను అణచివేసేందుకు పోలీసు జోక్యాన్ని పెంచారు. పోలీసులనేగాక హోంగార్డులు, సరిహద్దు భద్రతాదళాలను సైతం రంగంలోకి దించారు. అనేక ప్రాంతాలలో సమ్మె చేస్తున్న వారిపై పోలీసులు లాఠీఛార్జీకి పాల్పడ్డారు. రెండు ప్రాంతాల్లో ఆందోళనకారులపై పోలీసులు కాల్పులు సాగించారు. పశ్చిమ రైల్వేపరిధిలోని దహద్ వర్క్‌షాప్‌ల వద్ద జరిగిన పోలీసు కాల్పులలో ఇద్దరు మృతిచెందారు. ఈ సమ్మె సందర్భంగా 20 వేల మందికి పైగా ఉద్యోగులను అరెస్టు చేశారు. కనీసం 15 వేల మంది ఉద్యోగులను విధుల నుండి శాశ్వతంగా తొలగించగా, పదివేల మందిని తాత్కాలికంగా తొలగించారు. 15 వందల మందిని శిక్షార్హులుగా నిర్ధారించి జైలుశిక్ష విధించారు. భారత పాలకునిగా, బడా పెట్టుబడిదారీ, బడా భూస్వామ్య పాలకవర్గాల ప్రతినిధిగా నెహ్రూ తన అసలైన వర్గ స్వభావానికి నమూనాగా, జీవన పని పరిస్థితుల మెరుగుదలను కోరుతున్న కార్మికుల, ఉద్యోగుల వ్యతిరేకిగా ప్రదర్శించుకున్నాడు.

కార్మికుల, ఉద్యోగుల న్యాయబద్ధమైన సమ్మె ఆందోళనను ప్రభుత్వానికి, దేశానికి వ్యతిరేకంగా 'ప్రజా తిరుగుబాటు'గా ముద్రవేసి, వారంతా దేశభక్తియుతమైన వారు కాదని, జాతికి, ప్రజలకు వ్యతిరేకులుగా చిత్రించిన కాంగ్రెస్ ప్రభుత్వ జిత్తులమారి స్వభావం ప్రత్యేకించి పేర్కొనాల్సిన అంశంగా వుంది. అత్యవసర సర్వీసుల నిర్వహణా ఆర్డినెన్స్ చట్టబద్ధమైన శాశ్వత శాసనంగా రూపు దాల్చింది. ఆందోళన సాగిస్తున్న కార్మికులపై పోలీసులను, భద్రతా బలగాలను ప్రయోగించట మనేది, సాధారణ ఆచరణగా మారిపోయింది. ఈ ఆందోళనలలో పాల్గొన్న కార్మికులపై కక్ష సాధించటమనేది, వివిధ రూపాలలో సాధారణ ఆచరణగా మారింది. కార్మికులను, ఉద్యోగులను కక్ష సాధించటంలో భాగంగా 'సర్వీస్ బ్రేక్' అనే రూపం కూడా సాధారణ ఆచరణగా కక్ష సాధింపుకు చట్టబద్ధ రూపంగా మారింది.

కార్మికులు, ఉద్యోగులు ప్రభుత్వ దృక్పథానికి సంబంధించిన ఈ నమూనాను చవిచూసిన తర్వాత కూడా కార్మికుల ఉద్యోగుల కేంద్ర సంఘాల, సమాఖ్యల నాయకత్వాలు – ప్రభుత్వ, పాలకుల కార్మిక వ్యతిరేక స్థితిని అధిగమించేందుకు ఏవిధమైన ఉపాయాన్నీ లేదా వ్యూహాన్నీ కూడా రూపొందించుకోలేదు. ఉమ్మడి భారత కమ్యూనిస్టు పార్టీ మార్గ దర్శకత్వంలోని ఏఐటియుసి నాయకత్వం, కార్మికుల, కార్మికవర్గ ప్రయోజనాల పరిరక్షణలో తామే ఛాంపియన్‌లమని చెప్పుకునే నాయకత్వం – సందర్భానికి తగినట్లుగా వ్యవహరించేందుకు, ప్రభుత్వ, పాలకుల, పాలక వర్గాల మోసపూరితమైన కార్మిక వ్యతిరేక వ్యూహాలను సమర్థవంతంగా ప్రతిఘటించి, ఓడించేందుకు, కార్మికవర్గ మౌలిక, ప్రాథమిక హక్కులను కాపాడేందుకు ఏ విధమైన వ్యూహాన్నీ రూపొందించుకోలేకపోయింది. దానికి భిన్నంగా, నెహ్రూ యొక్క సామ్యవాద, బడాయి, ప్రగతిశీల మాటలను, సోవియట్ యూనియన్‌ను అక్కడి పంచవర్ష ప్రణాళికలను ఆయన కీర్తించటాన్ని, మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా పేర్కొనబడే ఆయన విధానాలచే చుట్టుముట్టబడ్డారనేది స్పష్టమౌతోంది. అలా కాకుంటే, ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి ఎస్ఏ డాంగే, మరియు ఇతర నాయకులు – 'రెండు స్థంభాల విధానం' (టు పిల్లర్ పాలసీ) అనగా – "పంచవర్ష ప్రణాళికలోని ముఖ్యమైన అంశాలను అమలుపరచటం ద్వారా జాతీయాదాయ అభివృద్ధి కొరకు, ఆర్థిక వ్యవస్థను బలీయం చేసేందుకు ప్రభుత్వంతో సహకరించటం. అదే సమయంలో ఈ ఆర్థికవ్యవస్థ పరిధిలోనే కార్మికవర్గ ప్రయోజనాలను పరిరక్షించటం" అనే రెండు కర్తవ్యాల విధానాన్ని అనుసరించి వుండేవారు కాదు. నిఖార్సయిన, సాధారణమైన వర్గ సంకర విధానం తప్ప ఇది మరోటికాదు. ఇంతేగాక, ఏఐటియుసి నాయకత్వం కార్మిక సంఘ ప్రజాస్వామ్యాన్ని తక్కువ అంచనావేసి నిరంకుశంగా మారిపోయింది. ఏఐటియుసి నాయకత్వంలోని సంఘాలు కూడా ప్రభుత్వంతో, యాజమాన్యంతో రాజీపడే వర్గ సంకర విధానాలతో తమ కార్యకలాపాలను సాగించటం ప్రారంభించాయి. ఏఐటియుసి నాయకులు, ప్రభుత్వానికి చెందిన వివిధ కమిటీలు, కమీషన్‌లలో సభ్యులుగా నియమించబడటం ద్వారా కార్మికవర్గ ప్రయోజనాలకు ప్రమాద కరమైన అవమానకరమైన పాత్ర నిర్వహించటం ప్రారంభించారు. ఆవిధంగా కార్మికుల వర్గ రాజకీయాలను, వర్గ దృక్పథాన్ని ఎత్తిపట్టవలసిన కేంద్ర కార్మికసంఘ నాయకత్వం భారతదేశంలో కార్మికుల, కార్మికవర్గ ఉద్యమాన్ని ఐక్యంచేసి, బలీయంచేసే తన వర్గ పాత్రను, వర్గ కర్తవ్యాన్ని క్రమక్రమంగా రద్దుచేసుకుంటూ వచ్చింది.

మరోవైపున ఆర్థిక సంక్షోభం తీవ్రమౌతూ "ప్రజాస్వామ్యయుతంగా" ఎన్నికైన ప్రభుత్వాలు దుర్భరమౌతున్న కార్మికుల జీవితాలకు, జీవన పరిస్థితులకు ఎలాంటి ఉపశమనం కలిగించని పరిస్థితిలో వున్నారు.

తిరిగి, ఏఐటియుసి చీలిపోయి, 1970లో సిఐటియు ఏర్పడటం – కార్మికవర్గ ఐక్యతలో మరో దెబ్బ. చారిత్రక అవసరంగా నూతన కార్మికసంఘాన్ని ఏర్పాటుచేసి, ప్రజాస్వామ్య యుతమైన కార్మికసంఘ కేంద్రం వెనుక భారత దేశంలో సమరశీల కార్మికవర్గాన్ని సమీకరించాలని సిఐటియు ఏర్పాటు సందర్భంగా ప్రకటించారు.

1974లో అఖిలభారత రైల్వే సమ్మె బ్రద్దలవటానికి నేపథ్యంగా వున్న భారతదేశం లోని సాధారణ పరిస్థితి ఇదికాగా, సమ్మె తలెత్తటానికి దోవతీసిన ప్రత్యేక పరిస్థితులు కూడా ముఖ్యంగా పేర్కొనదగినవి.

భారత ప్రభుత్వం 'పారిశ్రామిక శాంతి'గా చెప్పబడేదానిని పరిరక్షించే పేరున, అవాంఛనీయ, ప్రమాదకర వివాదాలను తప్పించే పేరున – ఒక్కో పరిశ్రమలో యాజమాన్యంతో బేరసారా లాడే కార్మిక ప్రతినిధులుగా "గుర్తింపు పొందిన ట్రేడ్ యూనియన్" విధానాన్ని అనుసరిస్తోంది. "గుర్తింపు యూనియన్" విధానానికి అన్ని కేంద్ర కార్మిక సంఘాలు, సమాఖ్యలు లోబడిపోయాయి. దీని ద్వారా తమ నిరంకుశ నాయకత్వ శక్తితో యూనియన్లను కొనసాగించటానికి, కార్మిక సంఘాల పరిగణనలోకి చట్టబద్ధంగా ప్రవేశించకుండా ఇతర యూనియన్లను తప్పించటానికి అవకాశాలు ఏర్పడ్డాయి. దీనితో

ఏఐటియుసి, సిఐటియులతో సహా అన్ని కార్మికసంఘ కేంద్రాలు, ఏమైనాసరే, గుర్తింపును పొందటమే ధ్యేయంగా, వారి ఓట్లను పొందటం కోసం పరిశ్రమలో పనిచేసే ఓటర్లయిన కార్మిక సభ్యులను, ప్రాంతీయ, కుల, మత మరియు ఇతర అస్థిత్వ ప్రాతిపదికన చీల్చేందుకు సైతం వెనుకాడలేదు. ఒక పరిశ్రమలో ఓటర్లయిన కార్మికులను పెంచుకునేందుకు మరింతగా, మరింతగా వారికి సదుపాయాలు, ప్రయోజనాలు కల్పించేందుకు పోటీపడటానికి బదులుగా, ఇతర సంఘాలను వెనక్కుగొట్టడానికి, యాజమాన్యాలతో ప్రభుత్వాలతో రాజీపడటం ద్వారా ప్రత్యర్థి కార్మికసంఘ నాయకత్వంలో సాగుతున్న న్యాయమైన, అవసరమైన ఆందోళనలను ఓడించేంత దూరం వెళ్ళాయి. ఆవిధంగా కార్మికవర్గం నడుమ ఐక్యతకు మరింతగా విఘాతం కలిగిస్తూ, దుర్మార్గమైన దోపిడీ పారిశ్రామిక యాజమాన్యాలకు, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడేదానికన్నా, ఒకే పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులను శాశ్వత శత్రువులుగా మలచాయి. ఈ పారిశ్రామిక శాంతి విధానంలోని “గుర్తింపు కార్మికసంఘ”మనేది కార్మికులను, వారి ఐక్యతను దెబ్బతీసే సాధనంగానేకాక, పాదార్థిక సౌకర్యాలు కల్పించటం ద్వారా ఆయా గుర్తింపు యూనియన్ నాయకత్వాలను సైతం లొంగదీసుకోవటానికి కూడా వినియోగించారు.

అఖిల భారత రైల్వే మెన్స్ ఫెడరేషన్ (ఏఐఆర్ఎఫ్), నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్ (ఎన్ఎఫ్ఐఆర్)లనే రెండు రైల్వే యూనియన్లను రైల్వేబోర్డు గుర్తింపు సంఘాలుగా గుర్తించింది. ఈ రెండు యూనియన్లు రైల్వే కార్మికుల హక్కుల కోసం పోరాటం సాగించాల్సి వుంది.

ప్రభుత్వ పర్యవేక్షణలో రైల్వే కార్మికులకు ఆచరణలో యాజమాన్య సంస్థ-రైల్వేబోర్డు. ఈ బోర్డు యొక్క నిరంకుశ నిర్వహణ, రెండు గుర్తింపు పొందిన యూనియన్ల నాయకులను పాదార్థిక సౌకర్యాల ప్రలోభాలతో లొంగదీసుకుంది. వారికి రైల్వేబోర్డుతోనున్న సాన్నిహిత్యంతో ఇది సాధ్యమైంది. కార్మికులను ‘క్రమశిక్షణా యుతంగా’ వుంచటానికి సహకరించుకుంటూ, కలిసిమెలిసి పనిచేయాలని వారిని లోబరచుకుంది. గుర్తింపు పొందిన రైల్వే యూనియన్ల నాయకత్వాలను-కార్మికుల సమరశీల స్వతంత్ర కార్యకలాపాలను అదుపు చేయటానికి, అణచటానికి అది వినియోగించింది. కార్మిక సంఘాలు కూడా నిరంకుశ నిర్మాణాలుగా తయారై సాధారణ కార్మిక శ్రేణుల నుండి దూరమయ్యాయి.

1960లలో రైల్వే కార్మికులలో తక్కువ వేతనాలు, గడ్డు పని పరిస్థితులు, ఎక్కువ పనిగంటలతో అశాంతి పెరిగిపోయింది. రైల్వేబోర్డు దీనిపై సానుకూలంగా స్పందించక పోవటం, రెండు గుర్తింపుపొందిన యూనియన్లు కార్మికుల నుండి దూరమవటం, వారి అశక్తత, కార్మికుల నడుమ ఒక విధమైన నిరాశా నిస్పృహలకు దోవతీశాయి. ఈ పరిస్థితులలో వారి ప్రయోజనాల కొరకు, ‘లోకో - రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్’ వంటి స్వతంత్ర విభాగ ప్రాతిపదికన సంఘాల ఏర్పాటుకు, ఒకవిధమైన సమిష్టి, స్వతంత్ర కార్యక్రమానికి దోవతీసింది. ఈ విభాగాల కార్మికసంఘాలు 1960, 1967, 1968, 1970లలో గుర్తింపు యూనియన్ల జోక్యమేమీ లేకుండానే అనేక పారిశ్రామిక కార్యక్రమాలను నిర్వహించాయి. ఈ పరిణామాలు - కార్మికవర్గ సమరశీలతకు, రైల్వే కార్మికుల నడుమ వర్గ చైతన్య ప్రాథమిక లక్షణాలకు స్పష్టమైన సూచికలుగా వుండి, 1974 మే నాటి అఖిలభారత రైల్వే కార్మికుల సమ్మె వైపుగా నడిపించాయి.

1973 ఆగస్టులో “వర్క్ టు రూల్”, “వర్క్ టు డిజిగ్నేషన్”, “సామూహిక శలవు” మొదలైన రూపాల్లో అనేక పోరాటాలు సాగించిన అనంతరం, ప్రభుత్వం లొంగి వచ్చి తమ సంఘ జెఎసితో చర్చలు జరిపేందుకు ‘లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్’ ప్రభుత్వాన్ని రప్పించగలిగింది. ఇది ఒక గుర్తింపు సంఘం కాకపోయినప్పటికీ, ఏఐఎఫ్ఆర్, ఎన్ఎఫ్ఐఆర్ రెండు సంఘాలు కూడా సంప్రదింపులను వ్యతిరేకిస్తున్నప్పటికీ, లోకో సిబ్బందితో చర్చలను, సమావేశాలను నిరోధిస్తున్నప్పటికీ - వారు తమ అపరిష్కృత దీర్ఘకాలిక డిమాండ్ అయిన పనిగంటలను 14 నుండి 10 గంటలకు తగ్గించుకోవటమనే ఒక ఒప్పందానికి రావటం ద్వారా విజయం సాధించారు. రైల్వే కార్మికులపై రైల్వే బోర్డు విధించిన ‘బ్రేక్ ఇన్ సర్వీస్’ అనే శిక్షను మాఫీ చేయాల్సి వుంది. రైల్వే కార్మికుల సంఘం ప్రతినిధిగా గుర్తింపు పొందిన యూనియన్ ఒక్కటి మాత్రమే సంప్రదింపులు జరుపుతుందనే ప్రతిష్ఠంభనను బ్రద్దలు చేశారు. స్వతంత్ర యూనియన్ యొక్క ఈ విజయం 1974లో ఒక ప్రముఖమైన పాత్ర నిర్వహించింది. ఎందువల్లనంటే, యాజమాన్యపు కక్ష సాధింపు బెదిరింపులకు వ్యతిరేకంగా ఐక్య ఆందోళన మాత్రమే భద్రతను కలిగించగలదని, తమ పోరాటాలలో ముందుకెళ్ళే అవకాశాలను మెరుగుపరుస్తుందని కార్మికులు గుర్తించ గలిగారు.

ఈ మధ్యలో 1973 అక్టోబర్‌లో ఏఐఆర్ఎఫ్ సదస్సులో, ఏఐఆర్ఎఫ్ అధ్యక్షునిగా జార్జి ఫెర్నాండెజ్‌ను ఎన్నుకున్నారు. ఈ సదస్సులో - రైల్వే కార్మికులకు సంబంధించిన యూనియన్లన్నింటితో, కేంద్ర కార్మికసంఘాలు అన్నింటితో కలిసి ఒక సదస్సు నిర్వహించాలని, రైల్వే కార్మికుల డిమాండ్స్ నెరవేర్చుకునేందుకు, రైల్వే సమ్మె విజయం సాధించేందుకు కార్యాచరణ సమన్వయకమిటిని ఏర్పరచు కోవాలని తీర్మానించారు. ‘రైల్వే కార్మికుల పోరాట జాతీయ సమన్వయ కమిటీ’ (ఎన్‌సిసిఆర్ఎస్)ను ఏర్పరచి, అన్ని రైల్వే యూనియన్లను, కేంద్ర కార్మికసంఘాలను రాజకీయ పార్టీలన్నింటినీ కలిపి, 1974 మే 8న నుండి ప్రారంభమయ్యే సమ్మెకు సన్నద్ధం చేశారు.

శ్రామిక అనుకూలమైనదిగా చెప్పుకునే ప్రభుత్వం, వేతన పెంపు, బోనస్ చెల్లింపు, క్యాజువల్ కార్మికుల క్రమబద్ధీకరణ మొదలైన కార్మికుల డిమాండ్లపై తన మొండి వైఖరితో, సమ్మెను అణచివేయటానికే నిశ్చయించుకుంది.

సంప్రదింపులు జరుగుతుండగానే, ప్రభుత్వం ఏఐఆర్ఎఫ్ అధ్యక్షుడు, ఎన్‌సిసిఆర్ఎస్‌కు చెందిన సంప్రదింపుల కమిటీలో ముఖ్యుడు అయిన జార్జి ఫెర్నాండెజ్‌ను అరెస్టు చేసింది. దేశవ్యాపితంగా వేలాదిమంది రైల్వే కార్మికులను అరెస్టు చేశారు. ‘డిఫెన్స్ ఆఫ్ ఇండియా’ క్రూర నిబంధనలు, ఆంతరంగిక భద్రతా నిర్వహణ (ఎంఐఎస్ఏ-మీసా) చట్టం వంటి వాటిని కార్మికులపై ప్రయోగించారు. ప్రభుత్వం తన అణచివేత యంత్రాంగాన్ని, ప్రసార మాధ్యమాలను సమ్మెను అణచటానికి వినియోగించింది. పోలీసులు, భద్రతా బలగాలు, సైన్యం, నావికా సేనలను రప్పించి, సమ్మెను విచ్ఛిన్నం చేయాలని చూశారు. వాస్తవికంగా ప్రభుత్వం, సమ్మె చేస్తున్న రైల్వే కార్మికులకు వ్యతిరేకంగా ఒక యుద్ధాన్నే సాగించింది. సమ్మె ఆందోళనాకారులపై, వారి కుటుంబాలపై ప్రభుత్వం క్రూరమైన విధానాలను చేపట్టింది.

రైల్వే కాలనీలన్నీ బిఎస్ఎఫ్, సిఆర్‌పిఎఫ్, పిఏసి వంటి పోలీసు బలగాలతో దిగ్బంధించ బడ్డాయి. రైల్వే కాలనీలన్నింటికీ నీరు, విద్యుత్ సరఫరాలను నిలిపివేశారు. ఇండ్ల వద్ద రైల్వే కార్మికులు అరెస్టుగాకుండా తప్పించుకుంటే, పోలీసులు ఆయా కార్మిక కుటుంబాలలోని మహిళలను, వారి భార్యాపిల్లలను చిత్రహింసల పాల్జేశారు. అర్ధరాత్రుళ్ళు వారి ఇళ్ళపై దాడులు చేసి, వారిని వారి ఇళ్ళనుండి తోసిపడేశారు; తిట్లు, శాపనార్థాలు ప్రయోగించారు. పోలీసుల వత్తిడి కల్పించిన భయోత్పాతంతో కొందరు

కార్మికులు తిరిగి పనిలోకి వెళ్ళిన ఘటనలు కూడా ఉన్నాయి. లోకో సిబ్బంది సమ్మె ఉధృతంగా సాగుతున్న కాలంలో, తమ క్యాబిన్లలో బందీలుగా వున్న రైలు డ్రైవర్లు కూడా సమ్మెలో చేరారు. దేశవ్యాపితంగా రైల్వే కార్మికులపై ఇందిరాగాంధీ హయాంలో కల్పించిన ఈ భయోత్పాతం–దీని కొనసాగింపుగా అత్యయిక పరిస్థితి కాలంలో మరింత విశాల మోతాదులో నిర్బంధ విధానాలను అనుసరించటానికి ఒక ముందస్తు ప్రయోగంగా ఉపయోగపడింది.

మరోవైపున, రైల్వే సమ్మెకు సారధ్యం వహిస్తున్న నాయకత్వాన్ని, సమ్మెకు మద్దతునిస్తున్న విపక్ష పార్టీలను బెదిరించి, లొంగదీసుకునేందుకు ప్రభుత్వం రైల్వే సమ్మెను 'రాజకీయపరమైన సమ్మె'గా ఆరోపించింది. సమ్మెను రాజకీయ పరమైందిగా పేర్కొనటం ద్వారా, ఇందిరాగాంధీ ప్రభుత్వం సమ్మెలంటేనే దేశ వ్యతిరేకమైనవిగా ఆరోపించింది. ఆవిధమైన బెదిరించి లొగదీసుకునే ఎత్తుగడలతో, సమ్మెపై తాను ప్రయోగించిన అణచివేత పద్ధతులను సమర్ధించుకుంటూ, సమ్మెను విఫలం చేయటానికి నిర్ణయించుకుంది.

కమ్యూనిస్టు, సోషలిస్టు పార్టీలతో సహా విపక్ష రాజకీయ పార్టీలన్నీ ప్రభుత్వ దుర్మార్గ ఆరోపణలను ఎదుర్కోవటానికి బదులుగా, ఆవిధమైన దుర్మార్గ ఆరోపణలకు బెదిరిపోయి, లొంగిపోయాయి. ఎన్‌సిసిఆర్ఎస్ కార్యాచరణ కమిటీతోపాటు ఈ పార్టీలన్నీ పదేపదే ఇలా పేర్కొంటూ ప్రకటనలు చేశాయి. ".... రైల్వే కార్మికుల న్యాయమైన, సమంజసమైన డిమాండ్లను సాధించుకోవటం మినహా ఈ సమ్మె చేయటం వెనుక మాకు ఇంకేవిధమైన ఇతర ఉద్దేశ్యము లేదు". ఈ విధమైన అసమగ్రతలు, రాజకీయ అవగాహనలోని కొరవలు, పార్లమెంటరీ రాజకీయ పార్టీలుగా ఉన్న కారణంగా వారిపై అమానవీయ, కార్మిక వ్యతిరేక ప్రభుత్వ క్రూర అణచివేతలకు వ్యతిరేకంగా సమ్మెను తీవ్రతరం చేయటానికి సిద్ధంకాలేదు; సిపిఐ, సిపిఎం సోషలిస్టు పార్టీలు – సుదీర్ఘకాలం సమ్మెను కొనసాగించి, యావత్ కార్మికవర్గాన్ని దేశ వ్యాపిత సమ్మె రూపంలో సమైక్య కార్యాచరణ చేపట్టటానికంటే తక్షణ సంప్రదింపుల ద్వారా ఒక ఒప్పందానికి వచ్చేందుకు అత్యంత ఆసక్తి కనబరచాయి. ఈ రకమైన కార్యాచరణను అతివాద దుస్సాహసికవాదంగా భావిస్తూ దానిని ఆలోచించటానికే భయపడిపోయాయి.

అన్ని ఇతర పరిశ్రమలలోని కార్మికులను మే 15న దేశవ్యాపితంగా ఒక్కరోజు సమ్మె చేయమని పిలుపునిచ్చి వారు చేతులు దులుపు కున్నారు. రైల్వే సమ్మెకు సంఘీభావంగా నిర్వహించిన ఒక్కరోజు సమ్మెను చాలా గొప్పదిగా కీర్తించారు.

ప్రభుత్వ అణచివేత చర్యలను వారు ప్రధానంగా పేర్కొంటూ, సమ్మెను ముగించ వలసిందిగా గతంలోనే ప్రభుత్వం ప్రతిపాదించిన విధంగా ప్రభుత్వంతో సంప్రదింపులు జరపటమే మేలనేవిధంగా సూచించారు.

ఈవిధంగా తక్షణ ప్రయోజనాలేమీ పొందకుండానే సమ్మె అణచివేయబడింది. కార్మికుల యజమాని అయిన భారత ప్రభుత్వం ద్వారా ఒక్కగానొక్క రాయితీ కూడా పొందకుండానే కార్మికులంతా తిరిగి విధులలోకి వెళ్ళవలసి వచ్చింది.

మరోవైపున రైల్వేబోర్డు సమ్మెలో పాల్గొన్నందుకుగానూ, కార్మికులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడింది.

- దాదాపు 10 లక్షలమంది శాశ్వత కార్మికు లకు 'బ్రేక్ ఇన్ సర్వీస్' వర్తింపజేయటం ద్వారా వారంతా కొత్తగా విధుల్లో చేరిన వారయ్యారు.
- దాదాపు 30 వేలమంది శాశ్వత కార్మికు లను, పూర్తిగా తొలగించటమో లేదా తాత్కాలికంగా తొలగించటమో జరిగింది.
- 50 వేలమంది క్యాజువల్, బదిలీ కార్మికులను వారిలో అత్యధికులు 5 నుండి 20 సంllలుగా పనిచేస్తున్నప్పటికీ తిరిగి పనుల్లోకి తీసుకోలేదు.
- 20 వేలమందికి పైగా కార్మికులు డిఐఆర్ క్రింద నేరారోపణలపై విచారణ నెదుర్కొ న్నారు. ఈ కార్మికులకు సమ్మరిట్రయల్స్ (3 సంllల వరకు అత్యధికంగా శిక్ష విధించటానికి ఉద్దేశించబడిన నేర విచారణలు)జరిపి శిక్షించాలని ప్రభుత్వం కోరింది.
- అనేకమంది కార్మికులను ఒక యూనిట్ నుండి మరొక చోటికి, ఒక డివిజన్ నుండి మరో డివిజన్‌కు బదిలీ చేశారు.
- అసంఖ్యాకమైన రైల్వే కార్మికుల ఉద్యోగ స్థాయిని తగ్గించారు; అనేకమందిని ముందస్తు బలవంతపు పదవీ విరమణకు గురిచేశారు.
- కార్మికులను అణచివేయటానికి, వేధించ టానికి పని పరిస్థితులలో ఏకపక్షంగా మార్పులను ప్రవేశపెట్టారు.

అయితే, భారత కార్మిక చరిత్ర విషయంగా చెప్పుకుంటే, ఈ సమ్మె గొప్ప విజయం సాధించింది. భారతదేశం లాంటి పెద్ద దేశం లోని, భౌగోళికంగా చెల్లాచెదురుగానున్న పరిశ్రమలలోని కార్మికులతో ఈ సమ్మె దేశ వ్యాపితంగా సమన్వయం చేసుకోగలిగింది. తమకు వ్యతిరేకంగా యావత్ రాజ్య అణచివేత యంత్రాంగం మోహరించినప్పటికీ, రైల్వే కార్మికులు ధైర్యసాహసాలతో, సమరశీలమైన గొప్ప పోరాటం చేశారు. ఉద్యోగభద్రత అనేది అత్యంత బలహీనంగా వుండే తాత్కాలిక, క్యాజువల్ కార్మికులు కూడా, ఇతరులతోపాటు సమ్మెలోకి దూకారు. తమ స్వీయ ప్రయోజనాలకు చైతన్యయుతులైన ప్రతినిధులుగా వారు వ్యవహరించారు.

కార్మికులకు ఇతర సెక్షన్ల ప్రజానీకం నడుమ సంఘీభావం చెప్పుకోదగిన విధంగా వ్యక్తమైంది. సువిశాల భారతదేశ వ్యాపితంగా విస్తరించిన పరిశ్రమలలో కార్మికుల నడుమ వృత్తిపరమైన, సాంస్కృతికపరమైన విభజనలు వున్నప్పటికీ, సంఘీభావ ప్రభావాన్ని కార్మికులు సాధించారు. ఇతర పరిశ్రమల సేవారంగాల కార్మికులు, రైల్వే కార్మికుల సమ్మెకు వెనువెంటనే సంఘీభావం తెలిపారు.

రైల్వే సమ్మె తదుపరి, ప్రభుత్వం–పోలీసుశాఖ సహకారం తీసుకొని అనేకమంది పారిశ్రామిక అధిపతులు కఠినమైన విధానాలను చేపట్టారు. రైల్వే సమ్మె అనేది సంఘం చేపట్టిన కార్యక్రమం; దీనికి ఎలాంటి రాజకీయ ఉద్దేశ్యం లేదని జార్జి ఫెర్నాండెజ్, దాంగేలు నిరంతరాయంగా ప్రకటిస్తూ వస్తున్నప్పటికీ, ఈ సమ్మె దానికున్న వర్గ స్వభావంరీత్యా, అధికారంలోని పార్లమెంటరీ 'ప్రజాస్వామ్యం' కార్మిక, శ్రామికుల ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంగా లేదనే అంశాన్ని వెల్లడి చేసింది. పాలకులు బడా పెట్టుబడిదారీ, బడా భూస్వామ్య పాలకవర్గాల ప్రతినిధులని, ఈ సమ్మె వెల్లడి చేసింది. పార్లమెంటరీ విపక్ష రాజకీయపార్టీల డొల్లతనాన్ని, వారి 'విద్వత్ చర్చల' నిరర్ధకతను లేదా కార్మికవర్గ ప్రయోజనాల పరిరక్షణ విషయం కొచ్చేసరికి, వారి సంక్షేమానికి సేవ చేయటం దగ్గరకొచ్చేసరికి 'అవిశ్వాస తీర్మానం' వంటి వారి నిరసన రూపాలను గురించి ఈ సమ్మె వెల్లడి చేసింది. కార్మికవర్గానికి తమ స్వీయ వర్గ రాజకీయాల అవసరం సమస్యను, దోపిడీ చేస్తోన్న పాలకవర్గాలకు, పాలక ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు, అంతిమంగా ఇతర శ్రమజీవుల విభాగాలతో కలిపి తమ స్వీయ ప్రభుత్వాన్ని స్థాపించే అవసరాన్ని – ఈ సమ్మె లేవనెత్తింది.

కార్మికరంగంలో, కార్మికవర్గం యాజమాన్యా లతో, ప్రభుత్వంతో పోరాటం సాగిస్తూనే, కార్మికసంఘాల నిరంకుశాధికార కార్మికసంఘ నాయకత్వానికి వ్యతిరేకంగా నిర్ణయాత్మకంగా

**(తరువాయి 15వ పేజీలో)**

# కార్మికవర్గం-రైతాంగం

## లెనిన్

*(భారతసమాజ పురోగమనానికి ప్రధాన ఆటంకాలుగా వున్న భూస్వామ్య విధానం, సామ్రాజ్యవాదం, దళారీ పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా సాగే పోరాటంలో సమాజంలో ప్రధానశక్తిగా వున్న రైతాంగంతో ఐక్యత సాధించకుండా కార్మికవర్గం విజయం సాధించలేదు. 1905 నవంబర్‌లో కార్మికవర్గం-రైతాంగం' అన్న తన వ్యాసంలో కామ్రేడ్ లెనిన్ ఈ అంశాన్ని సైద్ధాంతికంగా విశ్లేషించారు. సోషలిజం కోసం పోరాటంలో కార్మికవర్గ నాయకత్వం ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసుకోవలసిన అవసరాన్నీ, అందుకు ముఖ్యమైన కార్మిక-రైతాంగ మైత్రిని సాధించటం ద్వారానే పురోగమించగలుగుతుందనీ పేర్కొన్నారు. - సంపాదకులు)*

**ఇప్పుడు** మాస్కోలో జరుగుతున్న రైతాంగ సంఘ మహాసభ ఒక ముఖ్య సమస్యను మన ముందుంచింది. రైతాంగ ఉద్యమం పట్ల సోషల్ డెమోక్రాట్ల వైఖరి ఏమిటి? కార్యక్రమాన్నీ, ఎత్తుగడలనూ నిర్వచించుకుంటున్న రష్యా మార్క్సిస్టులకు ఈ ప్రశ్న కీలకమైనదిగా వుంటూ వచ్చింది. రష్యా సోషల్ డెమోక్రాట్ల కార్యక్రమపు మొదటి ముసాయిదా (దీనిని 1884లో కార్మిక విమోచన గ్రూపు విదేశంలో ప్రచురించింది) రైతాంగ సమస్యను కీలకాంశంగా చర్చించింది.

ఆనాటి నుండీ నిర్దిష్టమైన మార్క్సిస్టు వైఖరులనూ, నినాదాలనూ అభివృద్ధి చేసి, అన్వయించని సోషల్ డెమోక్రాటిక్ పత్రికగానీ, సాధారణ సమస్యలను చర్చించిన మార్క్సిస్టు రచన గానీ లేదు.

సైద్ధాంతికంగానే కాకుండా, ప్రత్యక్ష కార్యాచరణ రీత్యా కూడా రైతాంగ ఉద్యమం నేడు అత్యంత జరూరు సమస్యగా వుంది. మన సాధారణ నినాదాలను విప్లవకర రైతాంగానికి విప్లవకర కార్మిక వర్గమిచ్చే పిలుపులుగా మలచాల్సి వుంది. రష్యాలో నూతన జీవన విధాన రూపకర్తగా చైతన్యంతో రైతాంగం ముందుకు వస్తున్న సమయం వచ్చింది. రష్యా విప్లవ క్రమమూ, ఫలితమూ కూడా రైతాంగపు చైతన్యం అభివృద్ధి చెందటంపై అపారంగా ఆధారపడి వుంది.

విప్లవాన్నుండి రైతాంగం కోరుకుంటున్న దేమిటి? రైతాంగానికి విప్లవమిచ్చేదేమిటి? రాజకీయ కార్యకలాపాల్లో నిమగ్నమైవున్న ప్రతి ఒక్కరూ, ప్రత్యేకించి బూర్జువా రాజకీయ వేత్తలు వక్రీకరించిన అర్థంలోగాక, దాని సరైన అర్థంలో రాజకీయాలు నడిపే వర్గ చైతన్యపూరిత కార్మికుడు ఈ రెండు ప్రశ్నలకూ సమాధానం చెప్పాలి.

రైతాంగం భూమినీ, స్వేచ్ఛనూ కోరు తున్నారు. దీనిపై మరో అభిప్రాయమంటూ లేదు. విప్లవకర రైతాంగానికి వర్గ చైతన్యంగల కార్మికులందరూ తమ పూర్తి మద్దతునిస్తారు. రైతాంగానికి భూమంతా చెందాలనీ, వారు పూర్తి స్వేచ్ఛ పొందాలనీ వర్గ చైతన్యంగల కార్మికులందరూ కోరుకుంటున్నారు; దానికోసమే పని చేస్తున్నారు. మొత్తం భూమి రైతాంగానికి చెందాలని డిమాండు చేయటమంటే పాక్షిక రాయితీలూ, దానానికి సంతృప్తి పడటం కాదు; రైతాంగానికీ, భూస్వాముల మధ్య రాజీ కొరకు కృషి చేయటం కాదు; భూఎస్టేట్ల రద్దు కొరకు కృషి చేయటం. వర్గ చైతన్యపూరిత కార్మికవర్గ పార్టీ అయిన సోషల్ డెమోక్రాట్లు ఈ వైఖరినీ ఉద్ఘాటించారు. ప్రైవేటు యాజమాన్యంలో వున్న భూములన్నింటినీ **స్వాధీనపరచుకోవటంతోసహా,** రైతాంగ విప్లవకర డిమాండ్లన్నింటికీ ఈ ఏడాది మే నెలలో జరిగిన ఆర్.ఎస్.డి.ఎల్.పి మూడవ మహాసభ మద్దతు తెలుపుతూ తీర్మానం ఆమోదించింది. వర్గచైతన్యం గల కార్మికుల పార్టీ భూమి కావాలన్న రైతాంగపు డిమాండుకు మద్దతు తెలిపినట్లు ఈ తీర్మానం స్పష్టం చేసింది.

"పూర్తి స్వేచ్ఛ" అంటే అర్థం ప్రజా, రాజ్య వ్యవహారాలను పాలించే అధికారులనూ, ప్రతినిధులనూ ఎన్నుకోవటం. "పూర్తి స్వేచ్ఛ" అంటే అర్థం పూర్తిగా ప్రజలపై ఆధారపడని, ప్రజలచే ఎన్నుకోబడని, ప్రజలకు బాధ్యత వహించని, మార్చివేసే అధికారం ప్రజలకు లేని రాజ్య వ్యవస్థను పూర్తిగా రద్దు చేయటం. "పూర్తి స్వేచ్ఛ" అంటే అర్థం అధికారులకు ప్రజలు లొంగివుండటంకాదు; ప్రజలకు అధికారులు లొంగివుండటం.

అయితే భూమి కొరకూ, స్వేచ్ఛ కొరకూ పోరాడుతున్న రైతాంగమంతా తమ పోరాట ప్రాధాన్యతను పూర్తిగా అర్థం చేసుకోలేదు; రిపబ్లిక్కును డిమాండు చేసే స్థాయికి చేరుకోలేదు. అయితే రైతాంగపు డిమాండ్లలో ప్రజాస్వామిక ధోరణి వుందన్నది నిస్సందేహం. కనుక కార్మికవర్గం తన డిమాండ్లను సమర్థిస్తుందని విశ్వసిస్తుంది. నగరాలలో ఎగురుతున్న ఎర్రజండా పారిశ్రామిక, గ్రామీణ శ్రామికుల తక్షణ, కీలక డిమాండ్ల పోరాట జెండా మాత్రమే కాదనీ, భూమిని దున్నే లక్షలాది రైతాంగపు డిమాండ్ల కొరకు కూడా నిలుస్తుందని రైతాంగం తెలుసుకోవాలి.

అవకాశమున్న అన్ని రూపాలలో వున్న అర్ధ బానిస వ్యవస్థ, అవశేషాలు రైతాంగ జనావళిని నిర్దాక్షిణ్యంగా అణచివేతకు గురి చేస్తున్నాయి. ఎర్రజండా నీడలో కార్మికవర్గం ఈ అణచివేతపై యుద్ధాన్ని ప్రకటించింది.

అయితే రైతాంగపు డిమాండ్లకు కార్మిక వర్గపు మద్దతుకే ఎర్రజండా పరిమితం కాబోదు. అది కార్మిక వర్గపు స్వతంత్ర డిమాండ్ల కొరకు కూడా నిలుస్తుంది. అది భూమి కొరకు, స్వేచ్ఛ కొరకు పోరాటపు పక్షాన నిలవటమే కాదు మనిషిని మరో మనిషి చేసే దోపిడీకి ప్రజల దారిద్ర్యానికీ పెట్టుబడి పాలనకూ వ్యతిరేక పోరాటపు పక్షాన కూడా నిలుస్తుంది.

ఇక్కడే మనకు రెండవ ప్రశ్న ఎదురౌతుంది. రైతాంగానికి విప్లవ మేమిస్తుంది? రైతాంగం పట్ల నిజాయితీతో కూడిన స్నేహితులు (ఉదాహరణకు సోషలిస్టు విప్లవకారులు) ఈ ప్రశ్నను ఉపేక్షిస్తున్నారు; దాని ప్రాధాన్యతను గుర్తించటం లేదు. రైతాంగం కోరుకుంటున్న భూమి, స్వేచ్ఛ సమస్యలను లేవనెత్తి పరిష్కరిస్తే సరిపోతుందని వారు భావిస్తున్నారు. ఇది చాలా పెద్ద పొరపాటు. క్రింది నుండి అత్యున్నత స్థాయి వరకూ అధికారుల ఎన్నిక అన్న పూర్తి స్వేచ్ఛ పెట్టుబడిపాలనను అంతమొందించదు, కొద్ది మంది సంపదను రద్దు చేయదు; ప్రజల దారిద్ర్యాన్ని పోగొట్టదు. భూమిలో ప్రైవేటు యాజమాన్యపు పూర్తి రద్దు కూడా పెట్టుబడి పాలననుగానీ, ప్రజారాశుల దారిద్ర్యాన్నిగానీ అంతమొందించదు. జాతిపరం చేసిన భూమిలో కూడా స్వంత పెట్టుబడి వున్నవారే, సాగు సాధనాలు సాగు పశువులు, యంత్రాలు, విత్తనాలు, వున్నవారే సాగు చేయగలుగుతారు. తమ చేతులు తప్ప ఏమీ లేని వారు భూమి జాతికి చెందినప్పటికీ ప్రజాస్వామిక రిపబ్లిక్కులో కూడా అనివార్యంగా పెట్టుబడికి బానిసలుగానే వుండిపోతారు. పెట్టుబడిని సామాజీకరించ కుండా భూమిని "సామాజీకరించే" భావం, పెట్టుబడీ, సరుకుల ఆర్థికం వుండగానే భూమి వినియోగంలో సమానత్వం తేగలమన్న భావం

పగటికలగానే వుంటుంది. సోషలిజంలో ఈ భ్రమలు ప్రబలిన కాలం యూరోపు దేశాలన్నిటా వుంది. ఈ భ్రమ ఎంత ప్రమాదకరమో అన్ని దేశాల కార్మికవర్గ పోరాటాల అనుభవం ఆచరణలో నిరూపించింది. యూరోపు, అమెరికాలలోని సోషలిస్టు కార్మికవర్గం ఈ భ్రమలను పూర్తిగా వదిలించుకుంది.

కనుక వర్గచైతన్యపూరిత కార్మికుల ఎర్రజెండా మొదట భూమి కోసం సంపూర్ణ స్వేచ్ఛ కోసం రైతాంగ పోరాటానికి అన్ని విధాలా మద్దతునిస్తుంది. తర్వాత అక్కడితో ఆగకుండా ముందుకు పోతుంది. భూమి కోసం, సంపూర్ణ స్వేచ్ఛ కోసం పోరాటంతో పాటుగా మనం సోషలిజం కోసం పోరాడుతున్నాము. సోషలిజం కోసం పోరాటమంటే పెట్టుబడి పాలనకు వ్యతిరేకంగా పోరాడటం. ప్రత్యక్షంగానూ, పూర్తిగానూ పెట్టుబడి పరాధీనులైన వేతన కార్మికులు ఈ పోరాటాన్ని ప్రధానంగా సాగిస్తారు. చిన్న ఆస్తిపరులకు సంబంధించి, వారిలో కొందరు స్వంత పెట్టుబడి కలిగి వుంటారు; తరచుగా కార్మికులను దోచుకుంటారు. కనుక సోషలిజం పక్షానికి, ప్రైవేటు ఆస్తికి వ్యతిరేకంగా ప్రజాఆస్తి పక్షానికి చైతన్యంతో నిశ్చయాత్మకంగా వచ్చిన వారు మాత్రమే దీనిలో చేయగలరు.

కనుకనే భూస్వాములకు, అధికారులకు వ్యతిరేకంగా మొత్తంగా రైతాంగం కలిసి పోరాడుతూనే, పట్టణ, గ్రామీణ శ్రామికులతో కలసి పెట్టుబడికి వ్యతిరేకంగా పోరాడు తున్నామని సోషల్ డెమోక్రాట్లు చెబుతున్నారు. భూమికోసం, స్వేచ్ఛ కోసం పోరాటం ప్రజాస్వామిక పోరాటం. పెట్టుబడి పాలన రద్దు కొరకు సాగే పోరాటం సోషలిస్టు పోరాటం.

సంపూర్ణ స్వేచ్ఛ, భూమి కొరకు కృతనిశ్చయంతో, నిస్వార్థంగా పోరాడాలని నిర్ణయించుకున్న రైతాంగ సంఘానికి అభినందనలు తెలియజేద్దాం. ఈ రైతాంగం నిజమైన ప్రజాస్వామికవాదులు, ప్రజాస్వామ్యం, సోషలిజాల పట్ల వారి భావాలలో పొరపాటు ఎక్కడుందో వారికి ఓపికతో వదలకుండా వివరిద్దాం. ఒక సమష్టి పోరాటంలో ఐక్యమైన మిత్రులుగా వారిని పరిగణిద్దాం. ఈ రైతాంగం నిజమైన విప్లవకర ప్రజాస్వామికవాదులు, వారితో కలిసి మనం ప్రస్తుత విప్లవ విజయానికై పోరాడుదాం. సార్వత్రిక సమ్మె పథకానికీ, పట్టణ కార్మికులూ, రైతాంగమూ కలసి పోరాడాలన్న నిర్ణయానికి మద్దతు తెలుపుదాం. విప్లవకర ప్రజాస్వామికవాదులలో ఎంత ఐక్యత సాధించినా, మరింత ముఖ్యమైన సోషలిజం కోసం పెట్టుబడి పాలన రద్దు కోసం, మానవాళి విముక్తి కోసం పోరాడాల్సిన లక్ష్యాన్ని కార్మికులు మరువరాదు. భూమికోసం, సంపూర్ణ స్వేచ్ఛకోసం కార్మికులూ, రైతాంగం ముందుకు సాగండి! అంతర్జాతీయ సోషల్ డెమోక్రసీతో ఐక్యమై, సోషలిజం కొరకు పోరాటంలో కార్మికులారా ముందుకు సాగండి!

**నవంబరు 12, 1905, సంపుటి: 10, పేజీ 22-25** ★

---

**(13వ పేజీ తరువాయి)**

పోరాడి, సంఘాలలో కార్మికసంఘ ప్రజాస్వామ్యాన్ని సాధించుకోవాలి. కార్మికుల నడుమ కార్మికవర్గం నడుమ ఐక్యతను, సమస్యల ప్రాతిపదికపై ఐక్య కార్యాచరణలు, పోరాటాలు, ఆందోళనల ద్వారా మాత్రమే సాధించగలమని ఈ సమ్మె స్పష్టంగా సూచించింది. సమరశీలత, కార్మికవర్గ చైతన్యాలను, కార్మిక ప్రయోజనాలే పరమావధిగా కార్మికుల, కార్మికవర్గం నడుమ పెంపొందించింది.

1974నాటి రైల్వే కార్మికుల చారిత్రాత్మక సమ్మె నుండి తీసుకోవలసిన గుణపాఠాలు ఇవి :

1974 నాటి అఖిలభారత రైల్వే కార్మికుల సమ్మెను గురించిన సమగ్రమైన సమీక్ష కాదిది అయితే ఈ సమ్మె నుండి తీసుకున్న గుణపాఠాల సారం ఎన్‌సిసిఆర్‌ఎస్ ప్రతినబూనిన విధంగా చేసిన తీర్మానంలోని ఈ కర్తవ్యాన్ని స్వీకరించాల్సి వుంది. "…. ఉద్యమానికి నాయకత్వం వహించేందుకు దాని శక్తిలోపు ఏమైనా చేయగలగటం, పోరాడేందుకు దేశంలో కార్మికవర్గ, శ్రామిక ప్రజానీకంల నడుమ ఐక్యతను నెలకొల్పటం, ఈ పరిశీలనలపై ఆధారపడిన విభజనలన్నింటినీ మరో మాటల్లో చెప్పాలంటే…. 'కార్మికులను ఒక వర్గంగా సంఘటితం చేయటం' అనే కర్తవ్యం, కార్మిక వర్గాన్ని ఒక వర్గంగా సమీకరించి బూర్జువావర్గ ఆధిపత్యాన్ని కూలద్రోయటం, కార్మికవర్గ రాజకీయాధికారాన్ని సాధించడం అనేవి కమ్యూనిస్టుపార్టీ ప్రణాళికలో పేర్కొన్నవాటిని సాధించాలి".

50 సం॥లు గడిచిన తర్వాత కూడా, ఈ కర్తవ్యాన్ని చేబూని, దానిని నెరవేర్చేందుకు ఆచరణలో నిజాయితీ గల ప్రయత్నమేదీ జరగలేదు. సాధారణ మార్క్సిస్టు – లెనినిస్టు సూత్రాలను వల్లెవేయటమో లేదా బడాయి నినాదాలను జపిస్తూ వుండటమో కార్మికవర్గాన్ని ఒక వర్గంగా సంఘటితం చేసేందుకు లేదా వర్గ చైతన్యం పెంపొందించేందుకు తోడ్పడేవి కావు; నిజాయితీతో కూడిన ప్రయత్నం చేయనంత వరకు ఇది సాధ్యం కాదు. సర్వజ్ఞులుగా కపటంగా నటించకుండా, మార్క్సిజం – లెనినిజం సూత్రాలను నిర్దిష్ట భారత పరిస్థితులకు, వాస్తవ స్థితిగతులకు అన్వయించకుండా, రాజకీయ అధికారాన్ని సాధించే ఈ కర్తవ్యం నిర్వహించటం సాధ్యంకాదు.

**(2024 మే 'క్లాస్‌స్ట్రగుల్' నుండి అనువాదం)** ★

---

**(3వ పేజీ తరువాయి)**

వివిధ రాష్ట్రాలలో ఫ్యూడల్ బూర్జువా వర్గంలోని వైరుధ్యాలు బద్ధలయ్యాయి. వీరిలో కొంతమంది కూటమిని ఆశ్రయించారు. కూటమి గెలిస్తే ప్రధానమంత్రి ఎవరన్న సమస్య గూడ కూటమికి ఒక సమస్యగానే ముందు కొచ్చింది. పార్లమెంటు సీట్ల కేటాయించు కోవడంలో వచ్చిన సమస్యలున్నాయి.

బిజెపి ఫాసిస్టు పోకడలను భరించి బాధలకు గురైన శక్తులు, దాని హిందూమత ఉన్మాదాన్ని భరించలేని ప్రజాస్వామిక శక్తులకు హిందూమతేతర ప్రజానీకం మోడీని గద్దె దించాలనే పట్టుదలను ప్రదర్శించాయి. కొన్ని కమ్యూనిస్టు, విప్లవ శక్తులు ఈ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని వ్యవహరించారు. తమ మౌలిక కర్తవ్యం నుంచి ప్రక్కకు పోకుండా ఈ ఎన్నికలలో బిజెపి మోడీని గద్దె దించాలనే వైఖరి తీసుకుని ఎండగట్టే కార్యక్రమం చేబట్టారు. అయితే బిజెపి ఓడిపోయి ఇండియా కూటమి అధికారంలోకి వస్తే అన్ని సమస్యలు పరిష్కార మవుతయనే భ్రమలలో కమ్యూనిస్టు విప్లవ కారులు లేరు. కాంగ్రెస్ మౌలిక విధానాలను – బడా బూర్జువావర్గ అనుకూల, సామ్రాజ్యవాద అనుకూల విధానాలను వదులుకుంటుందన్న భ్రమలలో లేరు. ఒక బూర్జువాశక్తి స్థానంలో మరో బూర్జువాశక్తి పైకెక్కగలుగుతుంది. వామపక్షశక్తులు బూర్జువా అధికార సాధన భ్రమలలోనే మిగిలిపోతారు.

ఫాసిజానికి వ్యతిరేక ఐక్య కార్యక్రమాలు, సంఘటన ఏర్పాటుకి ప్రయత్నం చేసిన కొన్ని విప్లవ శక్తులు, 'ఇండియా' ఏర్పాటుని స్వాగతించాయి. పార్లమెంటరీ పద్ధతుల ద్వారా కూడా ఫాసిస్టు ప్రమాదానికి సంకెళ్లు వేయవచ్చన్న ఆలోచనతో బిజెపిని ఈ ఎన్నికలలో ప్రమాదకరమైన శక్తిగా గుర్తించి ఓడించాలన్న పిలుపునిచ్చారు. అదే సందర్భంలో ఇండియా కూటమి విధానాలను తలకెత్తుకొన్నారని అనుకోలేము. ఇండియా కూటమి ప్రయత్నాలు ఫలించాయి. ఇప్పటివరకు ఇండియాలో చేరని బిజెపి వ్యతిరేక శక్తులు ఇండియాలో చేరి బిజెపికి అవకాశం లేకుండా చేస్తారని ఆశిద్దాం. ★

# రైతాంగ ఉద్యమ, రాజకీయ, నిర్మాణ స్ఫూర్తినందిస్తున్న రైతు కూలీ సంఘం (ఆంప్ర) సావనీర్లు, వార్షిక సంచికలు

**తెలంగాణ,** నక్సల్బరీ, శ్రీకాకుళం ఉద్యమాల వారసత్వపు కొనసాగింపులో భాగంగా రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో 2014 సం॥ వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగాను, తదనంతర కాలంలో విభజిత ఆంధ్రప్రదేశ్‌లోనూ రైతాంగ ఉద్యమ నిర్మాణ కృషి సాగుతూ ఉంది. 2001లో జరిగిన రైతుకూలీసంఘం రాష్ట్ర మహాసభలలో ఎన్నికైన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ మండ్ల సుబ్బారెడ్డి అనతి కాలంలోనే హఠాత్తుగా మరణించారు.ఆ తర్వాత జరిగిన సంఘం జనరల్ కౌన్సిల్ సమావేశంలో కామ్రేడ్ ఝాన్సీ అధ్యక్షులుగా ఎన్నికై కొనసాగుతున్నారు.

కాగా, 2001 మహాసభలో కార్యదర్శిగా ఎన్నికైన కామ్రేడ్ కోటయ్య, 2018 డిసెంబర్‌లో మరణించే వరకు ఆ బాధ్యతలను నిర్వహించారు. తదనంతరం జరిగిన జనరల్ కౌన్సిల్ సమావేశంలో కామ్రేడ్ ఎం.ఎస్. నాగరాజు కార్యదర్శిగా ఎన్నికై కొనసాగుతున్నారు.

రైతు కూలీ సంఘం(ఆం.ప్ర)నాయకత్వం-గుంటూరులో జరిపిన రాష్ట్ర మహాసభల తదనంతరం, రాష్ట్ర మహాసభల సావనీర్‌ను విడుదల చేసింది. సంఘ శ్రేణుల ఉద్యమ కార్యాచరణకు,రాజకీయ అవగాహన పెంపొందించుకునేందుకు, ఈ వరుసలోనే ఇప్పటి వరకు 2001, 2002, 2003, 2005, 2007, 2010, 2012, 2016, 2018, 2022 సంవత్సరాలలో వెలువరిస్తూ వస్తోన్న మహాసభల సావనీర్లు లేదా వార్షిక సంచికలన్నింటినీ ఒక్కసారి సింహావలోకనం చేయడం అవసరం.

❖❖❖

గుంటూరులో **2001** ఏప్రిల్ 7,8,9 తేదీల్లో జరిగిన రాష్ట్ర మహాసభల అనంతరం మొదటిగా **మహాసభల సావనీర్‌ను** వెలువరించారు.




110 పేజీల ఈ సావనీర్‌లో మహాసభ విశేషాలు, ఉపన్యాసాలు, తీర్మానాలతో పాటుగా... 1990ల తర్వాత కాలంలో సంఘం ఆధ్వర్యంలో సాగిన కృషిని క్లుప్తంగా పేర్కొన్నారు.

ప్రపంచీకరణ విధానాలకు ముందస్తుగా, పీవీ నరసింహారావు ప్రధానిగా ముందుకు తెచ్చిన డంకెల్ ప్రతిపాదనలను నిరసిస్తూ... ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంకు-డబ్ల్యూటీవోలు ముఖ్యంగా వ్యవసాయ రంగంపై కలిగించనున్న దుష్పరిణామాలను పేర్కొంటూ నిర్వహించిన విస్తృత ప్రచార, ఆందోళనా కార్యక్రమాలను ఈ సావనీర్‌లో సంక్షిప్తంగా పేర్కొన్నారు.

అమరులు కామ్రేడ్స్ పాతర్ల నాగయ్య-విశ్వమోహన్ రెడ్డిల ప్రాంగణంలో ఈ మహాసభలు జరిగాయి. 2000 ఏప్రిల్ 11న బూటకపు ఎదురుకాల్పులలో రాజ్యం... రైతు కూలీ ఉద్యమ నాయకుడు కామ్రేడ్ విశ్వమోహన్ రెడ్డి,పీడిత మహిళా నాయకురాలు కామ్రేడ్ మరియమ్మలను హత్య గావించి సంవత్సరం అయిన నేపథ్యంలో ఈ మహాసభలు గుంటూరులో జరిగాయి.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ మాజీ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ కె.రాజా రామ్‌మోహన్‌రావు ఆహ్వాన సంఘ అధ్యక్షునిగా గుంటూరులో రాష్ట్ర మహాసభలు జరిగాయి. నక్సల్బరి ఉద్యమ నిర్మాత కామ్రేడ్ కానూ సన్యాల్ ఈ మహాసభలలో ప్రారంభోపన్యాసం చేయడం విశేషం. ప్రజాతంత్ర మేధావి, భారత జన ఆందోళన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బి.డి శర్మ, వ్యవసాయ శాస్త్రవేత్త కే.ఆర్.చౌదరి, తదితర ప్రముఖులు ఈ మహాసభలలో పాల్గొని ప్రసంగించారు.

ఈ మహాసభల నిర్వహణలో విస్తృతంగా పాల్గొని కృషిచేసిన పీడిత ప్రజా ఉద్యమ నాయకుడు కామ్రేడ్ అంగడి చెన్నయ్య 2001 డిసెంబర్ ఒకటిన హత్యగావించబడ్డారు.

ఈ మహాసభల సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ విప్లవ పోరాటం, సామ్రాజ్యవాద యుద్ధ బీభత్సాలను సాంస్కృతిక సామ్రాజ్యవాద దాడులను, కార్మిక-రైతాంగ పోరాటాలను చిత్రించిన...చిత్ర కళా ప్రదర్శన ఏర్పాటు మరో విశేషం.

ఈ మహాసభలలో 'గ్రామీణ పేదలు-రైతాంగంపై రుణభారం' 'గ్రామీణ పేదల భూమి సమస్య-ప్రభుత్వ సంస్కరణలు, చట్టాలు' 'కరువు-గ్రామీణ పేదల వలసలు' ప్రధాన అంశాలుగా చర్చలు జరిగి తీర్మానాలను ఆమోదించారు.

❖❖❖

2001 మహాసభల సావనీర్ కొనసాగింపుగా **వార్షిక సంచిక-2002**ను సంఘం వెలువరించింది. ఈ సంచికలో 'వ్యవసాయ రంగ సంక్షోభం-కారణాలు-పరిష్కారాలు' అంశంపై 2002 ఏప్రిల్‌లో విశాఖలో జరిగిన రాష్ట్ర సదస్సు రిపోర్టును, గ్రామీణ రుణభారంపై నిడమర్రులో జరిగిన చర్చాగోష్టి విశేషాలను,ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగంపై నిపుణుల కమిషన్ నివేదికను అందించారు.




2002 జూలైలో జరిగిన సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్ రిపోర్టుతో పాటుగా, కష్టజీవి మహిళల, గిరి జనుల, దళితుల, చేనేత కార్మికుల, ఉప్పు రైతుల, పొగాకు, పత్తి, మిర్చి, ధాన్యం, చెరకు, సుబాబుల్, జామాయిల్ రైతుల సమస్యలపై సాగించిన కార్యక్రమాలు, కరపత్రాలు అందించారు.

ఈ సంచికలో...అనుబంధంగా, జమీందారీ విధానానికి వ్యతిరేకంగా జరిగిన రైతు ఉద్యమం-ముఖ్యంగా మునగాల, లింగగిరి జమీందారీ ప్రాంతాలలోని దుర్భర స్థితిగతులను వివరించే చండ్ర రాజేశ్వరరావు గారి వ్యాసం, ఆంధ్ర రాష్ట్రంలో జరిగిన చారిత్రాత్మక రైతు రక్షణ యాత్ర పూర్వాపరాలను వివరించిన నండూరి ప్రసాదరావుగారి, పరకాల పట్టాభి రామారావు గారి వ్యాసాలు, తెలంగాణ సాయుధ పోరాట నాయకులు కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి నల్గొండ జిల్లా కోటపాడులో రజాకారు

మిలిటరీపై సాగించిన సాయుధ దాడి పూర్వాపరాలపై వ్రాసిన వ్యాసం... ఈ సంచికలో ప్రచురించారు. 'తాకట్టులో భారతదేశం'లో భాగంగా 'పీడితుల్లోకెల్లా అధమాధములు గిరిజనులు' అనే కామ్రేడ్ తరిమెలనాగిరెడ్డి గారి రచనను ఇందులో అనుబంధంగా ప్రచురించారు.

❖❖❖

దాదాపు 100 పేజీలతో వెలువడిన **వార్షిక సంచిక-2003**లో...



రాష్ట్రంలో నాటి అధికార తెలుగు దేశం ప్రభుత్వ పాలనలో, రాష్ట్ర సంపదలను పెట్టుబడిదారీ సామ్రాజ్య వాద శక్తులకు దోచి పెడుతూ, దీనినే అభివృద్ధిగా, హైటెక్ పాలనగా చెప్పుకోవటాన్ని వెల్లడి చేశారు. పెరుగుతున్న వ్యవసాయ కార్మికుల, పేద రైతుల వలసలు, రుణభారం, నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందుల మూలంగా పెరుగుతున్న ఆత్మహత్యల విషాదాన్ని నమోదు చేశారు. నీటికి కూడా మీటర్లు పెట్టి అమ్మబూనుకోవడాన్ని నిరసించారు.

ఈ సంచికలో...'గ్రామీణ రుణ భారం-నీటి ప్రైవేటీకరణ-విత్తనాల సమస్య' ప్రధాన అంశాలుగా హైదరాబాదులో నిర్వహించిన రాష్ట్ర సదస్సు ప్రసంగ పాఠాలు అందించారు. విత్తన హక్కు రైతుదేనని, డబ్ల్యూటీవో నుండి భారత్ బయటకు రావాలని డిమాండ్ చేస్తూ ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి, సామ్రాజ్యవాదానికి-రుణభారానికి వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చిన డాక్టర్ బి.డి.శర్మల ప్రసంగాల పూర్తి పాఠాలను అందించారు. డాక్టర్ జస్వంతరావుతో పాటు డాక్టర్ పివిఆర్ భాస్కరరావు, ప్రొఫెసర్ సి. రామచంద్రయ్య తదితరులు వివిధ అంశాలపై చేసిన ప్రసంగాల పాఠాలను అందించారు. అలాగే వ్యవసాయ రంగ సంక్షోభంపై విశాఖలో జరిగిన ఉత్తరాంధ్ర జిల్లాల సదస్సులో ప్రొఫెసర్ నాగేశ్వర్ పూర్తి ప్రసంగ పాఠం అందించారు.

ఈ సంచిక అనుబంధంలో... మార్క్స్ వివరించిన 'స్వయం సంపూర్ణ గ్రామీణ వ్యవస్థ'ను వివరిస్తూ కామ్రేడ్ సి వి రాసిన వ్యాసాన్ని ప్రచురించారు. భారతదేశ పరిణామ క్రమంలో ఉత్పత్తి సంబంధాలు, సాంఘిక సంబంధాలలో జరుగుతూ వచ్చిన మార్పులు... కులాలు, మతాలు, ఆవిర్భవించిన పరిస్థితుల్ని ఈ వ్యాసం వివరించింది.

అలాగే, స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో జత కలిసి రైతాంగాన్ని సంఘటితపరచడం గూర్చి, రెండవ ప్రపంచ యుద్ధానంతరం రైతు పోరాటాల విజృంభణ గూర్చి కామ్రేడ్ వై.వి. కృష్ణారావు వ్రాసిన వ్యాసాన్ని ప్రచురించారు. ఆనాడు బ్రిటిష్ సామ్రాజ్యవాదం, ఫ్యూడల్ జమీందారీ వర్గం... రైతాంగాన్ని పీల్చిపిప్పిచేయడాన్ని వ్యతిరేకిస్తూ, కష్టజీవుల రాజ్యం లక్ష్యంగా సాగించిన కృషిని ఈ వ్యాసాలు వివరించాయి. చల్లపల్లి,ముక్త్యాల, మీర్జాపురం, కోలంక, పోతునూరు, కానూరు, పెంద్యాల, జిల్లెళ్లగూడెం, కుంకాల, పెంద్రాల, మందస, వెంకటగిరి...మొదలగు ప్రాంతాలలో సాగిన జమీందారీ వ్యతిరేక రైతు పోరాటాలతో పాటుగా 'రైతు దండు' ఏర్పాటును గూర్చి వివరించారు.

1971-72 సంవత్సరాలలో టీఎన్ 'తాకట్టులో భారతదేశం'లో... ఈనాడు దళితులుగా పిలవబడుతున్న ఎస్సి, బిసి విభాగాల వ్యవసాయ కార్మికుల జీవనస్థితిగతులను గణాంక సహితంగా వివరించి, 'తెగించిన ఆగ్రహం అనివార్యం' అని పేర్కొన్న అధ్యాయాన్ని ఈ సంచికలో అనుబంధంగా అందించారు. భీమిరెడ్డి నరసింహారెడ్డి...'భూ కేంద్రీకృతం' వ్యాసాన్ని, కష్టజీవి మహిళా ఉద్యమంలో, ప్రత్యేకంగా, తూర్పుగోదావరి జిల్లాలో కామ్రేడ్ భూపతి కమలమ్మ పాత్ర గురించి వివరిస్తూ జి.నరసింహమూర్తి వ్రాసిన వ్యాసాన్ని ప్రచురించారు. కష్టజీవులైన మహిళలు,యువత దోపిడీ శక్తులను ఎదుర్కొని వర్గ పోరాటాలలో రాటుదేలి విజ్ఞానమూర్తులైన కార్యకర్తలుగా ఎదిగిన అనుభవాలను ఈ వ్యాసంలో అందజేశారు.

'ఆసియా సోషల్ ఫోరం' సమావేశాల సందర్భంగా... 'భూమి, ప్రజల జీవనాధారాలపై ప్రపంచీకరణ ప్రభావం' అనే శీర్షికతో, ప్రపంచీకరణ నేపథ్యంలో... 'ఆదివాసులు-భూమి సమస్య' అనే అంశంపై, 'భారత వ్యవసాయ రంగం-ప్రభుత్వ విధానాలలో వస్తున్న మార్పుల'పై రూపొందించిన పత్రాలను ఈ సంచికలో అందించారు.

❖❖❖

**2005** జూన్‌లో అనకాపల్లిలో జరిగిన **రాష్ట్ర మహాసభల విశేషాలతో సావనీర్** దాదాపు



100 పేజీలతో వెలువడింది. రైతు కూలీ సంఘంగా గ్రామీణ ప్రాంత వర్గ సమస్యలు, వైరుధ్యాలు, గ్రామీణ పేదల ఐక్యత,ఐక్య సంఘటన నిర్మాణం లోని జటిలత్వం, వివిధ రైతు-కూలీ సంఘాల నిర్మాణాల మధ్య ఐక్య కార్యాచరణ, ఐక్యతా క్రమం... మొదలైన అంశాలలో సంఘర్షణ పడుతూ 2001 మహాసభల నుండి ఈ మహాసభల మధ్యకాలంలో సాగించిన కీలక కార్యక్రమాల వివరాలను ఈ సావనీర్లో అందించారు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు వ్యతిరేకంగా,దేశభక్తియుత రైతాంగ ప్రచార వాలంటీర్ల ప్రదర్శన,ఆందోళనా కార్యక్రమాలను వివరించారు. వివిధ జిల్లాలలో జరిపిన జిల్లాస్థాయి మహాసభల విశేషాలను అందించారు. ఈ మహాసభలో 'ప్రపంచీకరణ-వ్యవసాయ రంగం', 'రైతాంగ రుణభారం-ఆత్మహత్యలు-పరిష్కారాలు', 'ఆహార భద్రత-ప్రజా పంపిణీ వ్యవస్థ', 'గిరిజనులు-భూపరాయీకరణ, ప్రాజెక్టులు-పునరావాసం' మొదలైన అంశాలపై అనేకమంది మేధావుల ప్రసంగపాఠాలు ఈ సావనీర్‌లో ఉన్నాయి.

ఈ సావనీర్‌లో అనుబంధంగా... కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు రాసిన 'నల్గొండ ప్రజల వీరోచిత పోరాటం' అనే వ్యాసంలో వర్గ దృక్పథం, ఐక్య సంఘటన దృక్పథం, సంఘటిత నిర్మాణ దృక్పథం, ప్రజా ప్రతిఘటన దృక్పథాలను అన్వయించి, ప్రజా పోరాటాలను అభివృద్ధిచేసిన అనుభవాలను వివరించారు.

ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న రైతాంగ సంక్షోభ నేపథ్యంలో నాటి ప్రభుత్వం జయతి ఘోష్ అధ్యక్షతన నియమించిన వ్యవసాయ కమిషన్‌కు, రైతాంగ సమస్యలతో పాటుగా నిర్దిష్ట డిమాండ్లతో అందజేసిన పత్రాన్ని ప్రచురించారు.

❖❖❖

**2007 వార్షిక సంచిక** దాదాపు 110 పేజీలతో వెలువడింది. ఇందులో... 2007లో ఏలూరులో జరిగిన జనరల్ కౌన్సిల్లో ఆమోదించిన, 2005-07 కాలంలో సంఘం ఆధ్వర్యంలో జరిగిన ముఖ్య కార్యకలాపాల నివేదిక, తీర్మానాలను ప్రచురించారు.




ప్రత్యేక ఆర్థిక మండళ్లు (సెజ్)– 2005 చట్టంతో పాటు, సెజ్‌ల పేరుతో, కోస్తా కారిడార్ పేరుతో ప్రజల భూములను గుంజుకోవటాన్ని నిరసిస్తూ, ఆహార పంటలను జీవ ఇంధనంగా మలచటాన్ని, దేశ సంపద అయిన గోదావరి బేసిన్ చమురు సహజవాయు నిక్షేపాలను రిలయన్స్ వంటి కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని, రణస్థలంలో అణువిద్యుత్ కేంద్ర ప్రయత్నాలను నిరసిస్తూ, సద్దాం హుస్సేన్ ఉరిశిక్షను ఖండిస్తూ, ముదిగొండ కాల్పులను ఖండిస్తూ, 40 సంవత్సరాల కోరన్న మంగన్నల అమరత్వాన్ని స్మరించుకుంటూ చేపట్టిన కార్యక్రమాలను పేర్కొన్నారు.

ప్రత్యేకించి...1857 నాటి ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామ 150 సంవత్సరాల సందర్భాన్ని స్ఫూర్తిగా తీసుకుంటూ,బ్రిటిష్ వలసవాద వ్యతిరేక పోరాటాలపై మేఘనాథ్ రాసిన వ్యాసాన్ని, అలాగే కోరన్న మంగన్నల 40 సంవత్సరాల అమరత్వం సందర్భంగా మేఘనాథ్ రాసిన వ్యాసాన్ని ప్రచురించారు.

'వలస పాలనకు వ్యతిరేకంగా, రైతాంగ–కార్మిక పోరాటాలు– నేటికీ ప్రాధాన్యత కోల్పోని భూమి సమస్య' అంశాలపై 2007 సెప్టెంబర్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల సదస్సులో డాక్టర్ బి.డి.శర్మ ప్రసంగ పాఠాన్ని అందించారు.

'చారిత్రక ప్రాధాన్యత గల తెలంగాణ పోరాటం–భూమి సమస్య' గురించి కామ్రేడ్ ఎస్.ఝాన్సీ రాసిన వ్యాసం, 'ఆహార సంక్షోభం వెనుకనున్న సామ్రాజ్యవాదుల కుతంత్రాన్ని' గురించి ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి రాసిన వ్యాసం, ఝార్ఖండ్‌లో సామ్రాజ్యవాదులు సాగిస్తున్న సహజ సంపదల దోపిడీపై కామ్రేడ్ శంభు మహతో వ్యాసం, 'అమెరికా–భారత వ్యవసాయ విజ్ఞాన చౌరవ ఒప్పందం'పై డాక్టర్ పి.జస్వంత్‌రావు వ్యాసం, అలాగే, ప్రత్యేక ఆర్థిక మండళ్లు, దేశవ్యాప్తంగా దళితులపై పెచ్చుమీరుతున్న దాడులు, కోస్తా కారిడార్ పేరున రైతుల భూముల కబళింపు, రిటైల్ రంగంలో బడా, బహుళ జాతి పరిశ్రమల ప్రవేశంతో పెరుగుతున్న రైతాంగ సంక్షోభం, స్థానిక జల వనరులపై ప్రపంచ బ్యాంకు పెత్తనం... తదితర అంశాలపై వ్యాసాలను ఈ సంచికలో ప్రచురించారు. విశాఖ ఏజెన్సీలో బాక్సైట్ తవ్వకాలను ఖండిస్తూ, గంగవరం మత్స్యకారులపై పోలీసు కాల్పులను ఖండిస్తూ... సంఘం చేపట్టిన ప్రచార, ఆందోళన కార్యక్రమాలను వివరించారు.

❖❖❖

**2010** మార్చి 23న మరణించిన నక్సల్బరి ఉద్యమ నిర్మాత కామ్రేడ్ కాను సన్యాల్ ప్రాంగణంలో ఏప్రిల్ 12, 13, 14 తేదీలలో ఒంగోలులో జరిగిన సంఘ రాష్ట్ర మహాసభల అనంతరం దాదాపు 130 పేజీలతో **రాష్ట్ర మహాసభల సావనీర్** వెలువడింది.




శ్రీకాకుళం జిల్లా సోంపేటలో భూముల స్వాధీనాన్ని నిరసిస్తూ రైతాంగం సాగించిన ఆందోళనపై పోలీసులు కాల్పులు జరిపి ఇరువురు రైతులను బలిగొనడాన్ని ఖండిస్తూ, కనపర్తి, కోటిపాం సంతబొమ్మాళి, థర్మల్ విద్యుత్ కేంద్రాలకు, రణస్థలంలో అణు విద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమాల విశేషాలను ఈ నివేదికలో అందించారు. ప్రభుత్వ నిర్బంధాలను, దాడులను ఎదుర్కొంటూ చాషీమూలియ ఆదివాసి సంఘం (ఒడిశా) ఆధ్వర్యంలో కోరాపుట్ ఆదివాసి ప్రాంతం నుండి 400 మంది గిరిజన ప్రజానీకం, కామ్రేడ్స్ అర్జున్, పైడమ్మల నాయకత్వంలో ఈ మహాసభలకు హాజరయ్యారు. కాగా, మహాసభల నుండి తిరిగి వెళ్ళిన తర్వాత ఆగస్టు 9న, కామ్రేడ్ అర్జున్‌ను మావోయిస్టులు హత్య గావించారు. దీనిని ఖండిస్తూ ఈ సావనీరులో ప్రముఖంగా ప్రస్తావించారు.

రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ అధ్యక్షులు చెరుకూరి వెంకటేశ్వర్లు గారి స్వాగతోపన్యాసంతో పాటు ప్రముఖ కథా రచయిత సింగమనేని నారాయణగారి 'మానవ వికాసానికి మూడు గొప్ప అవసరాలైన వ్యవసాయం, విద్య,వైద్యాలను ధ్వంసం చేస్తున్న ప్రభుత్వ విధానాల'పై చేసిన ప్రసంగపాఠాలను ఈ సంచికలో అందించారు.

2005 నుండి సంఘం నిర్వహించిన కార్యక్రమాలను క్లుప్తంగా వివరించారు. డాక్టర్ జస్వంతరావు, డాక్టర్ బి.సూర్యసాగర్ మొదలైన మేధావులు,ప్రజాతంత్ర వాదుల బరువైన ప్రసంగ వ్యాసాలను ఈ సావనీర్‌లో అందించారు.

చిత్తూరు జిల్లాలోని ప్రత్యేక ఆర్థిక మండళ్ల పరిస్థితిని, ఆ పేరిట సేకరించిన భూముల వివరాలను 'కోస్తా కారిడార్ వ్యతిరేక కమిటీ' ఆధ్వర్యంలో ఓ బృందం పరిశీలన జరిపి అందించిన నివేదికను, పోలవరం ప్రాజెక్టు మునక ప్రాంత ప్రజల పునరావాసం గురించి కె.ఆర్.చౌదరి, అమిత్ ఉపాధ్యాయ తదితరులతో కూడిన వాస్తవ సేకరణ బృందం 2008, 2009 ప్రాంతాలలో ముంపు గ్రామాలలో పర్యటించి రూపొందించిన నివేదికలను ఈ సావనీరులో ప్రచురించారు. అలాగే, రైతు–కూలీ–కార్మిక –యువజన సంఘాల ఆధ్వర్యంలో 2009లో తెలంగాణ జిల్లాలలో 'రైతాంగ ఆత్మహత్యల'పై పరిశీలన జరిపిన బృందం, 'తెలంగాణ రైతాంగ జీవనాధారాలను తోడేస్తున్న పాలకులు' పేరున రూపొందించిన నివేదికను ప్రచురించారు. అలాగే, విశాఖ ఏజెన్సీలో బాక్సైట్ తవ్వకాలు, ప్రజా ఆందోళనల నేపథ్యంలో ఆర్పిఐ రాష్ట్ర అధ్యక్షులు బొజ్జా తారకం మరియు వివిధ ప్రజా సంఘాల నాయకులతో కూడిన బృందం 2009 జూన్‌లో అనంతగిరి గిరిజన గ్రామాలలో పర్యటించి రూపొందించిన నివేదికను ఈ సావనీర్‌లో అందించారు. కర్ణాటక రాష్ట్రం బళ్ళారి వద్ద నిర్మించ తలపెట్టిన విమానాశ్రయం కోసం చేపట్టిన భూ సేకరణలను నిరసిస్తూ ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి, సంఘం నాయకులు కామ్రేడ్ కే.కోటయ్య, కార్మిక నాయకులు కామ్రేడ్ పెద్దన్న తదితరుల ఆధ్వర్యంలో సమస్యను అధ్యయనం చేసి అందించిన వివరమైన నివేదికను ఈ సావనీరులో ప్రచురించారు.

ఆదిలాబాద్ జిల్లా–భైంసా,వటోలి ప్రాంతాలలో మత ఘర్షణలు– పోలీసు కాల్పులు–సజీవ దహనాలపై, సంఘం కార్యదర్శి కామ్రేడ్ కే.కోటయ్య నేతృత్వంలో పరిశీలనా బృందం వెళ్లి మొత్తం పరిస్థితిని పరిశీలించి 'భైంసా, వటోలి ఘటనలు–మతతత్వ శక్తులు విసురుతున్న సవాలు' పేరిట రూపొందించిన వివరణాత్మక నివేదికను ఈ సావనీర్‌లో అందించారు. అలాగే,2009 జూన్ 17న పసనభద్రపై దాడి గురించి విశ్రాంత న్యాయమూర్తి డి.సత్యనారాయణ రెడ్డి, ప్రొఫెసర్ కే.ఆర్.చౌదరి తదితరుల ఆధ్వర్యంలో నిజనిర్ధారణ బృందం ఆ ప్రాంతంలో పర్యటించి వివరాలు సేకరించి రూపొందించిన నివేదికను ఈ సావనీర్‌లో ప్రచురించారు.

సావనీర్‌లో అనుబంధంగా... వీరోచిత మునగాల రైతాంగ ప్రజా ఉద్యమం గురించి టి వెంకట్రావు రాసిన వ్యాసం ప్రచురించారు.

❖❖❖

**వార్షిక సంచిక-2012** దాదాపు 130 పేజీలతో వెలువడింది. ఇందులో ప్రధానంగా విశాఖపట్నంలో 2011 డిసెంబర్‌లో జరిగిన అఖిల భారత కార్మిక-రైతు కూలీ సమ్మేళనం, ఏఐకేఎంకేఎస్ అఖిల భారత సదస్సు రిపోర్టులతోపాటు, ఏ ఐ కే ఎం కే ఎస్ లక్ష్య ప్రకటన కూడా ముద్రించారు.



అలాగే, 2011 అక్టోబర్‌లో కాకినాడలో జరిగిన సంఘం జనరల్ కౌన్సిల్ రిపోర్టుతో పాటు తీర్మానాలను ప్రచురించారు. ఈ సందర్భంగా కాకినాడ సెజ్ బాధిత గ్రామాలలో రైతు కూలీ సంఘం (ఆం.ప్ర)రాష్ట్ర బృందం...డాక్టర్ బి.డి శర్మ, ప్రొఫెసర్ కేఆర్ చౌదరి తదితరులతో కలిసి పర్యటించిన నివేదికను వెలువరించారు. కౌలు రైతుల గుర్తింపు, వారికి రుణాల సమస్యపైన 'పంట విరామం కాదు.. పోరు మార్గాన సాగాల'నే పిలుపుతో, నిరుపేదలను ప్రయోగశాల పశువులుగా (గిని పిగ్స్)గా మారుస్తున్న ఔషధ ప్రయోగాలకు వ్యతిరేకంగా, గ్రామీణ పేదలను, కౌలు రైతులను ఆందోళనలోకి సమీకరించిన కార్యక్రమాలు ఈ వార్షిక సంచికలో ఉన్నాయి.

'పెరుగుతున్న సామ్రాజ్యవాద చొరబాటుతో తీవ్రమవుతున్న వ్యవసాయ రంగ సంక్షోభం-రైతు, కూలీ, దళిత, ఆదివాసీ ప్రజల ముందున్న కర్తవ్యాలు' కేంద్ర అంశంగా 2012 డిసెంబర్‌లో విజయవాడలో జరిగిన రాష్ట్ర సదస్సులో...దళితులపై, ఆదివాసులపై అణిచివేత-కోస్టల్, పెట్రో కారిడార్లు, సెజ్‌లు-థర్మల్, అణు విద్యుత్ కేంద్రాలు- ప్రజల కర్తవ్యాలపై వక్తల ప్రసంగ పాఠాలను అందించారు.

శ్రీకాకుళం జిల్లా లక్ష్మింపేటలో, 2012 జూన్‌లో, దళితులపై కుల దురహంకార పెత్తందారులు సాగించిన దాడిపై, రైతు కూలీ సంఘం రాష్ట్ర పరిశీలన బృంద నివేదిక, బాధితుల పరామర్శతో పాటుగా లక్ష్మింపేట దాడులను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సంఘం ఆధ్వర్యంలోనూ, సంయుక్తంగాను జరిగిన కార్యక్రమాల రిపోర్టులు అందించారు.

ముఖ్యంగా... బొజ్జా తారకం కన్వీనర్‌గా, కామ్రేడ్ ఎస్.ఝాన్సీ ఒక కన్వీనర్‌గా... అనేక దళిత, ప్రజా, రైతు కూలీ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పడిన 'లక్ష్మింపేట దళిత పోరాట సంఘీభావ కమిటీ' ఢిల్లీ, హైదరాబాదులతో సహా అనేక ప్రాంతాల్లో జరిపిన, పలు కార్యక్రమాలతో పాటు, ముఖ్యంగా లక్ష్మింపేట నుండి శ్రీకాకుళం వరకు సాగించిన 'దళిత ప్రజా నిరసన యాత్ర' తదనంతరం సభా కార్యక్రమాలలో సంఘ శ్రేణులు చురుకుగా పాల్గొన్న విశేషాలను ఈ సంచికలో అందించారు.

పేదల నివాస స్థలాల కోసం... దొండపూడి, పల్నాడు ప్రాంతాల్లో దళిత, ఆదివాసుల ఆందోళనలు, ఆదివాసి గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతంగా ప్రకటించాలనే ఆందోళనల రిపోర్టులు ఈ వార్షిక సంచికలో ఉన్నాయి.

ప్రత్యేకించి... ఉత్తరాంధ్రలో థర్మల్, అణువిద్యుత్ కేంద్రాల స్థాపన ప్రయత్నాలు,దానికోసం బలవంతపు భూసేకరణ, ప్రజల-రైతుల వ్యతిరేక ఆందోళన, పోలీసుల కాల్పుల నేపథ్యంలో రైతు కూలీ సంఘం(ఆం.ప్ర), స్త్రీ విముక్తి సంఘటనల రాష్ట్ర బృందం 2010 జూలైలో ఆ ప్రాంతాల్లో పర్యటించి నివేదిక వెలువరించింది. సోంపేట, కాకరపల్లిలలో ఆందోళనకారులపై పోలీసు కాల్పులు, నలుగురు రైతుల మృతికి నిరసనగా చేపట్టిన కార్యక్రమాల రిపోర్టులు అందించారు. 2010 సెప్టెంబర్‌లో రైతు కూలీ సంఘం(ఆం.ప్ర), ఏఐఎఫ్‌టియు(న్యూ)ల ఆధ్వర్యంలో శ్రీకాకుళం, విశాఖపట్నంలలో సదస్సులు, కోటిపాం థర్మల్ విద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా...నిర్బంధాలను అధిగమిస్తూ కొనసాగుతున్న ప్రజా ఆందోళనల సంక్షిప్త రిపోర్టు అందించారు.

ఇంకా ఈ సంచికలో వరంగల్ జిల్లా ప్రజా ఆందోళనలు, అనంతపురం జిల్లా తాడిపత్రి స్టీల్ ప్లాంట్ యాజమాన్య దురాగతాలను నిరసిస్తూ సాగించిన కార్యక్రమాల రిపోర్టులు ఉన్నాయి.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర)రాష్ట్ర మహాసభల సావనీర్-2001 సంచికను తొలితరం కమ్యూనిస్టు నాయకులు కామ్రేడ్ పరకాల 2001 డిసెంబర్లో 'కమ్యూనిజం'పత్రికలో చేసిన సమీక్షను యథాతథంగా ఈ వార్షిక సంచికలో అందించారు.

ఈ సంచిక అనుబంధంలో... కామ్రేడ్ లెనిన్ రచించిన 'కార్మిక వర్గం-రైతాంగం' అనే వ్యాసాన్ని, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ రెండవ సమావేశంలో వ్యవసాయక సమస్యపై కామ్రేడ్ లెనిన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని... రైతాంగ ఉద్యమ కార్యకర్తలు తమ అవగాహన పెంపొందించుకోవడం కోసం అందించారు.

❖❖❖

**2016 జూన్**లో గుంటూరులో జరిగిన రైతు కూలీ సంఘం (ఆంప్ర) రాష్ట్ర మహాసభల విశేషాలతో దాదాపు 100 పేజీలతో **సావనీర్** ప్రచురించారు.



'వ్యవసాయరంగ సంక్షోభం-భూమి సమస్య-పాలకుల విధానాలు' అనే అంశంపై రైతుకూలీసంఘం(ఆం.ప్ర), ఆంధ్రప్రదేశ్ రైతుకూలీసంఘాల సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో 2013 జూన్ 4న రాష్ట్రస్థాయి సదస్సు రిపోర్టును ఈ సావనీర్‌లో అందించారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) మరియు ఆంధ్రప్రదేశ్ రైతుకూలీసంఘం-రెండూ ప్రణాళికల ప్రాతిపదికపై చర్చించుకొని, ఒకే సంఘంగా ఐక్యమవ్వాలని నిర్ణయం జరగటం, రాష్ట్రంలో రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2014 జూన్ నాటికి రెండు రాష్ట్రాలుగా విడివడటంతో రెండు రాష్ట్రాలలో విడివిడిగా ఐక్యతా క్రమాన్ని పూర్తిచేసి ఏఐకెఎంకెఎస్ అనుబంధంగా కొనసాగుతున్న విషయాన్ని ఇందులో వివరించారు.

వ్యవసాయ సంక్షోభం-రుణమాఫీ ఎడల పాలకుల విధానాల గురించి సరైన అవగాహన కల్పించేందుకు 2014 జులై 27,28 తేదీలలో గుంటూరులో నిర్వహించిన రాష్ట్రసదస్సు విశేషాలను ఈ సావనీర్‌లో వివరించారు.

2014లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ-రెండు రాష్ట్రాలుగా విడివడటం, కేంద్రంలో బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం, వీరి పాలనలో సాగిన రైతాంగ, ప్రజా వ్యతిరేక సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను 2016లో రాష్ట్ర మహాసభల సందర్భంగా విస్తృత ప్రచారం చేశారు. రాష్ట్ర రాజధాని

నిర్మాణం పేరిట భూ సమీకరణ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం 33 వేల ఎకరాల భూములను సేకరించటమేగాక భూ బ్యాంకులను ఏర్పాటు చేసి, రైతాంగ భూములను కబళించే ప్రయత్నాలను ఈ సావనీర్‌లో ఎండగట్టారు. భూ సమీకరణ-సేకరణ-రాజధాని ఏర్పాటుపై స్పష్టమైన వైఖరి ప్రకటిస్తూ...2015 ఏప్రిల్‌లో మంగళగిరిలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సు రిపోర్టును ఈ సావనీర్‌లో అందించారు.

మహాసభలలో భాగంగా 'వ్యవసాయ రంగంపై బిగుస్తున్న సామ్రాజ్యవాదుల పట్టు-రైతు, కూలీల కర్తవ్యాల' పై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. 'అభివృద్ధి పేరుతో భూమి నుండి, అడవి నుండి గెంటి వేయబడుతున్న రైతు, కూలీలు, ఆదివాసులు-పెరిగిపోతున్న వలసలు' 'కునారిల్లిపోతున్న వ్యవసాయధారిత పరిశ్రమలు-ఉపాధి కోల్పోతున్న రైతులు, రైతు కూలీలు,కార్మికులు', 'విప్లవ భూ సంస్కరణలే పరిష్కారమని చాటి చెప్తున్న వ్యవసాయరంగ సంక్షోభం' అనే అంశాలపై వక్తల ప్రసంగాలను, తీర్మానాలను సావనీర్‌లో ప్రచురించారు.

మహాసభల ఆహ్వానసంఘ గౌరవాధ్యక్షులు మాజీ వైస్ ఛాన్సలర్ దావులూరి రామకోటయ్య గారు మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సందేశమిచ్చారు. ఆహ్వానసంఘ అధ్యక్షులు, నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్ స్వాగతోపన్యాసం చేశారు. 2010 రాష్ట్ర మహాసభల నుండి 2016 వరకు సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యకలాపాల క్లుప్తమైన నివేదికను ఈ సావనీర్‌లో అందించారు. పోలవరం నిర్వాసిత గ్రామాల సమస్యపై సంఘం ఆధ్వర్యంలో జరిగిన విస్తారమైన కృషిని పేర్కొన్నారు. 2015 జూలైలో రాజమండ్రిలో పోలవరం నిర్వాసితుల సమస్యలపై రాష్ట్ర సదస్సు నిర్వహించి ప్రభుత్వ పునరావాస విధానాల డొల్లతనాన్ని ఎండగట్టారు.

ప్రజాతంత్ర మేధావి, ఆదివాసుల ఆత్మబంధువు,రైతాంగ ఉద్యమ మిత్రులు డాక్టర్ బి.డి శర్మ... 2017 డిసెంబర్ 6న మరణించారు. ఆయనకు ఘన నివాళి అర్పిస్తూ విజయవాడ,విశాఖ, హైదరాబాద్‌లలో సంస్మరణ సభలు నిర్వహించి 'ఆదివాసుల ఆత్మబంధువు, రైతాంగ ఉద్యమ మిత్రులు-డాక్టర్ బి.డి శర్మ' అనే 100 పేజీల పుస్తకాన్ని ప్రచురించారు.

అలాగే, భూమి సమస్యతో ముడిపడిన దళితుల ఆత్మగౌరవ అంశాన్ని, దేశంలో నానాటికి దళితులపై పెరుగుతున్న దాడులకు,దౌర్జన్యాలకు మూలమైన వ్యవస్థ స్వభావాన్ని విశ్లేషిస్తూ 'అణచబడ్డ దళితులంతా తిరగబడండి' అనే 144 పేజీల పుస్తకాన్ని తెలుగు,హిందీ,ఇంగ్లీష్ భాషల్లో వెలువరించిన విశేషాలను ఈ సావనీర్‌లో తెలిపారు.

❖❖❖

**రైతు కూలీ సంఘం (ఆంధ్ర) వార్షిక సంచిక- 2018**...120 పేజీలతో వెలువరించారు. 2018 ఆగస్టులో విజయనగరంలో జరిగిన సంఘం




జనరల్ కౌన్సిల్ సమావేశాల విశేషాలు, డాక్టర్ పి.జస్వంత్‌రావు, సుభోద్ మిత్ర, డాక్టర్ మర్ల సోమ సుందర్‌ల ప్రసంగ వ్యాసాలు ఈ సంచికలో ఉన్నాయి. 2016 నుండి 2018 మధ్యకాలంలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్యమైన కార్యకలాపాల నివేదికను కామ్రేడ్ ఝాన్సీ ఈ జనరల్ కౌన్సిల్లో ప్రవేశపెట్టారు. 'ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం' (ఆర్సిఇపి) పేరిట వ్యవసాయం, రైతాంగంపై సామ్రాజ్యవాదుల పట్టు బిగించే ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ రైతు-కూలీ-కార్మిక-యువజన సంఘాల ఆధ్వర్యంలో 2017 సెప్టెంబర్ విజయవాడలో జరిపిన రాష్ట్ర సదస్సు రిపోర్ట్‌తోపాటు ఈ సదస్సు ఆమోదించిన వివరణాత్మకమైన, ప్రాధాన్యత గల తీర్మానం ఈ సంచికలో ఉన్నాయి. అలాగే 'ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చరల్ మార్కెటింగ్' (ఈ-నామ్) పేరిట రైతులను, కార్మికులను, మార్కెట్ యార్డ్ హమాలీలను, చిన్న వ్యాపారులను దెబ్బతీసే,భారత వ్యవసాయ మార్కెట్‌ను కార్పొరేటీకరించే ప్రభుత్వ విధానాల్ని వ్యతిరేకిస్తూ కార్మిక-రైతాంగం నడుమ జరిపిన ప్రచార కార్యక్రమాలు ఈ సంచికలో ప్రచురించారు.

కేంద్రంలో బిజెపి పాలకులు హిందూ మతతత్వాన్ని రెచ్చగొడుతూ, కష్టజీవుల సహజీవన సంస్కృతిని విచ్చిన్నం చేయడాన్ని, గో పరిరక్షణ, లవ్ జిహాద్ వంటి పేర్లతో ముస్లింలపై, దళితులపై సాగిస్తున్న హంతక దాడులను నిరసిస్తూ సాగించిన కార్యక్రమాల వివరాలను అందించారు.

రాయలసీమ దుర్భర కరువు పరిస్థితులను వెల్లడి చేసేందుకు... సంఘం ఆధ్వర్యంలో కామ్రేడ్ ఝాన్సీ కన్వీనర్‌గా, సూర్యసాగర్, ప్రముఖ రచయిత సింగంనేని నారాయణ, అమరులు కామ్రేడ్స్ పెద్దన్న, తిమ్మారెడ్డి, మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం బాషా తదితరులు సభ్యులుగా ఒక వాస్తవ సేకరణ కమిటీ 2017 మార్చ్‌లో కదిరి, రాయదుర్గం ప్రాంతాలలో పర్యటించి, పాలకుల దుర్మార్గ నిర్లక్ష్య విధానాలను వెల్లడి చేసింది. ఈ వివరాలతో 'అనంత కరువు' పేరిట సంఘం ఒక బుక్‌లెట్‌ను ప్రచురించిన వివరాలను అందించారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలు, దీనిని ఎదుర్కోవటంలో సమైక్య ఉద్యమానికి ఆటంకంగా ఉన్న వివిధ సంఘాల వైఖరులను గురించి వివరించే వ్యాసం, గోదావరి డెల్టా గ్రోయన్ల నిర్మాణంలో అవకతవకలపై... సంఘం ఆధ్వర్యంలో పరిశీలన జరిపిన అనంతరం వెలువరించిన ప్రాథమిక నివేదిక, ఇసుక మాఫియాల దోపిడీ దౌర్జన్యాలలో భాగంగా చిత్తూరు జిల్లా ఏర్పేడులో 16 మంది పైగా మృతి చెందిన ఘటనపై రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో పరిశీలన జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ వెలువరించిన రిపోర్టు, చుక్కల భూములనే సాకుతో తమ సొంత భూములపై రైతుల హక్కులను నిరాకరిస్తున్న ప్రభుత్వ విధానాలపై సంఘం చొరవతో నెల్లూరు జిల్లాలో 'చుక్కల భూముల రైతాంగ ఐక్యవేదిక' సాగించిన కార్యక్రమాల వివరాలు ఈ సంచికలో ఉన్నాయి.

వార్షిక సంచిక అనుబంధంలో... చైనాలో వ్యవసాయ సంస్కరణల సందర్భంగా క్షేత్రస్థాయిలో తలెత్తిన ప్రధాన పొరపాట్లను, తీసుకోవలసిన జాగ్రత్తలను, కార్యకర్తలు పెంపొందించుకోవలసిన అవగాహనను వివరిస్తూ... జెన్ లీ పెన్ రాసిన వ్యాసాన్ని, 1965 ప్రాంతంలో వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసులు, భూస్వాములు... ప్రజలపై సాగించిన దాడులు, హత్యాకాండ, బీభత్సాలని గురించి నాటి శాసనసభ పక్ష నాయకులు కామ్రేడ్స్ తరిమెల నాగిరెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య గార్ల ప్రసంగాలను; తమ భూముల, నీటి వనరుల ఆక్రమణకు వ్యతిరేకంగా ఆఫ్రికా, దక్షిణ అమెరికా దేశాలలో రైతాంగం - ప్రజలు సాగిస్తున్న ఉద్యమాలను, దేశీయంగా మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన పెద్ద నోట్ల రద్దు, జిఎస్టిల అమలుతో ప్రజలపై, చిన్న వ్యాపారులపై, చిన్న పరిశ్రమలపై చూపిన దుష్ప్రభావాలను... ఈ సంచికలో అందించారు. కర్ణాటక రాష్ట్రం- చాగనూరు, సిరివార రైతాంగ ప్రజానీకం, 2008 సంవత్సరం నుండి తమ భూములను కాపాడుకునేందుకు సాగిస్తున్న భూ రక్షణ పోరాటానికి సంఘీభావం తెలుపుతూ, ప్రస్తుత అర్థ ఫ్యూడల్ వ్యవస్థ స్వభావాన్ని చాటి

చెబుతూ దేశవ్యాప్తంగా దళితులపై సాగుతున్న హంతక దాడులు, దౌర్జన్యాలను ఖండిస్తూ వ్రాసిన వ్యాసాలను అందించారు.

2017లో అక్టోబర్ విప్లవ శతవార్షిక సందర్భంగా, 2017లో కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి శతజయంతి సందర్భంగా, 2018లో కార్ల్ మార్క్స్ ద్వి శత జయంతి సందర్భంగా ఆ మహనీయులకు నివాళులర్పిస్తూ జరిగిన పలు కార్యక్రమాలలో సంఘ శ్రేణులు భాగస్వాములయ్యారు. ఈ కాలంలోనే సంఘం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కోటయ్య, సహాయ కార్యదర్శి కా॥ వై.సోనీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్స్ ముత్తిరెడ్డి శ్రీరాములు, బి.తిమ్మారెడ్డి అమరులయ్యారు. ఆ కామ్రేడ్స్‌కు ఘన నివాళులర్పిస్తూ వివిధ ప్రాంతాలలో నిర్వహించిన సంస్మరణ సభల రిపోర్టులను ఈ వార్షిక సంచికలో పేర్కొన్నారు.

❖❖❖

**2022** సంవత్సరంలో వెలువడిన **వార్షిక సంచిక** కోవిడ్ మహమ్మారి ప్రపంచ ప్రజలను కుదుపుకు గురి చేసిన భయానక పరిస్థితుల నడుమ నుండే వెలుగు చూసింది. సామ్రాజ్యవాద దేశాలు ప్రకృతి వనరులతో, తమ లాభాపేక్ష కోసం చిత్తమొచ్చిన విధంగా వ్యవహరిస్తున్న దుష్ఫలితమే




కోవిడ్-19గా ఈ సంచికలో పేర్కొన్నారు. ఈ సంక్షోభ కాలంలో కోల్పోయిన, సంఘానికి ఆప్తులైన ఎందరో మేధావులు, నాయకులు, కార్యకర్తలను ఈ సంచికలో పేరుపేరునా స్మరించుకున్నారు.

సంఘ కార్యదర్శి కామ్రేడ్ కోటయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా 'తీవ్రమవుతున్న వ్యవసాయ రంగ సంక్షోభం-మన ముందున్న కర్తవ్యాలు' కేంద్ర అంశంగా 2019 డిసెంబరులో రాష్ట్ర సదస్సు రిపోర్టు, కామ్రేడ్ పి.జస్వంతరావు, ప్రొఫెసర్ గోలక్ బిహారినాథ్, విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ ఎన్. వేణుగోపాలరావు తదితరుల ప్రసంగ వ్యాసాలను ఈ సంచికలో అందించారు.

కోవిడ్ విపత్కర పరిస్థితి నేపథ్యంలోనే, మోడీ ప్రభుత్వం ముందుకు తెచ్చిన మూడు సాగు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా, 2020-21లలో దేశవ్యాప్తంగా, ప్రత్యేకించి, ఢిల్లీ సరిహద్దులలో సంవత్సర కాలం పైగా నిలచి రైతాంగం సాగించిన స్ఫూర్తిదాయకమైన ఆందోళన రిపోర్టులను, ఈ ఉద్యమ నిర్వహణ కమిటీకి నాయకత్వం వహిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చాలో ఏఐకేఎంకేఎస్ భాగస్వామ్య సంఘంగాను, స్వతంత్రంగాను నిర్వహించిన కార్యక్రమాల వివరాలను... ఈ వార్షిక సంచికలో ప్రధానంగా అందించారు. కర్ణాటక రైతాంగం ఏఐకేఎంకేఎస్ ఆధ్వర్యంలో 2021 మార్చి 5 నుండి 23 వరకు 442 కిలోమీటర్ల దూరం పాదయాత్ర చేసిన రిపోర్టును అందించారు. మూడు వ్యవసాయ నల్లచట్టాలకు వ్యతిరేకంగా సుదీర్ఘకాలం సాగిన ఆందోళన నేపథ్యంలో అనేక కరపత్రాలు, బులిటెన్లతో పాటు, బుక్‌లెట్ ప్రచురించి రైతాంగ ప్రజానీకం మధ్య సాగించిన విస్తృత ప్రచారం గురించి ఈ సావనీర్‌లో పేర్కొన్నారు.

బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం... ఆదివాసుల ఉనికినే ప్రశ్నార్థకం చేస్తూ ముందుకు తెచ్చిన అటవీ సంరక్షణ నియమాలు-2022ను, అటవీ సంరక్షణ చట్టానికి సవరణలను వ్యతిరేకిస్తూ సాగించిన ఆందోళన రిపోర్టులు ఈ సంచికలో ఉన్నాయి. దీనిలో భాగంగా 2019 జూన్‌లో విశాఖలో జరిపిన ఏఐకేఎంకేఎస్ సదస్సు రిపోర్టు, నల్సార్ యూనివర్శిటీ విశ్రాంత ఆచార్యులు, కేంద్ర సమాచారశాఖ మాజీ కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ స్ఫూర్తిదాయకంగా చేసిన ప్రసంగపాఠంతో పాటు, ఇతర ఉపన్యాసకుల ప్రసంగ పాఠాలు దీనిలో ఉన్నాయి.

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల వ్యధలు-ఆందోళనలను వివరిస్తూనే, వారు కోవిడ్ పరిస్థితుల నడుమ,2020 నవంబర్లో రంపచోడవరంలో సంఘం ఆధ్వర్యంలో సాగించిన రెండు రోజుల నిరవధిక ధర్నా రిపోర్టును, కొండమొదలు ప్రాంత నిర్వాసితులు సాధించుకున్న పునరావాస కాలనీ ఏర్పాటును ఈ సంచికలో అందించారు.

ప్రజల మధ్య చిచ్చు రేపుతూ తమ రాజకీయ ప్రయోజనాల కనుగుణంగా నదీ జలాల సమస్యను పాలకులు ఉపయోగిస్తున్న సమయంలో... 2021 డిసెంబర్‌లో, 'పాలకుల జల విధానాలు' అంశంపై బెంగళూరులో ఏఐకెఎంకెఎస్ ఆధ్వర్యంలో దక్షిణ భారత స్థాయి సెమినార్ జరిగింది. ఈ సెమినార్ కీ నోటును, తీర్మానాలను ఈ సంచికలో అందించారు.

2014 నుండి రాష్ట్రరాజధాని సమస్యను టిడిపి,వైసిపిల నేతృత్వంలోని ప్రభుత్వాలు వాస్తవిక సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకు వినియోగించుకుంటున్న అంశాన్ని విశదపరుస్తూ రాజధాని అంశంపై వ్యాసాన్ని, సాగు మోటార్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటుపై వ్యాసాన్ని, భూ పరాయికరణ లక్ష్యంతో సాగుతున్న రైతుబంధు-రైతు భరోసాల డొల్లతనాన్ని వెల్లడి చేసే వ్యాసాన్ని, ప్రస్తుత వ్యవసాయ కూలీల,గ్రామీణ పేదల జీవన స్థితిగతులను వివరించే వ్యాసాలను ఈ సంచికలో అందించారు.

అమూల్‌తో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం... రాష్ట్రంలో పాడి పరిశ్రమను ఏ విధంగా దెబ్బతీస్తుందో వివరించే వ్యాసం, ప్రజల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు కార్మిక, ప్రజా ఉద్యమ ఆవశ్యకతను నొక్కి చెప్పే వ్యాసం,పంజాబ్ రైతాంగంపై, వారి హక్కులపై బహుళజాతి పెప్సీ కంపెనీ సాగించిన దాడిని వివరించే వ్యాసం, జన్యుమార్పిడి ఆవాల సాగుకు పాలకులు అనుమతి తెలిపిన వ్యాసం, జన్యు మార్పిడి వరి దిశగా సాగుతున్న ప్రయోగాలను తెలిపే వ్యాసం, సేంద్రియ-జీరో బడ్జెట్ వ్యవసాయాలను పాలకులు పేర్కొనడం వెనుకనున్న మోసకారితనాన్ని వివరించే వ్యాసం, కరోనా కష్టకాలంలో పాలకుల విధానాల ఫలితంగా వలస కూలీలు ఎదుర్కొన్న దుర్భర పరిస్థితులను వివరించే వ్యాసం,దేశాన్ని మతతత్వ రొంపిలోకి లాగుతున్న సిఏఏ,ఎన్ఆర్‌సిల ప్రమాదకర అంశాలను విపులీకరించే వ్యాసం, మత మైనారిటీలపై, దళితులపై, మహిళలపై... హిందూ మతతత్వ శక్తుల ఫాసిస్టు తరహా దాడులను వివరించే వ్యాసం, నాలుగు లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికుల హక్కులపై ముప్పేట దాడి సాగిస్తున్న ప్రభుత్వ విధానాలను వివరించే వ్యాసం, 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' పేరిట 75 సంవత్సరాల 'స్వాహా' తంత్రంలో దోపిడీ పాలకుల విధానాలను, ఫలితంగా ప్రజల జీవన స్థితిగతులు ఎంతగా దిగజారి పోతున్నాయో వివరించే వ్యాసాలతో పాటుగా అప్పటికి ప్రారంభమై కొనసాగుతున్న ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో సామ్రాజ్యవాదులనే నేరస్తులుగా పేర్కొంటూ వివరించే విలువైన వ్యాసాలు ఈ సంచికలో చోటుచేసుకున్నాయి.

❖❖❖

2001 నుండి వరుసగా ప్రచురిస్తూ వస్తున్న మహాసభల సావనీర్లు లేదా వార్షిక సంచికలు... దాదాపు గత రెండున్నర దశాబ్దాల కాలపు ప్రధానమైన దేశ, రాష్ట్ర రాజకీయ పరిణామాలను, ప్రత్యేకించి వ్యవసాయ రంగంలో, గ్రామీణ ప్రాంతంలో పాలకులు తీసుకు వస్తున్న మార్పులు, అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నమోదు చేస్తూ వస్తున్నాయి.

**(తరువాయి 22వ పేజీలో)**

# భూమి సమస్య ప్రాధాన్యతను చాటి చెప్పిన మనుగోపాల (1997), బొమ్మన హాళ్ (1998), మక్కువ (1999), పల్నాడు (2000) భూ పోరాటాలు

**గ్రామాల** సమాహారమైన మన దేశంలో ఈనాటికీ,ఉత్పత్తి సాధనమైన సాగుభూమిలో అత్యధిక భాగం... భూస్వామ్య పెత్తందారుల, భూ యజమానుల, సంపన్న వర్గాల,సామ్రాజ్యవాద బహుళజాతి, కార్పొరేట్ కంపెనీల వద్ద పోగుపడి ఉంది. భూమిపై తమ రెక్కలు ముక్కలు చేసుకునే కష్టజీవులు, భూమి హీనులు, పేద రైతులు, రైతు కూలీలు, గిరిజనులు ఈనాటికీ చేరెడు నేలపై హక్కు కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వాల బూటకపు భూ సంస్కరణలు తమకేమీ మేలు చేయవని గ్రహించి, సంఘటితమైన గ్రామీణ పేదలు, అటవీహక్కుల కోసం ఆదివాసులు... విప్లవ కమ్యూనిస్టుల, రైతు కూలీ సంఘాల, ఏజెన్సీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు సాగించారు, సాగిస్తూ ఉన్నారు. ఆ విధంగా ఆంధ్రప్రదేశ్‌లో రెండున్నర దశాబ్దాల క్రితం సాగిన, విలువైన అనుభవాల నందిస్తున్న భూ పోరాటాలను ఒక్కసారి పరిశీలిద్దాం.

## 1997 నవంబర్ 4 - మనుగోపాల గిరిజన ఉద్యమంపై భూస్వామ్య వర్గాల దాడి - కామ్రేడ్ కారం పార్వతి అమరత్వం

కొండమొదలు ఉద్యమ ప్రేరణతో, 1987 ప్రాంతంనుండి పశ్చిమ గోదావరిజిల్లా జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం మండలాల్లో గిరిజనుల పోరాటాలు ప్రారంభమై నిలదొక్కుకున్నాయి. పోలవరం మండలం వెంకటరెడ్డిగూడెం, రామన్నపాలెం, గుంజవరం గ్రామ గిరిజనులు, గిరిజన సంఘం నాయకత్వాన సంఘటితమై భూ పోరాటం ప్రారంభించారు.

1993 నుండి ఏజెన్సీ గిరిజన సంఘం మనుగోపాల, పెండ్రాల, జిల్లెల్ల గూడెం, కొత్త కుంకాల, పాత కుంకాల ప్రాంతంలో ప్రచార కార్యకలాపాలు ప్రారంభించింది. పాత కుంకాల గ్రామానికి చెందిన కొక్కెర చంద్రయ్య భూమిని మాజీ జమీందారు ఏజెంటు సద్గురు మూర్తి ఆక్రమించుకోవటాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన ప్రారంభమైంది. జమీందారు తరపున నిలిచిన పోలీసులు, కొక్కెర చంద్రయ్యను ఆయన కుటుంబ సభ్యులను అరెస్టు చేశారు.

ఈ అరెస్టులను ఖండిస్తూ, చంద్రయ్య భూమి చంద్రయ్యకే దక్కాలనే డిమాండ్‌తో గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులంతా నిలిచారు. వారి మధ్యనున్న ఐక్యత నుండి గిరిజనులు బయటపడటం, భూమి సమస్యపై పిటిషన్లు పెట్టడమే మాజీ జమీందారు రాంపండుకు ఆగ్రహం కలిగించింది.

1996 మార్చిలో బాంబులతో, రౌడీ గుండాలను వెంటేసుకొని మనుగోపాల, కుంకాల గ్రామాలపై దాడి చేశాడు, వారు రైతుల పంటలు దొంగిలించారు, బంగారం దొంగిలించారు, మహిళలను అవమానపరిచారు. కారం వెంకటేశ్వరరావు అనే గిరిజన నాయకుడిని కిడ్నాప్ చేసి చిత్రహింసలు పెట్టారు.

రాంపండు సాగించిన ఈ దాడి, బీభత్సాన్ని నిరసిస్తూ ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో వెయ్యి మందికి పైగా గిరిజనులు, మండల కార్యాలయాన్ని ముట్టడించి, రాంపండుపై, రౌడీ గుండాలపై చర్య తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫలితంగా హోతా శ్రీరామ చంద్రమూర్తి(రాంపండు) అరెస్ట్ అయ్యాడు. 1996 శ్రీరామనవమి నాటికి జైల్లో వుండి తన అరెస్టుకు కారకులైన ఆదివాసీ ప్రజలపై కక్షపెంచుకొని వున్నాడు. నాటి నుండి అధికార యంత్రాంగం అతనికి అనుకూలంగా వ్యవహరించటానికి అన్ని మార్గాలూ వెదుకుతోంది.

1996 ఏప్రిల్‌లో గిరిజన సంఘం ఆధ్వర్యంలో మనుగోపాల, కుంకాల ప్రాంతాలలో సమీకృతమైన ఆ ప్రాంత గిరిజనులు... రాంపండు ఆధ్వర్యంలోని తమ భూములను తిరిగి స్వాధీనం చేసుకొని, 300 ఎకరాల మామిడి, జీడిమామిడి తోటలలో పండిన పంటను సమిష్టిగా పంచుకున్నారు. మరో 50 ఎకరాలలో జొన్న పంట పండించుకుని, అందరూ పంపిణీ చేసుకున్నారు.

1997 సెప్టెంబర్ నాటికి ప్రభుత్వం... గిరిజన పోరాటాలను అణచటానికి కృతనిశ్చయంతో ముందుకొచ్చింది. గిరిజన ప్రాంతాలలో నిర్బంధాన్ని తీవ్రం చేసింది. ప్రభుత్వ అండదండలతో తిరిగి రాంపండు కొత్త కుట్రలకు పూనుకున్నాడు. ఏవిధంగానైనా గిరిజనోద్యమాన్ని అణచాలన్న నిర్ణయంతో భూస్వామ్యశక్తులు, జమిందారు, జమిందారు ఏజెంట్లు... గిరిజనులతో ఎలాంటి సంబంధంలేని ఏలూరు వెకేషన్ కోర్టులో తెచ్చుకున్న ఒక ఇంజక్షన్ ఆర్డర్‌తో రాంపండు, అతని అనుచరులు, పోలీసుల బందోబస్తుతో గిరిజన గూడేలలోకి ప్రవేశించారు. తిరిగి వెళుతుండగా 1997 నవంబర్ 3న వీరందరినీ ప్రజలు నిలవేశారు. మనుగోపాల, కుంకాల గ్రామాలు షెడ్యూల్డు ప్రాంతాలన్నారు కదా, 1/70 చట్టం వర్తిస్తుందా, వర్తించదా తేల్చవలసిందిగా మహిళలు నిలవేశారు.

---

(21వ పేజీ తరువాయి)

సన్న చిన్న కారు రైతులు, మధ్యతరగతి రైతులతో సహా వ్యవసాయ కూలీల, ముఖ్యంగా కౌలు రైతుల సమస్యలపైన, గిరిజన-గిరిజనేతర పేదల సమస్యలపైన, గ్రామీణ పేదలు, మత్స్య కారులు, చేతివృత్తుల వారి సమస్యలపై సాగిస్తూ వచ్చిన కార్యక్రమాలను... మహాసభల సావనీర్‌లలో, వార్షిక సంచికలలో పేర్కొన్న కార్యక్రమాల నివేదికలలో సంక్షిప్తంగా అందించారు.

అలాగే ఈ కాలంలో... సంఘం ఆధ్వర్యంలో గ్రామీణ, దేవాదాయ, ధర్మాదాయ భూములు, పోరంబోకు, బంజరు, ఈనామ్‌దారి, శ్రోత్రియం తదితర రూపాల్లోని ప్రభుత్వ భూములను సాగు భూములుగా,నివాస స్థలాలుగా దక్కించుకునేందుకు రైతు-కూలీ, పేదలు, దళితులు సాగించిన వివిధ రూపాల్లో పోరాటాలను, ఆందోళనలను కూడా కార్యక్రమాల నివేదికల్లో పేర్కొన్నారు.

ఈ సంచికల్లో... అనేకమంది చిత్రకారుల చిత్రాలు,వందలాదిమంది ప్రజాపక్ష రచయితల, కవుల కవితలను, పాటలను సామాన్య ప్రజానీకానికి అనువైన వాటిని విస్తారంగా అందించారు. అలాగే ఈ అన్ని సంచికలలోనూ రాష్ట్రవ్యాప్తంగా సాగించిన ప్రధాన కార్యక్రమాల ఫోటోలను, గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగతమయ్యే విధంగా, ప్రత్యేకించి రంగుల్లో ఆకర్షణీయంగా ముద్రించి అందించడం విశేషం.

కార్మిక-కర్షక-విద్యార్థి-మేధావుల ఐక్యతా దృక్పథంతో ప్రజలను తక్షణ సమస్యలపై కదిలిస్తూనే, నూతన ప్రజాస్వామిక విప్లవ అవగాహనతో, వ్యవసాయక విప్లవం కీలక కర్తవ్యంగా, దున్నేవానికే భూమి నినాదంతో విప్లవోద్యమంలోకి రైతు- కూలీ-ఆదివాసీ- గ్రామీణ పేదలను సమీకరించి సంఘటితం చేసే కృషిలో కార్యకర్తలకు, శ్రేణులకేగాక విప్లవోద్యమ కార్యకర్తలందరికీ తోడ్పడే విధంగా... రైతు కూలీ సంఘం (ఆంధ్ర) నాయకత్వం ప్రచురిస్తున్న ఈ సావనీర్లను, వార్షిక సంచికలను మరింత ఫలప్రదంగా వినియోగించుకోవల్సిన అవసరం వుంది. ✶

1997 నవంబర్ 4వ తేదీన, ప్రశాంతంగా ఉన్న మనుగోపాల గ్రామంపై 200 మంది పోలీసులు భాష్పవాయువు ప్రయోగిస్తూ దాడి చేశారు. రాంపండు, వీసుబాబులను గిరిజనుల మధ్య నుండి తప్పించి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నాలను గిరిజనులు నిలువరించారు. దీంతో రాంపండు పట్టరాని ఆవేశంతో, పోలీసుల చేతుల్లోని తుపాకీ తీసుకొని గిరిజనుల పైకి కాల్పులు జరిపాతడు.

ఈ కాల్పులలో తొలుత మిడియం రాజు పడిపోయాడు. తర్వాత కారం పార్వతికి తూటా దెబ్బ తాకి నేలకూలింది. మిడియం భూదేవి, సున్నం రాములమ్మలు ఈ కాల్పులలో గాయపడ్డారు.తర్వాత రాంపండును తీసుకొని పోలీసులంతా వెళ్ళిపోయారు.

రాంపండుకు వ్యతిరేకంగా పోరాడినందుకే పోలీసులు ఈ దాడి చేశారు. గాయపడిన వారిని కూడా పట్టించుకోకుండా వెళ్లిపోయారు. గిరిజన సంఘ కార్యకర్తలే, గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించి వైద్యం చేయించారు. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్త నిరసన వ్యక్తమైన తర్వాతనే, ప్రభుత్వం గాయపడిన బాధితులకు వైద్యం అందిస్తున్నట్లుగానైనా ప్రకటించక తప్పలేదు.

కారం పార్వతి భౌతిక కాయాన్ని ప్రజలకు అందకుండా ఖననం చేయాలని ప్రభుత్వం కుట్ర చేసింది. దీనిని ఏజెన్సీ గిరిజన సంఘం, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యకర్తలు అడ్డుకొని, నవంబర్ 5వ తేదీన కారం పార్వతికి ఘన నివాళులర్పిస్తూ అంత్యక్రియలు నిర్వహించారు. భూ పోరాటాన్ని కొనసాగించి తీరుతామని ప్రతినబూనారు. సాధించిన విజయాలను నిలుపుకునేందుకు సంఘర్షిస్తూ, ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు.

## 1998 జులై 17 - అనంతపురం జిల్లా, బొమ్మనహాళ్‌లో భూస్వామ్య శక్తుల అమానుష దాడులు

ప్రభుత్వం జమీందారీ, ఈనాందారి విధానాల్ని రద్దు చేసినప్పటికీ, ఆ భూములు మాత్రం భూస్వామ్య, పెత్తందారుల చేతుల్లోనే ఉండి పోయాయి. ప్రభుత్వ భూ సంస్కరణల బూటకత్వాన్ని వెల్లడి చేస్తూ.... ఒక్క అనంతపురం జిల్లాలోనే లక్ష ఎకరాల శ్రోత్రీయం భూములు, 34 వేల ఎకరాల దేవాలయ భూములు బినామీ పేర్లతో భూస్వామ్య శక్తులే అనుభవిస్తున్నారు. అంతేగాక, భూమిలేని నిరుపేద రైతుల అనుభవంలో ఉన్న అరకొరా భూములను కూడా అధికార యంత్రాంగం అండదండలతో భూస్వామ్య, పెత్తందారులే కబ్జా చేస్తూ వస్తున్నారు.

ఈ నేపథ్యంలో రైతు కూలీ పేదలు ఈ భూముల కోసం సంఘటిత పడ్డారు. 1990 నుండి ఆందోళన పథంలో సాగారు. పేదలంతా సమీకృతులై భారీ సంఖ్యలో ప్రదర్శనలు చేశారు. అధికార యంత్రాంగానికి పలు దఫాలుగా విజ్ఞాపన పత్రాలు అందించారు. చాలా సహజంగానే ఈ ప్రయత్నాలన్నీ బుట్ట దాఖలు అయ్యాయి.

1995 నాటికి రైతు కూలీల ఉద్యమం విస్తృతమైంది. రాయదుర్గం, బళ్ళారిలకు సమీపంలోనున్న బొమ్మనహాళ్, గోవిందవాడ, కొత్తపల్లి, కనేకల్లు, బెనకల్లు, మళ్యామ్ తదితర గ్రామాలకు విస్తరించింది. భూస్వాముల దోపిడీ దౌర్జన్యాలను వ్యతిరేకించాలనే కసి,భూములను దక్కించుకోవాలనే తపన...రైతు కూలీ, పేదలలో పెరుగుతూ వచ్చింది.

బొమ్మన్ హాళ్ గ్రామంలో అగ్రకుల, భూస్వామ్య శక్తులు... గ్రామంలో అన్ని అధికారాలను, గ్రామ వనరులను తమ కబంధ హస్తాలలో బిగించారు. చౌక డిపో డీలర్ షిప్‌ను సైతం తమ చెప్పు చేతల్లో ఉంచుకున్న మాజీ సమితి అధ్యక్షుడు రామప్ప కుటుంబం, ఆ ప్రాంతంలో సాగించే దాడులకు, దౌర్జన్యాలకు అంతులేకుండా పోయింది. అగ్రకుల అహంకారానికి హద్దే లేదు. చౌక డిపో ద్వారా ప్రభుత్వం అందించే సరుకులను కూడా అధిక ధరలకు, తప్పుడు తూకాలతో అమ్మి లాభాలు గడిస్తూ వచ్చారు.

భూస్వామ్య శక్తుల దుర్మార్గాలను, దౌర్జన్యాలను వ్యతిరేకిస్తూ సంఘం ఆధ్వర్యంలో ప్రజలు సంఘటిత పడ్డారు. చట్టప్రకారం కూడా ప్రజలకే చెందాల్సి ఉన్న భూస్వాముల స్వాధీనంలోని శ్రోత్రియం భూములను, దేవాలయ భూములను...పేద రైతులు, భూమి హీనులు తమ అనుభవంలోకి తెచ్చుకున్నారు.

దీనిని సహించలేని బొమ్మన్ హాళ్ అగ్రకుల, భూస్వామ్య శక్తులు, స్థానిక అధికార యంత్రాంగం అండదండలతో రైతు కూలీ ఉద్యమాన్ని నెత్తురుటేర్లలో ముంచడానికి పథకాలు వేశారు. కమ్మ, రెడ్డి పెత్తందారులు, సారా కాంట్రాక్టర్లు తోడయ్యారు. రైతు కూలీలలో పెరిగిన చైతన్యం వీరందరికీ కంటగింపుగానే ఉంది.

బళ్లారి వాస్తవ్యుడైన ముండ్ల భూస్వామికి చెందిన 28 ఎకరాల మిగులు భూములను, ప్రభుత్వమే దళితులైన ముసలప్ప తదితరులకు చట్టబద్ధంగా పట్టాలిచ్చింది. అయితే బొమ్మను హాళ్ అగ్రకుల, భూస్వామ్య శక్తులు.... ఆ 28 ఎకరాలను బినామీగా తామే హక్కు భుక్తం చేసుకున్నారు. అధికార యంత్రాంగానికి ఆధారాలతో సహా పేద రైతులు వివరించినా, వారు చెవొగ్గలేదు. ఎట్టకేలకు ఆర్డీవో గ్రామానికి వచ్చి, పరిశీలించి, బినామీలను రద్దుచేసి అర్హులైన పేదలకు పట్టాలిస్తామని హామీ ఇచ్చినా, ఆచరణలో అది అమలు కాలేదు.

1998 జులై 16న రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో పేదలు సంసిద్ధమయ్యారు. భూస్వామ్య శక్తులను ఈ భూములలోకి దిగనీయకుండా అడ్డుకున్నారు. ఆర్డిఓ ఇచ్చిన హామీని గుర్తు చేశారు. భూస్వామ్య శక్తులు దౌర్జన్యానికి పూనుకున్నా, వారిని భూములలోకి దిగనీయకుండా పేద రైతులు అడ్డుకోవడంతో.... అంతు చూస్తామని హెచ్చరిస్తూ వారు వెనుదిరిగారు.

కాగా ఆ రోజు రాత్రి భూస్వామ్య శక్తులు పథకం రూపొందించు కున్నారు. జులై 17వ తేదీ ఉదయం ముందుగా సిద్ధం చేసుకున్న వేట కొడవళ్ళు, గొడ్డళ్లు, రాడ్లతో వీఎవో సీతారామప్ప తదితరుల నాయకత్వాన బొమ్మనహాళ్‌పై దాడికి పాల్పడ్డారు. గ్రామ రైతు కూలీ సంఘం సభ్యుడు వద్దే శ్రీనివాసులపై దాడి చేశారు. గురుస్వామి ఇంటిలోకి వెళ్లి ధ్వంసం చేశారు. పక్కనే హనుమంతు కిరాణా బంకును నాశనం చేసిన భూస్వామ్య మూకలు... కేకలు వేసుకుంటూ, మారణాయుధాలు ప్రదర్శిస్తూ, పోలీస్ స్టేషన్ మీదుగా వద్దే క్యాంపు చేరుకున్నారు.

ఈ గుండా శక్తుల దాడి నుండి రక్షించుకునేందుకు ప్రజలు మిద్దెలపైకి చేరుకున్నారు. కాగా, పోలీసులు జోక్యం చేసుకొని, మిద్దెల మీద నుండి దిగి రమ్మని, భూస్వామ్య గుండాలను వెనక్కు పంపుతామని నమ్మించటంతో వారంతా కిందకు దిగివచ్చారు. తర్వాత పోలీసులు అక్కడనుండి తప్పుకున్నారు. మిద్దెల నుండి దిగిన వారిపై భూస్వామ్య గుండాలు మారణాయుధాలతో క్రూరంగా వేట్లు వేసి, కొట్టంలో కుప్పలాగా ఒకరిపై ఒకరిని జంతువుల్లాగా పడేశారు. వాస్తవంగా రక్తం గడప మూల వరకు కాలువ కట్టింది. అడ్డం వచ్చిన మహిళలను జుట్టు పట్టుకొని ఈడ్చి కొట్టారు. బీహార్ భూస్వామ్య గుండాల తరహాలో సాగించిన ఈ దాడిలో 31 మంది తీవ్రంగా గాయాల పాలయ్యారు. అనేకమంది అంగవికలురయ్యారు.

ఈ బీభత్స దారుణాలకు కారణం.... భూస్వాముల అధీనంలోని తమ భూములను సంఘం ఆధ్వర్యంలో దక్కించుకునేందుకు, పేద దళిత, రైతు కూలీలు ఉద్యమించడమే! రెవెన్యూ, పోలీసు, రాజ్య యంత్రాంగం... అగ్రకుల భూస్వామ్య పెత్తందారీ శక్తులకు ఏ విధంగా కొమ్ము కాస్తుందో మరోసారి వెల్లడయింది.

ప్రభుత్వ అణచివేత విధానాలను, భూస్వామ్య పెత్తందారీశక్తుల పైశాచిక దాడులను తిప్పి కొట్టేందుకు... పీడిత వర్గ ప్రజలు మరింత సంఘటితపడాలి. ప్రజాతంత్ర వాదులు ఈ దాడులను ఖండించి వారికి అండగా నిలవాలి. భూమి – భుక్తి – విముక్తి కోసం పోరుతున్న గ్రామీణ పీడిత ప్రజల ఉద్యమానికి, కార్మికవర్గం వెన్నుదన్నుగా నిలవాలి.

## 1999 నవంబర్ 17- దుగ్గేరు ఏరియా గిరిజనోద్యమంపై భూస్వామ్య హంతకదాడులు - కామ్రేడ్ జన్ని తిరుపతి అమరత్వం

రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా దుగ్గేరు ప్రాంత గిరిజనులు 1992 నుండి సంఘటితపడుతూ వస్తున్నారు. గిరిజనులను మాత్రమే కాక, గిరిజనేతర పేదలను ఐక్యపరుస్తూ, ఫ్యూడల్ అణిచివేత, పీడనలకు వ్యతిరేకంగా సంఘం ఉద్యమ కార్యకలాపాలు సాగిస్తూ వస్తోంది. ఈ క్రమంలో వేలాదిమందితో పలు దఫాలుగా ప్రదర్శనలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించి, ప్రభుత్వం చేసిన చట్టాల ప్రకారమే గిరిజన–గిరిజనేతర పేదల హక్కులకు రక్షణ కల్పించాలని, అగ్రకుల భూస్వామ్య, పెత్తందారుల ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ వచ్చారు. ఒకనాడు ప్రభుత్వాధికారులను, భూస్వాములను చూస్తే బెదిరిపోయే గిరిజనులను సంఘటితపరచి, చైతన్యయుతులను చేసి, జీవించే హక్కు కోసం పోరాడుతున్నామని చెప్పగలిగే విధంగా... సంఘం వారిని మలిచింది. గిరిజనుల–గిరిజనేతర పేదల ఐక్యత, అగ్రకుల భూస్వామ్య శక్తులకు కలవరం కలిగించింది.

దుగ్గేరు ఏరియా భూస్వామ్య పెత్తందారులు... అణచబడ్డ గిరిజనులకు , గిరిజనేతర పేదలకు అండగా ఉండి సంఘ నిర్మాణం చేస్తున్నందుకు, రైతు కూలీ సంఘ నాయకత్వంపై తప్పుడు ప్రచారాలు సాగించారు. నాయకత్వాన్ని నిర్మూలిస్తామని హెచ్చరించారు. మారణాయుధాలతో దారులు కాచారు. అయితే, చైతన్యవంతులైన సంఘ నిర్మాణం, వీరి దౌర్జన్యాలను ఎక్కడికక్కడ అడ్డుకుంటూ వచ్చింది. మరోవైపున రెవెన్యూ, పోలీసు యంత్రాంగంతో కుమ్మక్కైన భూస్వామ్య పెత్తందారీ వర్గాలు... సంఘం నాయకులు, కార్యకర్తలు, ప్రజలపై ఎన్నో అక్రమ కేసులు బనాయించి, వేధింపులకు గురిచేసినా ప్రజలు వారికి లొంగి రాలేదు.

దీనితో, పెత్తందారీ శక్తులు తమ దాడులను తీవ్రం చేశారు.దుగ్గేరులో వారం వారం జరిగే సంతలకు వెళుతున్న వ్యాపారస్తులను అడ్డుకొని, సంతలు జరగనివ్వలేదు. మక్కువలో బస్సు ఎక్కటానికి వెళ్లిన గిరిజనులపై భౌతికదాడులు చేశారు. 1999 అక్టోబర్ 20న సాలూరులో జరిగే బహిరంగ సభకు వెళ్లేందుకు గిరిజనులు ఏర్పాటు చేసుకున్న వాహనాలను... భూస్వామ్య పెత్తందారుల నాయకుడు మామిడి వెంకటనాయుడు స్వయంగా అడ్డుకొని వెనక్కు పంపాడు. బస్సు ఎక్కుతున్న సంఘ నాయకులపై దాడి చేశారు.

పెత్తందారుల ఈ దాడులు, దౌర్జన్యాలను ఆపవలసిందిగా గిరిజనులు సంఘ నాయకత్వాన పోలీసులకు పలు దఫాలుగా విజ్ఞప్తి చేశారు. దుగ్గేరు గిరిజనుల పరిస్థితిని అధ్యయనం చేయడానికి వెళ్ళిన మేధావులు, ప్రజాతంత్రవాదులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బిడి శర్మ గారు, సంఘ నాయకులు... జిల్లా అధికారులను కలిసి గిరిజనులపై దాడి జరిగే ప్రమాదం ఉందని వారికి వివరించారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని దాడులు నిరోధించాలని విజ్ఞప్తి చేశారు. అయినా, ఎప్పటిలాగానే అధికారులు దీనిని పెడచెవిన పెట్టి భూస్వామ్య వర్గాల కొమ్ముకాశారు.

1999 నవంబర్ 17వ తేదీ సాయంత్రం మూడు గంటలకు, విజయనగరం జిల్లా – మక్కువ మండలం,దుగ్గేరు ఏరియా గిరిజనులపై... ఈ ప్రాంత భూస్వామ్య పెత్తందారులతో కలగలిసిన, వలస వచ్చిన మరికొందరు కమ్మ పెత్తందారులు మారణాయుధాలతో విరుచుకుపడ్డారు. ఈ దాడి నుండి మెలకువగా ఆత్మ రక్షణ చేసుకోకుంటే పదుల సంఖ్యలో గిరిజనులు ప్రాణాలు కోల్పోయేవారు.

గిరిజన సంఘ కార్యకర్త, 18 సంవత్సరాల యువకుడైన జన్ని తిరుపతి తలపై, రౌడీ గూండా మూకలు ఇనుప రాడ్లతో మోదడంతో, జన్ని తిరుపతి నేలకొరిగాడు. పెత్తందారులు రెచ్చగొట్టి తమ వెంట తీసుకు వచ్చిన మక్కువ నివాసి, పేద కుటుంబీకుడైన బోరాడ యాదయ్య ఈ ఘర్షణలో మరణించాడు. ఈ మరణానికి కూడా కారకులు ఈ పెత్తందారులే.

ఈ ప్రాంతంలో పెత్తందారులు, వలస వచ్చిన కొంతమంది భూస్వాములు, కలప అక్రమ వ్యాపారులు కుమ్మక్కై గిరిజనేతరులైన కొందరిని ప్రలోభ పరచి, తమ వైపు మలచుకొని, వారికే" రైతు సంఘం" అనే బ్యానర్ తగిలించారు. భూస్వాముల దౌర్జన్యాలకు, దాడులకు సాకుగాను, రైతు కూలీ సంఘం నాయకత్వంపై అసత్య ప్రచారాలకు ఒక సాధనంగాను... ఈ రైతుసంఘాన్ని ఉపయోగించుకుంటూ వస్తున్నారు.

పీడితుల్లోనే అధమాధములైన గిరిజనులపై భూస్వామ్య గుండాలు క్రూరమైన దాడి జరిపితే...రైతు కూలీ సంఘానికి, 'రైతు సంఘానికి' మధ్య ఘర్షణ అంటూ... తప్పుదారి పట్టించే ప్రకటనలు చేశారు. దీనిని ఖండిస్తూ, రైతుకూలీ సంఘం... భూస్వామ్య పెత్తందారీ వర్గాల దోపిడీ దౌర్జన్యాలను వ్యతిరేకిస్తూ, ఈ దోపిడీ నుండి పీడిత ప్రజల విముక్తికోసం పోరాడుతుందని విస్తృత ప్రచారం చేసింది.

ప్రభుత్వ పోలీసు యంత్రాంగానికి... హంతకదాడులు చేసిన కొందరిని అరెస్టు చేయక తప్పలేదు. అయితే దాడికి గురైన గిరిజనుల పైన, సంఘ నాయకుల పైన కూడా పోలీసు అధికారులు తప్పుడు కేసులు బనాయించి దోపిడీ వర్గాలకు సేవచేసే తమ స్వభావాన్ని చాటుకున్నారు.

దుగ్గేరు ప్రాంత గిరిజన ప్రజానీకం, గిరిజనేతర పేదలతో ఐక్యంగా సాగుతూ గత 25 సంవత్సరాలుగా సాధించిన విజయాలను నిలుపుకుంటూ, కామ్రేడ్ జన్ని తిరుపతి అమరత్వపు స్ఫూర్తితో, హక్కుల సాధనకు నిలకడగా ఉద్యమిస్తోన్నారు.

## 2000 ఏప్రిల్ 11- గుంటూరు జిల్లా, పల్నాడులో బూటకపు ఎదురు కాల్పుల హత్యాకాండలో నేలకొరిగిన కామ్రేడ్స్ విశ్వమోహన రెడ్డి, మరియమ్మ

1994 ప్రాంతం నుండి...గుంటూరు జిల్లా పల్నాడు గ్రామాలలో రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో కామ్రేడ్ విశ్వ మోహన్ రెడ్డి నాయకత్వాన ఉద్యమ కార్యకలాపాలు సుడివేగంతో ప్రారంభమయ్యాయి. పల్నాడు ప్రాంతంలోని భూస్వాములు, పెత్తందార్లు వేలాది ఎకరాల బంజర్లు, దేవాలయ, ఫారెస్ట్ బంజరు భూములను స్వాధీనం చేసుకొని అనుభవిస్తూ ఉండడంతో పాటు దళితులు, మహిళలపై తీవ్రమైన పీడన, అణచివేతలు సాగిస్తూ వస్తున్నారు.

ముఖ్యంగా పిడుగురాళ్ల ప్రాంతంలో సున్నం బట్టీల, మిల్లుల, క్వారీల యజమానుల నిలువు దోపిడీ సాగుతూ ఉండేది. సున్నం మిల్లులలో 24 గంటలపాటు పనిచేయవలసిన దుర్మార్గ పరిస్థితులు ఉండేవి. కార్మికుల రక్తం పిండుకున్న యజమానులు అనతి కాలంలోనే కోట్లకు పడగలెత్తితే, గానుగలో పిప్పిలాగా కార్మికులు సత్తువంతా కోల్పోయి, జబ్బుల పాలై మృత్యు బారిన పడేవారు. వ్యవసాయ పనులు లేకపోవడం, పలనాడులో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులలో, వినుకొండ, నడిగడ్డ తదితర ప్రాంతాల నుండి వలస కూలీలుగా వచ్చిన వీరు...బట్టీలు, మిల్లులు, క్వారీల్లో తీవ్ర ప్రమాదాలకు లోనైనా ప్రశ్నించేవారు లేకపోయేవారు.

బట్టీలు, మిల్లులు, క్వారీలలో పనిచేసే వేలాదిమంది...తలదాచుకునే అవకాశం లేక అల్లాడుతున్న పరిస్థితుల్లో, వారిని సమీకరించి 1995లో పిడుగురాళ్లలో 70 ఎకరాల స్థలంలో లెనిన్‌నగర్,

➡

(2వ పేజీ తరువాయి)
మహిళలపై అఘాయిత్యాలు పెచ్చుమీరాయి. అక్రమ పన్నుల భారంతో తరతరాలుగా అడవినే నమ్ముకున్న ఆదివాసులు, అడవిలోనే పరాయివారిగా మిగిలిపోవాల్సి రావటాన్ని వారు సహించలేకపోయారు. దుర్మార్గమైన అటవీ నిబంధనలు, జమీందార్ల అరాచకాలు, పోలీసుల అణచివేత, వేధింపులు, ముఠాదారీ విధానం మొదలైన వాటితో ఆదివాసులు, సీతారామరాజు నాయకత్వంలో పోరాటానికి సిద్ధమయ్యారు. అయితే కేవలం విల్లంబులతోనే సాయుధ పోలీసులను ఎదిరించి నిలవటం సాధ్యంకాదని, తాము కూడా తప్పనిసరిగా తుపాకులు, మందుగుండు సామాగ్రిని సమకూర్చుకోవాలని నిర్ణయించుకొని, చింతపల్లి, కృష్ణదేవిపేట, రాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్లపై దాడి సాగించారు.

స్కాట్, హైటర్ వంటి ప్రపంచ యుద్ధాలలో ఆరితేరిన సైనికాధికారుల నాయకత్వంలో 300 మంది ప్రత్యేక సాయుధ బలగం మన్యాన్ని జల్లెడపట్టింది. దామనపల్లె వద్ద స్కాట్, హైటర్ బలగాలకూ, రామరాజు నాయకత్వంలోని ఉద్యమకారులకు నడుమ సాగిన గెరిల్లా యుద్ధంలో బ్రిటిష్ పోలీసు అధికారులిద్దరూ అక్కడికక్కడే మరణించారు. కొద్దిమందిగా వున్న ఉద్యమకారుల బృందం ఏ గ్రామం వెళ్ళినా అక్కడి ప్రజలంతా సైన్యమై వీరికి వెన్నంటి నడిచారు.

అయితే, బ్రిటిష్ పోలీసు బలగాల సంఖ్య, వారి అధునాతన ఆయుధ శక్తి ముందు.... కొద్ది ప్రాంతానికే పరిమితమైన ఉద్యమం, బయట మైదాన ప్రాంతాల నుండి ఎటువంటి తోడ్పాటు, సహాయాలు లేకపోవటంతో,.... ఎక్కువ కాలం మనలేకపోయింది. మరోవైపున 1924 జనవరి 27న మేజర్ గూడాల్ నాయకత్వంలో అస్సాం రైఫిల్ దళాన్ని ప్రత్యేకంగా రంగంలోకి దించారు. కన్నెగంటి హనుమంతును కాల్చి చంపించిన ఐసిఎస్ అధికారి రూదర్ ఫర్డ్‌ను రామరాజును అంతమొందించేందుకు ఏజెన్సీలో పోలీసు చర్యకు ప్రత్యేక కమీషనర్‌గా నియమించారు.

ఎట్టకేలకు, 1924 మే 7వ తేదీన మాటుగాసి సజీవంగా రామరాజును బంధించిన పోలీసులు, ఆలస్యం చేయకుండా అదేరోజు కొయ్యూరు సమీపంలోని ఓ చెట్టుకు కట్టివేసి, కాల్పులు జరిపి ఆయనను హత్య గావించారు. తప్పించుకునే ప్రయత్నంజేస్తే కాల్చి చంపవలసి వచ్చిందని బ్రిటిష్ ప్రభుత్వం అబద్ధపు ప్రచారాలు చేసుకుంది. దేశవ్యాపిత విప్లవకారులందరితో సీతారామరాజు సమన్వయ కృషిలో వుండి, వారందరితో సన్నిహిత సంబంధాలను నెరుపుతూ, ఉద్యమాన్ని విస్తృతపరిచే ఆలోచనలో వున్నప్పటికీ – అవేవీ కార్యరూపం దాల్చనీయకుండా బ్రిటిష్ ముష్కరులు 27 సంవత్సరాల వయసులోనే ఆయనను అంతమొందించారు. విశాఖ, తూర్పుగోదావరి జిల్లాలలో 186 ఏజెన్సీ గ్రామాలు ఆయన నాయకత్వంలో ఈ ఉద్యమం వెంట నడిచాయి; ఈ ఉద్యమ క్రమంలో 276 మంది ఉద్యమకారులపై, గిరిజనులపై బ్రిటిష్ ప్రభుత్వం అనేక అక్రమ కేసులు నమోదు చేసింది; అనేకమందిని జైలుశిక్షలకు గురిచేసింది.

అల్లూరి సీతారామరాజును 'భౌతికంగా' బ్రిటిష్ ప్రభుత్వం అంతం చేయగలిగింది. కానీ, వంద సం॥లు అయినా ఆయన స్ఫూర్తి, ఆయన పోరాట తెగువ ఆదివాసుల, ఆంధ్ర రాష్ట్ర ప్రజానీకం గుండెల్లో నిలిచే వున్నాయి. సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా ఆదివాసులపై దోపిడీ పీడనలను నిరసిస్తూ అల్లూరి సీతారామరాజు ప్రదర్శించిన పోరాటస్ఫూర్తిని, ముఖ్యంగా ఆదివాసుల సమస్యల పరిష్కారానికి, వారి స్వేచ్ఛా జీవనంపట్ల ఆయన అంకితభావం, త్యాగనిరతి వంటి లక్షణాల నన్నింటినీ పుణికి పుచ్చుకొని ఆదివాసీ, రైతు, కూలీ ప్రజానీకం ఉద్యమించటమే ఆ విప్లవ వీరునికి మనమర్పించే అసలైన నివాళి. దేశప్రజలంతా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో జీవించాలనే సీతారామరాజు కలను సాకారం చేసేందుకు ఆయన శతవర్ధంతి సందర్భంగా ప్రతినబూనుదాం. ✶

---

➡ కొండమోడులో టి.ఎన్.నగర్ల నిర్మాణం, ఆంబోతు మాన్యంలో సాగు భూమిలోకి నిరుపేదలను సమీకరించడం... ఒకదాని వెంట మరొకటి వేగంగా జరిగిపోవటం... యాజమాన్య వర్గాలకు కంట గింపయింది. ముఖ్యంగా, నికృష్ట చాకిరీచేసే కార్మికులంతా ఒకచోట సంఘటితం కావడం సహించలేని బడా వ్యాపారులు, యాజమాన్యాలు, భూస్వామ్య పెత్తందారి శక్తులు... కాలనీలను విచ్ఛిన్నం చేయడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. రౌడీ గుండాలతో దాడులు చేశారు. పోలీసులతో కేసులు పెట్టించారు. కాలనీలను దురాక్రమించే కుట్రలెన్నో చేశారు. విశ్వమోహన్‌రెడ్డిపై హత్యా ప్రయత్నం చేశారు. కానీ సంఘ నాయకత్వంలో ప్రజలు దృఢంగా నిలిచారు. రౌడీ గూండాల దాడులను ఎదుర్కొన్నారు. కేసులకు జంక లేదు. కాలనీలను నిలబెట్టుకున్నారు.

కామ్రేడ్ విశ్వమోహన్ రెడ్డి నాయకత్వంలో రాజుపాలెం, బెల్లంకొండ మండలాల్లోని పెత్తందార్ల చేతుల్లోని వందలాది ఎకరాల ఫారెస్ట్, బంజరు, దేవాదాయ, సత్రం భూములను పేద ప్రజలు స్వాధీనం చేసుకుని సాగు చేశారు.

అలాగే వినుకొండ మండలం – దొండపాడు గ్రామంలో పెత్తందార్ల దౌర్జన్యాలు, హత్యాకాండకు వ్యతిరేకంగా సంఘం ఆధ్వర్యంలో ప్రజలు నిలబడ్డారు. కోట్లాది రూపాయల ఆదాయం లభిస్తున్న చేపల చెరువులో తమ వాటా కోసం నిలవేశారు. దీనితో గంగ వెర్రులెత్తిన పెత్తందారులు, హింసకాండకు పూనుకున్నారు. దీనిని ప్రజలు ఎదుర్కొన్నారు. దొండపాడు, పానకాలపాడు, ఉప్పలపాలెం గ్రామాలలో ప్రజలు కదిలి బంజరు, పోరంబోకు భూములను స్వాధీనం చేసుకున్నారు. అలాగే బొల్లాపల్లి మండలంలోనూ అనేక గ్రామాలలో ప్రజలు భూములపై కదిలారు. సంఘం... భూస్వాములకు కంటగింపైంది. సంఘ నాయకత్వాన్ని నిర్మూలించేందుకు కంకణం కట్టుకున్నారు.

ఈ పోరాటాల ప్రేరణ... ప్రకాశం జిల్లా దొనకొండ, త్రిపురాంతకం, పుల్లలచెరువులకు పాకింది. అనేక గ్రామాలలో ప్రజలు భూముల పైకి కదిలారు. ప్రకాశం జిల్లాలో తొమ్మిది మండలాలకు భూ పోరాటం వ్యాపించింది. పల్నాడులో, ప్రకాశం జిల్లాలోని ఈ ప్రాంతాలలో భూస్వామ్య, పెత్తందారుల స్వాధీనంలో ఎంత పెద్ద మోతాదులో భూములు ఉన్నాయో... ప్రజలలో భూ కాంక్ష ఎంతగా దాగి ఉందో, వ్యవసాయ విప్లవం నేటికీ ఎంత ప్రాధాన్యత కలిగి ఉందో... కామ్రేడ్ విశ్వమోహన్ రెడ్డి నేతృత్వంలో, సంఘం ఆధ్వర్యంలో ప్రజల కదలిక వెల్లడి చేస్తోంది.

విస్తరిస్తున్న రైతాంగ ఉద్యమాన్ని చూసి కలవరపడిన భూస్వామ్య, పెత్తందార్లు, అధికార రాజకీయ నాయకులు, బడా వ్యాపారులు, పోలీసు యంత్రాంగం... సమన్వయంతో హత్యకు పథకాలు వేశారు.

భూస్వామ్య పెత్తందార్ల ఏజెంట్ల ద్వారా కామ్రేడ్ విశ్వమోహన్ రెడ్డి, మరియమ్మల ఆచూకీ తెలుసుకొని... ప్రకాశం జిల్లాలో పట్టుకొని, 2000 సంవత్సరం ఏప్రిల్ 11 అర్ధరాత్రి వారిని కాల్చి చంపారు. వారి మృతదేహాలతో పిడుగురాళ్లలో ప్రదర్శన జరపకుండా నిరోధించడానికి అధికార యంత్రాంగం విఫల ప్రయత్నం చేసింది. వేలాదిమంది ప్రజలు తరలివచ్చి ప్రియతమ నేతలకు కడసారి వీడ్కోలు పలికారు. సాధించిన విజయాలను నిలబెట్టుకుంటూ సంఘం ఆధ్వర్యంలో కార్యకలాపాలు సాగుతున్నాయి. ✶

**అమెరికా...** (చివరి పేజీనుండి)

కోసం, ఈ ఆందోళనల సందర్భంగా సంఘర్షణపడు తున్నారు. యూదు జాతికి చెందిన అనేకమంది విద్యార్థులు ఈ నిరసనలు, ఆందోళనలలో పాల్గొంటున్నారు.

నిరసన ధర్నాలు వివిధ విశ్వవిద్యాలయాలకు వ్యాపించాయి. అప్పర్ మ్యాన్ హట్టన్‌లోని కొలంబియాకు చెందిన ఐ వీ లీగ్ ప్రాంగణం నుండి ప్రారంభించి న్యూయార్క్ మీదుగా ఈ నిరసనలు కాలిఫోర్నియా రాష్ట్రంలోని పాలిటెక్నిక్ లకు, విశ్వవిద్యాలయాలకు, హంబోలాట్,నార్త్ ఆఫ్ శాన్ ఫ్రాన్సిస్కో వరకు వ్యాపించాయి. ఇక్కడ విద్యార్థులు భవనాల ప్రవేశ ద్వారాలను అడ్డుకునేందుకు చైన్లు, జిప్ టైలు, ఇతర సామాన్లను ఉపయోగిస్తున్నారు. ఈ నిరసనలతో కొలంబియా విద్యార్థులు ప్రత్యక్షంగా హాజరయ్యే తరగతులను యాజమాన్యం రద్దు చేసింది. న్యూయార్క్ యూనివర్సిటీ విద్యార్థులను, ఏల్, హార్వర్డ్ యార్‌కు చెందిన విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు.

ఈ యూనివర్సిటీల ప్రవేశ ద్వారాలను విద్యార్థులు మూసివేశారు. పోలీసులను విశ్వవిద్యాలయ ప్రాంగణాలలోనికి అనుమతించే అప్రజాస్వామిక చర్యలను ఖండిస్తూ, నిరసనలను విద్యార్థులు తీవ్రం చేశారు. సదరన్ కాలిఫోర్నియా విశ్వవిద్యాలయానికి చెందిన లాస్ ఏంజల్స్, టెక్సాస్, ఆస్టిన్, ఒరేగావ్‌లోని పోర్ట్ ల్యాండ్ స్టేట్ విశ్వవిద్యాలయం మొదలుగా గల అమెరికా వ్యాపిత విద్యా సంస్థలన్నింటిలో నిరసనలు బ్రదలయ్యాయి.

గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధంలో మృతుల సంఖ్య పెరుగుతుండగా, మానవత్వం మంటగలుస్తుండగా, అమెరికా వ్యాపితంగా నిరసన ఆందోళనలు విస్తరించాయి. ఇండియానా విశ్వవిద్యాలయం, బ్లూమింగ్ టన్, ఒహియో స్టేట్ యూనివర్సిటీలలో నిరసనల సందర్భంగా పోలీసులతో విద్యార్థుల ఘర్షణలు జరిగాయి. విశ్వవిద్యాలయ, నగర పాలనాధికారుల నిర్ణయంలో భాగంగా పోలీసులను ప్రాంగణం లోకి ప్రవేశపెట్టడంతో... దేశవ్యాప్తంగా వందలాది మంది విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఆందోళనలు కాలిఫోర్నియా, జార్జియా, టెక్సాస్ విశ్వవిద్యాలయ బోధన సిబ్బందిలో కదలికను తెచ్చి, విశ్వవిద్యాలయ పాలనాధ్యక్షులను వ్యతిరేకిస్తూ, వారి నాయకత్వం పట్ల అవిశ్వాసాన్ని తెలుపుతూ ఓటు వేసే వైపుగా పురిగొల్పాయి. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, లాస్ ఏంజెలెస్, బ్లూమింగ్‌టన్‌లోని ఇండియానా యూనివర్సిటీ, సెయింట్ లూయిస్ వద్దనున్న వాషింగ్టన్ యూనివర్సిటీల వంటి వివిధ ప్రాంగణాలలోకి పోలీసులు ప్రవేశించి విద్యార్థులను అరెస్టు చేశారు. నిరసన ఆందోళనలు సాగిస్తున్న విద్యార్థుల పట్ల క్షమాగుణంతో వ్యవహరించాలని డిమాండ్ చేసే బోధనా సిబ్బంది సంఖ్య పెరుగుతుంది. అమెరికా జాతీయ భద్రతా విభాగ అధికార ప్రతినిధి మాట్లాడుతూ, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ నిరసనలను అదుపుచేసే బాధ్యతను స్థానిక పాలనా సంస్థలకు వదిలి వేశాడని పేర్కొన్నాడు. ప్రస్తుతం విద్యార్థుల ఆందోళనలపై పోలీసులు విరుచుకుపడుతున్న తీరు, ఒకనాడు వియత్నాం యుద్ధ వ్యతిరేక ఉద్యమంపై సాగించిన నిర్బంధాన్ని తలపిస్తోంది.

విద్యార్థుల నిరసన ఆందోళనల కారణంగా మే 15న న్యూయార్క్ నగరంలో నిర్వహించాల్సిన ప్రధాన స్నాతకోత్తర కార్యక్రమాన్ని కొలంబియా విశ్వవిద్యాలయం రద్దు చేసుకుంది. మసాచు సెట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటి) వద్ద పాలస్తీనా అనుకూల శిబిరాన్ని పోలీసులు సాగిస్తున్న దాడులలో భాగంగా తొలగించి వేశారు. ఫిలడెల్ఫియాలోని పెన్సిల్వేనియా విశ్వ విద్యాలయ ప్రాంగణం నుండి గుడారాలను తొలగించేందుకు పోలీసులు కదిలారు. అరిజోనా విశ్వవిద్యాలయంలో ఒక నిరసన శిబిరాన్ని ఖాళీ చేయించేందుకు ఆందోళనకారులపై పోలీసులు భాష్ప వాయువు ప్రయోగించారు. జార్జి వాషింగ్టన్ విశ్వవిద్యాలయంలోని విద్యార్థుల నిరసన శిబిరాన్ని తొలగించేందుకు పోలీసులు పెపర్ స్ప్రేలను ఉపయోగించారు. అనేకమంది ప్రదర్శకులను అరెస్టు చేశారు. ఇటీవల కొద్ది వారాల సమయంలోనే విశ్వవిద్యాలయ ప్రాంగణాలలో నిరసన ప్రదర్శనలు, ధర్నాల సంఖ్య 2900కి పైగా చేరింది.

పాలస్తీనా ఆక్రమణ యొక్క రాజకీయ, ఆర్థిక విధానాన్ని గురించి, వాషింగ్టన్ నుండి టెలీ అవీవ్, రియాద్ వరకు, కార్పొరేషన్ల లాభాల నుండి, ఇజ్రాయిల్ జనావాస శాశ్వత స్థావరాల నుండి, అమెరికా విశ్వవిద్యాలయ దాతలకు, ట్రస్టీల వరకు... వెంబడిస్తున్న డబ్బు గురించి, భూగోళం అవలి వైపున సాగిస్తున్న యుద్ధానికి, విశ్వవిద్యాలయ పెట్టుబడుల గురించి... నిరసన కారులైన విద్యార్థులు అధ్యయనం చేస్తున్నారు. చర్చల కోసం ఉద్దేశించిన బోధనలు, ప్రజా విశ్వవిద్యాలయాలనేవి...విద్యార్థులను వారి విద్య వైపుకు తిరిగి వెనక్కు రప్పించేందుకు, అమెరికాలో పాలస్తీనా సంఘీభావాన్ని అణిచివేసే చరిత్రలో ప్రత్యేకించి తరగతి గదులలో, ప్రాంగణాలలో వారి ప్రసంగాలను, భిన్నాభిప్రాయాల నుండి వెనక్కు రప్పించేందుకు చేసే ప్రయత్నాల గురించి...వారు అధ్యయనం చేస్తున్నారు. ఫ్లోరిడా విశ్వవిద్యాలయం నుండి టెక్సాస్ విశ్వ విద్యాలయం వరకు, అట్లాంటాలోని ఎమోరీ విశ్వవిద్యాలయం నుండి కాల్ రాష్ట్రంలోని శాక్రమెంటో వరకు ఇజ్రాయిల్ బలగాల దుర్మార్గాలకు వ్యతిరేకంగా, వారిని సంపూర్ణంగా పాలస్తీనా నుండి తొలగించాలని విద్యార్థులు నిలదీస్తూ ఉన్నారు.

అనేక విశ్వవిద్యాలయాల పాలనాధికారులు, పాలస్తీనా అనుకూల సంఘీభావ వ్యక్తీకరణల పైన, ఇజ్రాయేల్ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టే కార్యక్రమాల పైన, క్రమశిక్షణా చర్యలు అమలు చేయడం ప్రారంభించారు. దాడిని తమ విద్యార్థుల సమూహం తీవ్రంగా ఖండిస్తోందని, ఇజ్రాయిల్‌కు ఆయుధాలను విక్రయించే కంపెనీల నుండి విడగొట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్‌తో నున్న ఆర్థిక లావాదేవీలను ఆపివేయాలని విద్యార్థులు డిమాండ్ చేయటంతో ఈ క్రమశిక్షణా చర్యలను చేపడుతున్నారు.

అయితే యూనివర్సిటీ నిఘాలను,భద్రతా చర్యలను ధిక్కరిస్తూ విద్యార్థులు నిరసన ఆందోళనలు చేపట్టడాన్ని మరింత శిక్షార్హమైన అంశంగా అధికారులు పరిగణిస్తున్నారు. కాగా, జో బైడెన్ పాలనాయంత్రాంగం ఇజ్రాయిల్ యుద్ధ ప్రయత్నాలకు మద్దతుగా తన సహాయాన్ని రెట్టింపుచేయడంతో, మితవాద రాజకీయవాదులు విశ్వవిద్యాలయ అధ్యక్షులతో ఉన్నత స్థాయిలో చర్చలు నిర్వహిస్తూ, విశ్వవిద్యాలయ ప్రాంగణా లలో రాజకీయ సంస్కృతి గురించి విచారణ సాగిస్తున్నారు.

యూనివర్సిటీల యాజమాన్యం... ప్రాంగ ణాలలోకి పోలీసులను ఆహ్వానించి నిరసన శిబిరాలను తొలగింపచేస్తున్నాయి. నిరసన ప్రదర్శకులు బెదిరింపులు చేస్తున్నారని, యూదులపట్ల శత్రుత్వంతో ఉన్నారని కొందరు యూదు విద్యార్థులు ఫిర్యాదు చేశారని, అందుకే ఈ చర్యలు చేపడుతున్నామని వారు తెలిపారు. అయితే అనేకమంది యూదు విద్యార్థులతో సహా నిరసనకారులు... యూదుల పట్ల శత్రుత్వంతో వుండే ఘటనలను తాము అనుమతించటంలేదని, కానీ అధికారులు తమను ఇజ్రాయిల్‌కు వివక్షంగా జమకట్టడాన్ని విమర్శించారు. యూదులపట్ల అసహ్యతకు, యూదు జాత్యహంకార వ్యతిరేకతకు, యూదు ప్రజలపై జాత్యహంకార దాడులను విమర్శించ డానికి, యూదుజాతి సభ్యులకే పరిమితమైన జాత్యంహంకార ఇజ్రాయిల్ రాజ్యాన్ని వ్యతిరేకించటానికి నడుమనున్న తేడాను వారు విశ్లేషించారు. ఉన్నత విద్య కార్పొరేటీకరణ, సైనికీకరణ కావటాన్ని విద్యార్థులు వ్యతిరేకించారు.

గాజా ప్రజలకు సంఘీభావంగా నిలుస్తున్నందుకు గాను విద్యార్థులు సస్పెన్షన్లను, అరెస్టులను భరిస్తున్నారు.

అమెరికాలోని చాందసవాద, ఉదారవాద ప్రసార మాధ్యమాలు విద్యార్థులపై సాగుతున్న ఈ నిర్బంధాన్ని వెలుగు చూడనీయకుండా విశ్వవిద్యాలయ పాలనాధికారులకు మద్దతుగా నిలుస్తున్నాయి. విద్యార్థుల సంఘీభావ రిపోర్టులను ప్రసారంచేసే సమయంలోను,' ఇజ్రాయిల్ జాత్యహంకార యుద్ధానికి వ్యతిరేకంగా విద్యార్థుల నిరసనలు' అని పేర్కొనటం కాకుండా,' ఇజ్రాయిల్ దక్షిణ ప్రాంతంలో హమాస్ సాగించిన దుర్మార్గమైన దాడి కారణంగా అనేక కళాశాల ప్రాంగణాల్లో నిరసనలు జరుగుతున్నాయ'ని పేర్కొనడం... హమాస్ దాడి యొక్క సహజ పరిణామాలలో భాగంగానే ఇజ్రాయిల్ సాగుస్తున్న జాత్యహంకార యుద్ధమని చూపుతున్నారు. అయితే విద్యార్థులు వేటినీ లెక్కచేయకుండా, తమ నిరసనలు, ధర్నాలు, ఆందోళనలను కొనసాగిస్తూ ఇతర దేశాలలోని విశ్వవిద్యాలయ విద్యార్థులకు ఉత్తేజాన్ని కలిగిస్తున్నారు.

అమెరికాలోని పాలస్తీనా సంఘీభావ విద్యార్థుల నిరసన కార్యక్రమాలతో ఉత్తేజం పొందిన ఫ్రాన్స్‌లోని 'సైన్సెస్ పో' గా పేర్కొనే ప్యారిస్ రాజకీయ అధ్యయనాల సంస్థ విద్యార్థులు, పాలస్తీనీయులకు మద్దతుగా నిలుస్తూ యూదు జాత్యహంకారాన్ని ఖండిస్తూ... అమెరికా దేశవ్యాప్తంగా పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనలు, ధర్నాలు, శిబిరాలను నిర్వహించిన తీరులోనే, ఫ్రాన్స్‌లోను నిర్వహిస్తున్నారు. పాలస్తీనా జాతీయ పతాకాలను ఊపుతూ, గాజా ప్రజానీకానికి మద్దతుగా నినాదాలు చేస్తున్నారు. యూనివర్సిటీ పాలనా యంత్రాంగం ప్రధాన భవనాలను మూసివేసి, ఆన్‌లైన్ తరగతులకు పూనుకుంది. ఫ్రాన్స్ దేశంలోని మరికొన్ని యూనివర్సిటీలలోనూ ఇదే తరహా ఆందోళనలు జరిగాయి.

ఐర్లాండ్‌కు చెందిన ప్రఖ్యాత ట్రినిటీ కళాశాల వద్ద డర్బన్ విద్యార్థులు, గాజాలో ఇజ్రాయిల్ హంతకదాడులను వ్యతిరేకిస్తూ, ప్రాంగణ నిరసనలు చేపట్టి ప్రధాన ప్రవేశ ద్వారాన్ని దిగ్బంధించారు. పాలస్తీనా సంఘీభావ శిబిరంగా దానిని వారు పేర్కొన్నారు. తన పర్యాటక ఆదాయాన్ని కోల్పోయినందుకు గాను, విద్యార్థుల సాంవత్సరిక ఫీజులు, అద్దెలు మొదలైన వాటిని పెంపు చేయడం ద్వారా యూనివర్సిటీ అధికారులు 2,14, 000 యూరోల జరిమానా మొత్తాన్ని విద్యార్థులపై విధించారు.

ఆమ్ స్టర్ డాం విశ్వవిద్యాలయంలో విద్యార్థులు పాలస్తీనా అనుకూల ప్రదర్శన,ధర్నా నిర్వహించి, ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయ ప్రాంగణాలలో జరుగుతున్న కార్యక్రమాలతో ఉత్తేజితులై ఆ తరహాలోనే ప్రవేశ ద్వారం వద్ద బారికేడ్లను విద్యార్థులు నిర్మించారు. కాగా, పోలీసులు ఈ చర్యతో 120 మంది పైగా విద్యార్థులను అరెస్టు చేయడంతో పాటు, విద్యార్థులు నిర్మించిన బారికేడ్లను తొలగించి వేశారు.

వివిధ దేశాలలోని విద్యార్థుల నడుమ ఇజ్రాయిల్ జాతిహనన యుద్ధాన్ని ఖండిస్తూ అమెరికా సామ్రాజ్యవాద వికృత ముఖాన్ని వెల్లడి చేయడం, ఒక ప్రగతిశీల పరిణామం.

### పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్నది కేవలం జాతిహనన యుద్ధం మాత్రమే కాదు... జ్ఞానహనన యుద్ధం కూడా!

విజ్ఞాన వ్యవస్థను సంహరించడాన్ని, దాని నోరు నొక్కి సంపూర్ణంగా ధ్వంసం చేయటాన్ని సూచించే జ్ఞానహనన యుద్ధం(ఎపిస్టెమిసైడ్) అనే నూతన పదాన్ని బోవెంటుర డిసౌజా అనే సామాజిక వేత్త రూపొందించాడు. పాలస్తీనాపై ప్రస్తుతం ఇజ్రాయిల్ సాగిస్తున్న దురాక్రమణ యుద్ధంలో జరుగుతున్నది ఇదే. పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధంలో ఇది మరో కీలకమైన అంశం.

ఇజ్రాయిల్, పాలస్తీనాపై సాగిస్తున్న దాడిలో గాజాలోని 12 యూనివర్సిటీలను లక్ష్యంగా చేసుకుంది. ఆల్ అహజార్ విశ్వ విద్యాలయం, గాజా ఇస్లామిక్ విశ్వవిద్యాలయం (ఐ యు జి)లను వైమానిక బలగాలు లక్ష్యంగా చేసుకొని దాడులు చేశాయి. దీనితో విద్యావేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు ఏళ్ల తరబడి కష్టించి సాగించిన పరిశోధనలన్నీ ధ్వంసం అయ్యాయి. ఆ యూనివర్సిటీకి చెందిన దాదాపు 90,000 మంది విద్యార్థులు తరగతులకు హాజరవలేని స్థితిలో ఉన్నారు. 60 శాతం పైగా విద్యాసంస్థలు... దాదాపు అన్ని విశ్వవిద్యాలయాలు, అసంఖ్యాక పుస్తకాల దుకాణాలు, గ్రంథాలయాలు ధ్వంసం అయ్యాయి. వందలాదిమంది విద్యావేత్తలు, యూనివర్సిటీ డీన్స్‌తో సహా ఉపాధ్యాయులు అనేకమంది హతులయ్యారు. దీనితో గాజాలోని చిన్న పిల్లలకు, యువతకు, విద్యకు, విద్యావకాశాలకు ఉన్న అవకాశాలన్నీ మూసుకు పోతున్నాయి. అనేక బహిరంగ గ్రంథాలయాలు, మ్యూజియంలతో సహా పాత జ్ఞాపకాలు, విలువైన రచనలు, చారిత్రక కట్టడాలు వారసత్వ సాంస్కృతిక కేంద్రాలు, ధ్వంసం చేయబడటం... పాలస్తీనాకు సంబంధించి, నమోదైన చరిత్ర నంతా తుడిచిపెట్టడం జరుగుతోంది. ప్రపంచ రాజకీయ చిత్రపటం నుండి పాలస్తీనాను సంపూర్ణంగా తొలగించే ఓ దుర్మార్గ ప్రయత్నం జరుగుతోంది. ప్రపంచ బ్యాంకు వివరాల ప్రకారం... ప్రపంచంలోని కాందిశీకులలో అత్యధికంగా విద్యావంతులైన వారు పాలస్తీనీయులుగా ఉన్నారు. పాలస్తీనాలో ఈ విజ్ఞాన వ్యవస్థను పునర్‌నిర్మించడానికి దశాబ్దాల కాలం పడుతుంది. విద్యా వ్యవస్థను, విజ్ఞాన వ్యవస్థను పునర్‌నిర్మించడం అనే కర్తవ్యం, భవిష్యత్తులో అత్యంత భారీ కర్తవ్యంగా మిగల బోతోంది. అది కూడా అంతర్జాతీయ మద్దతు సహకారాలతో మాత్రమే సాధ్యం కాగలుగుతుంది. అందుచేతనే విశ్వవిద్యాలయాలలోని బోధన సిబ్బంది,ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధాన్ని, దానికి అమెరికా ఇస్తున్న మద్దతును ఖండిస్తూ నిరసన తెలుపుతున్న అమెరికా విశ్వవిద్యాలయ విద్యార్థులతో పాటుగా స్పందిస్తున్నారు.

**(అమర్ జీత్ భుల్లన్, వాసుకి నేసయ్య, పౌలా చక్రవర్తిల వ్యాసాల ఆధారంగా...)** ★

## కామ్రేడ్ రాగి సుబ్బారావుకు జోహార్లు

సిపిఐ (ఎం-ఎల్)న్యూడెమోక్రసీ నాయకులు కామ్రేడ్ రాగి సుబ్బారావు (76 సం॥లు) 1-5-2024న గుంటూరులో మరణించారు. ఆయన గత పది సంవత్సరాలుగా అనారోగ్యంతో ఉన్నారు. 1970లలో ఆయన తొలుత సిపిఐ సభ్యునిగా ఉంటూ అల్యూమినియం పాత్రల తయారీ కార్మికునిగా పనిచేసే క్రమంలో తరిమెల నాగిరెడ్డి నాయకత్వంలోని విప్లవ కమ్యూనిస్టు కమిటీతో సంబంధాలనేర్పరచుకొని చురుకైన కార్యకర్తగా పనిచేశారు.

1975 నాటి ఎమర్జెన్సీ కాలంలో సంజయ్ గాంధీ గుంటూరు పర్యటనను నిరసిస్తూ పార్టీ ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేసిన సందర్భంగా పోలీసులు ఆయన ఇంటిపై దాడి చేసి కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురి చేశారు. ఎమర్జెన్సీ కాలంలో రహస్యంగా ఉంటూ ఆయన జిల్లాలోని పలు ప్రాంతాలలో కార్యకలాపాలు సాగించారు. తర్వాత కాలంలో కార్మిక సంఘం నాయకునిగా, పార్టీ నాయకునిగా ఆయన సుదీర్ఘకాలం పనిచేశారు.

కామ్రేడ్ రాగి సుబ్బారావుకు సిపిఐ (ఎం-ఎల్) జోహార్లు చెబుతూ, వారి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేస్తోంది.

**Janasakti (Communist Revolutionaries' Monthly) RNI No. 8315/63 VJ-077/2022-24**
No.of pages : 28 Date of publication : 1st & 2nd of Every Month Posting date : 5th or 6th of Every Month

# అమెరికా విశ్వవిద్యాలయాలన్నింటా కార్చిచ్చులా విస్తరిస్తున్న పాలస్తీనా సంఘీభావ, ఇజ్రాయిల్ వ్యతిరేక,విద్యార్థుల ఆందోళనలు

**న్యూయార్క్‌లోని** కొలంబియా విశ్వవిద్యాలయంలో 2024 ఏప్రిల్ మూడవ వారంలో పాలస్తీనాకు అనుకూలంగా విద్యార్థుల ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. ఇస్లాం వ్యతిరేకత, పాలస్తీనా వ్యతిరేకత, జాత్యహంకారం సాధారణీకరించబడిన నేటి అమెరికాలో... విశ్వవిద్యాలయ పరిపాలనాధికారులు జాతి హనన యుద్ధం పట్ల అంగీకారంతో నున్న పరిస్థితులలో... అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ సాగిస్తున్న జాతిహనన యుద్ధాన్ని విద్యార్థులు నిరసిస్తున్నారు. అంతే కాదు, విశ్వవిద్యాలయ పరిపాలనాధికారులు, జాతిహనన యుద్ధానికి అనుకూలంగా ఉండడాన్ని కూడా వ్యతిరేకిస్తున్నారు. విద్యా విషయకంగా స్వాతంత్రంలో, ముఖ్యంగా 2023 అక్టోబర్ నుండి విశ్వవిద్యాలయ పరిపాలన అధికారులు పాలస్తీనాను మినహాయించడంలోని వారి పాత్రను, విద్యార్థులు ప్రత్యేకించి వ్యతిరేకిస్తున్నారు. న్యూయార్క్ విశ్వవిద్యాలయ విద్యార్థుల నాయకత్వంలో ఆఫ్రికా–అమెరికన్లు, అరబ్–అమెరికన్లు, దక్షిణాసియా వాసులు, బహుళ జాతుల కూటమికి చెందిన యూదు జాత్యహంకారాన్ని వ్యతిరేకించే విద్యార్థులంతా ఉన్నారు.

విద్యార్థులు వారి నిరసనలలో... ఇజ్రాయిల్ సాగిస్తున్న జాత్యహంకార యుద్ధాన్ని ఖండిస్తూ, గుడారాలు నిర్వహించడం ద్వారా, స్కూలు ప్రాంగణాలలో ప్రచారం చేయడం ద్వారా, విశ్వవిద్యాలయ భవనాలను ఆక్రమించి ప్రాంగణంలోని ఇతర కార్యకలాపాలను




అడ్డుకోవటం ద్వారా, పాలస్తీనా ప్రజానీకం పట్ల వారి సంఘీభావాన్ని తెలియజేస్తున్నారు.

ఈ నిరసనలు, ఆందోళన రూపాలు అమెరికాలోని ఇతర విశ్వవిద్యాలయ విద్యార్థులను ఉత్తేజపరుస్తున్నాయి. అదే తరహా గుడారాలతో ఆందోళనలు దేశవ్యాప్తంగా విస్తరించాయి. కాగా, ప్రాంగణాలలో భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించటానికి ఆమోదం

**(తరువాయి 26వ పేజీలో)**

# రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర మహాసభలు

## 2024 జూన్ 15, 16, 17 తేదీలు

**అల్లూరి సీతారామరాజు ప్రాంగణం** (టుబాకో మర్చంట్స్ అసోసియేషన్ హాల్) – **ఏలూరు**

**15-6-2024 శనివారం** ఉ.11 గం.కు

## ప్రారంభ సభ

సభాధ్యక్షులు :
**కామ్రేడ్ ఎస్. ఝాన్సీ,** రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు

స్వాగతోపన్యాసం :
**డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య,** ఆహ్వానసంఘం అధ్యక్షులు

ప్రారంభోపన్యాసం : **కామ్రేడ్ సుభోద్ మిత్ర,** ఏఐకెఎంకెఎస్ కన్వీనర్

ఉపన్యాసకులు : **కామ్రేడ్ అరవింద్ సిన్హా,** ఏఐఎఫ్‌టీయు(న్యూ) కార్యదర్శి
**శ్రీ పాకలపాటి రఘువర్మ,** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎం.ఎల్.సి

ఇతర రాష్ట్రాల, సౌహార్ధ ప్రతినిధుల, సోదర సంఘాల సందేశాలు ఉంటాయి.

మ. 3 గం॥కు **ప్రదర్శన**

సా. 5 గం॥కు **బహిరంగసభ**

**16-6-2024 ఆదివారం** ఉ. 10 గం॥కు

## వ్యవసాయరంగ సంక్షోభం – పాలకుల విధానాలు – మన కర్తవ్యాలపై సదస్సు

ప్రారంభకులు :
**శ్రీ వడ్డే శోభనాద్రీశ్వరరావు,** మాజీ వ్యవసాయ శాఖామంత్రి, ఎస్కేయం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్వీనర్

*ఈ సదస్సులో.....* వివిధ అంశాలపై వక్తల ప్రసంగాలు, తీర్మానాలు ఉంటాయి.

**17-6-2024 సోమవారం** ఉదయం 9 గంటలకు **సంస్థాగత కార్యక్రమాలు, నూతన కార్యవర్గ ఎన్నిక**

**ప్రజాకళాకారుల, ఆదివాసీ కళాకారుల సాంప్రదాయ నృత్యాలు, జనంపాటలు, వివిధ కళారూపకాలు, ప్రదర్శనలు ఉంటాయి.**

Printed, Published and Owned by S. Seshamma
32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
Printed at SVR Offset Printers & Binders, D.No. 24-29-128B, Garimallavari Street, Gulabithota, Vijayawada-3
Editor : S. Seshamma, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010